అనుదినం... జనస్వరం


www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సోమవారం 25-12-2023

సంపుటి : 9 | సంచిక : 354 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



మీరే వారధులు..

ప్రజాపాలనను విజయవంతం చేయండి

- ఆరు గ్యారెంటీలకు దరఖాస్తుల స్వీకరణ
- 28 నుంచి జనవరి 6 వరకు
- గ్రామసభల్లోనే లబ్దిదారుల ఎంపిక
- మాది ఫ్రెండ్లీ ప్రభుత్వం...తప్పుచేస్తే సహించం : కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

ప్రజలకు ప్రభుత్వానికి మధ్య అధికారులే వారధులు అనీ, తమ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి విజయవంతం చేయాల్సిన బాధ్యత వారిపైనే ఉన్నదని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. ఉద్యోగులు, అధికారులతో ఫ్రెండ్లీగా ఉంటామనీ, తప్పచేస్తే మాత్రం సహించబోమని హెచ్చరించారు. ఆదివారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన సమావేశమయ్యారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలు, ప్రభుత్వ ప్రాధాన్యతలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు వివరించారు.

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వాటిలో రెండింటిని ఇప్పటికే అమలు చేస్తున్నామనీ, మిగిలిన గ్యారెంటీల లబ్దిదారుల ఎంపిక కోసం ఈనెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు 'ప్రజాపాలన' పేరుతో ...13లో



కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

28 నుంచి దరఖాస్తుల స్వీకరణ

"ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను ముందుగా ప్రజలకు అందిస్తాం. ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు గ్రామసభల ద్వారా ఆ దరఖాస్తులు తీసుకుంటాం. అర్హత ఉన్నవారు గ్రామసభల్లో అధికారులకు దరఖాస్తులు అందజేయాలి. ప్రజలు దరఖాస్తులు ఇచ్చిన తర్వాత అధికారులు ఒక రసీదు ఇస్తారు. ఇందిరమ్మ పాలనలో అధికారులే ఇంటి వద్దకు వెళ్లి దరఖాస్తులు తీసుకుంటారు. గిరిజన గూడెంలో 10 ఇండ్లు ఉన్నా, చెంచులు ఉండే ప్రాంతాలు అయినా అధికారులే వాళ్ల దగ్గరికి వెళ్లి దరఖాస్తులు తీసుకోవాలి. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఎవరు ఏ పథకానికి అర్హులో అధికారులు నిర్ణయించాలి" అని స్పష్టం చేశారు.

ముందే గ్రామాలకు దరఖాస్తులు

గామ సభల్లో అప్లికేషన్లు అందిస్తే గందరగోళం ఏర్పడుతుంది. అందువల్ల గ్రామ కార్యదర్శులు, ఇతర వ్యవస్థలతో ముందే గ్రామానికి అప్లికేషన్లు పంపించాలి. ఆధారుకార్డు, ఫోటో వంటి వాటి విషయాలను ప్రజలకు ముందే చెప్పాలి. అమరవీరులు, ఉద్యమ కారులు ఉంటే వారికి సంబంధించిన ఎఫ్ఐఆర్, కేసుల వివరాలు తీసుకురావాల్సి ఉంటుంది. అందుకే ముందే అప్లికేషన్లు అందించడం ద్వారా గందరగోళాన్ని తగ్గించుకోవచ్చు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. సమాచారాన్ని సేకరించి డిజిటలైజ్ చేసి ప్రభుత్వానికి పంపిస్తే, వాటిని స్క్రూటినీ చేసి అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని స్పష్టం చేశారు.

ఏసు బోధనలు ఎప్పటికీ అనుసరణీయమే...

క్రిస్మస్ సందర్భంగా సీఎం రేవంత్ శుభాకాంక్షలు

నవతెలంగాణబ్యూరో-హైదారబాద్

ఏసు ప్రభువు బోధనలు ఆయన చూపిన శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వం, సహనమనే గొప్ప లక్షణాలు ఎప్పటికీ అనుసరణీయమని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని క్రైస్తవులకు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో సెక్యులర్ ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. మతసామరస్యాన్ని కాపాడుకుంటూ, పరిపాలన పారదర్శకంగా, ప్రజాస్వామికంగా సాగుతుందని పేర్కొన్నారు. క్రిష్టియన్ సోదరులు సంతోషంతో, ఆనందోత్సహాలతో క్రిస్మస్‌ను జరుపుకోవాలనీ, క్రీస్తు మార్గాన్ని అనుసరించి సమాజ అభివృద్ధి కోసం అందరు పాటుపడాలని సూచించారు. క్రీస్తు బోధనలు ఆచరణీయమని ఆయన మార్గం అనుసరణీయమని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ...13లో

ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులు

ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమిస్తూ...రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

మంత్రులు	జిల్లా
ఎస్. ఉత్తమ్ కుమార్ రెడ్డి	-కరీంనగర్
దామోదర రాజనరసింహ	- మహబుబ్ నగర్
కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి	-ఖమ్మం
దుద్దిళ్ల శ్రీధర్ బాబు	- రంగారెడ్డి
పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి	- వరంగల్
పొన్నం ప్రభాకర్	- హైదరాబాద్
కొండా సురేఖ	-మెదక్
సీతక్క	- ఆదిలాబాద్
తుమ్మల నాగేశ్వరరావు	-నల్గొండ
జూపల్లి కృష్ణారావు	-నిజామాబాద్

ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీ

పేరు	ప్రస్తుతం	బదిలీ
బుద్ధ ప్రకాశ్	ఎక్సైజ్ శాఖ	రవాణా శాఖ
ఈ.శ్రీధర్	గిరిజన సంక్షేమ శాఖ	ఎక్సైజ్ శాఖ
భారతి హోలికేరి	కలెక్టర్ రంగారెడ్డి	జీఏడీ
గౌతం పొత్రు	కలెక్టర్ మేడ్చల్ మల్కాజిగిరి	రంగారెడ్డి కలెక్టర్
శృతిహోజా	అదనపు కమిషనర్	జీహెచ్ఎంసీ డైరెక్టర్ ఇంటర్‌బోర్డు
ఈవీ నరసింహ రెడ్డి	వెయిటింగ్	డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్
దేవేంద్ర సింగ్ చౌహాన్ (ఐపీఎస్)	వెయిటింగ్	కమిషనర్ సివిల్‌సప్లయ్

రెజ్లర్ల పోరుతో దిగొచ్చిన కేంద్రం

నూతన ప్యానెల్ రద్దు చేసిన ప్రభుత్వం



న్యూఢిల్లీ : భారత రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) నూతన కార్యవర్గాన్ని రద్దు చేయాలని రెజ్లర్లు తాజాగా చేపట్టిన పోరాటానికి కేంద్రం దిగరాక తప్పలేదు. డబ్ల్యూఎఫ్ఐ నూతన ప్యానెల్‌ను రద్దు చేస్తున్నట్టు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఆదివారం ప్రకటించింది. కొత్తగా ఎన్నికైన ప్యానల్ తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటుందని క్రీడా మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. డబ్ల్యూఎఫ్ఐ నియమాలను, నిబంధనలను నూతన ప్యానెల్ పూర్తిగా విస్మరించిందని విమర్శించింది. అలాగే డబ్ల్యూఎఫ్ఐ వ్యవహారాలను నియంత్రించడానికి, నిర్వహించడానికి ఒక తాత్కాలిక సంస్థను ఏర్పాటు చేయాలని ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఎ)ను క్రీడా మంత్రిత్వ శాఖ కోరింది. ఈ మేరకు ఐఓఎకు లేఖ రాసింది. డబ్ల్యూఎఫ్ఐను రద్దు చేయలేదని స్పష్టం చేసింది.

కోర్టు కేసులతో సుదీర్ఘంగా వాయిదా పడుతూ వచ్చిన భారత రెజ్లింగ్ సమాఖ్య ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నికలు డిసెంబర్ 21న ముగిశాయి. మాజీ అధ్యక్షుడు, లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ సన్నిహితుడు సంజయ్ సింగ్ ఇటీవల ఎన్నికల్లో కొత్త ప్రెసిడెంట్‌గా ...6లో

స్వాగతిస్తున్నాం : సాక్షి మాలిక్

ఏదైనా మంచి జరగడానికి ఇది మొదటి అడుగు. మేము ఏ కారణం కోసం పోరాడుతున్నామో దానిని ప్రభుత్వం మరింతగా అర్థం చేసుకుంటుందని నేను నమ్మకంగా ఉన్నాను. ఫెడరేషన్‌కు మహిళా అధ్యక్షురాలు ఉంటే, అది మహిళా రెజ్లర్ల భద్రత కు మంచిది. ఇది దేశంలోని సోదరీమణులు, కుమార్తెల కోసం జరిగిన పోరాటం.

పద్మశ్రీని వెనక్కి తీసుకోను

బజరంగ్ పునియా

కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాను. అయితే, పద్మశ్రీ నేను వాపస్ ఇచ్చాను. దానిని మళ్లీ తిరిగి తీసుకోను. మన సోదరీమణులు కుమార్తెల గౌరవం కంటే ఏ అవార్డు గొప్పది కాదు. న్యాయం జరిగిన తర్వాతే పద్మశ్రీని వెనక్కి తీసుకోవడం గురించి ఆలోచిస్తాను.

కంగారూను కొట్టేశారు

- ఆసీస్‌పై భారత్ చారిత్రక టెస్టు విజయం
- వాంఖడేలో అమ్మాయిల అద్వితీయ ప్రదర్శన
- 8 వికెట్ల తేడాతో అద్భుత విజయం
- 1-0తో టెస్టు సిరీస్ భారత్ వశం



వివరాలు ఆటలులో..

జేఎన్.1 ఆందోళనకరం కాదు... హెచ్చరికే...

- దీనికంటే ఫ్లూ జ్వరమే ప్రమాదకరం
- నాలుగో డోస్ మంచిదే
- వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి : ప్రముఖ వైరాలజిస్ట్ షాహిద్ జమీల్ వివరాలు 6లో

అబద్ధాల పుట్ట.. తప్పుల తడక..



సర్కార్ శ్వేతపత్రంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- అసెంబ్లీ సాక్షిగా అప్పులపై ప్రభుత్వం అసత్యాలు చెప్పిందంటూ విమర్శ
- తమ హయాంలో తీసుకున్న స్థూల రుణాలు రూ.3,17,015 కోట్లేనని స్పష్టీకరణ
- బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల ప్రగతి ప్రస్థానంపై 'స్వేదపత్రం' విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల శాసనసభలో ప్రవేశపెట్టిన శ్వేతపత్రం ఒక అబద్ధాల పుట్టని, తప్పుల తడకని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. తమ పార్టీనీ, గత ప్రభుత్వాన్నీ బద్నాం చేసేందుకే కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగా అప్పులపై అసత్యాలను వల్లె వేసిందని ఆయన విమర్శించారు. తమ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో తీసుకున్న స్థూల రుణాలు రూ.3,17,015 కోట్లేనని చెప్పారు. కానీ అందుకు భిన్నంగా రాష్ట్ర అప్పులు రూ.6.71, 757 కోట్లుగా చూపించారని ఆయన తెలిపారు. విద్యుత్, ఆర్టీసీ, పౌర సరఫరాల శాఖల్లో లేని అప్పులను ఉన్నట్టుగా చూపించారని వాపోయారు. తమ హయాంలో పెట్టిన ఖర్చు కంటే పెరిగిన సంపద పది రెట్లు ఎక్కువని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని గుర్తించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. సంబంధిత లెక్కలు, అంకెలు, సంఖ్యలు, గణాంకాలతో 'స్వేదపత్రం' అనే డాక్యుమెంట్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చిన ఆయన... తొమ్మిదన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధిని సోదాహరణంగా వివరించారు. ముఖ్యంగా వ్యవసాయం, విద్యుత్, సాగు, తాగు నీరు, అడవుల సంరక్షణ, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి తదితరాంశాల్లో చేపట్టిన సంస్కరణలను ఏకరువు పెట్టారు. పెద్ద నోట్ల రద్దు, కరోనా మహమ్మారి, విభజన కష్టాల వల్ల రాష్ట్రం నష్టపోయిన తీరు గురించి చెప్పారు. తమ ఏలుబడిలో రెండో హరిత విప్లవం (వ్యవసాయం), గులాబీ (గొర్రెలు, ఇతర జీవాలు), నీలి (చేపలు), శ్వేత (పాలు), పసుపు విప్లవా(ఆయిల్ పామ్)లను సాధించామని తెలిపారు.

బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఆస్తులను పెంచటంతోపాటు అస్థిత్వాన్ని సైతం కాపాడామని కేటీఆర్ ఈ సందర్భంగా చెప్పారు. పెండింగ్ ప్రాజెక్టుల్లో చాలా వాటిని పూర్తి చేశామని తెలిపారు. వాటికి ఇప్పుడు కాల్వలు తవ్వి, నీళ్లు ఇవ్వాలంటూ ప్రభుత్వానికి సూచించారు. కాళేశ్వరం లాంటి పెద్ద ప్రాజెక్టులో ...2లో

మల్కాజిగిరిపై నజర్...



ప్రధాన పార్టీల్లో మొదలైన కసరత్తు

- అసెంబ్లీ ఎన్నికలపై లోతైన విశ్లేషణ
- ఎంపీ అభ్యర్థుల ఎంపికపైనా కసరత్తు
- వ్యూహాలకు పదును పెడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికల కోసం ప్రధాన రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో ఉన్నాయి. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్.. ఎంపీ ఎన్నికల్లోనూ పై చేయి సాధించేందుకు ఇటీవల ఇన్‌చార్జీలనూ నియమించింది. రాష్ట్రంలో అధికారం కోల్పోయినా ఈ నియోజవర్గాల్లోని అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ మరింత ఓటు శాతం పెంచుకోవడంపై దృష్టి పెట్టింది. మరోవైపు బీజేపీ బలం పెంచుకునేందుకు ప్రయత్నం చేస్తున్నది.

ఎవరి ధీమా వారిదే

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మల్కాజిగిరి ఒక్కటే పార్లమెంట్ స్థానం ఉంది. ఇక్కడి నుంచి గెలుపొందిన రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో లోక్‌సభ స్థానానికి రాజీనామా చేశారు. దీనికి తోడు పార్లమెంట్ ఎన్నికలు కూడా దగ్గరపడటంతో ఈ స్థానంపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఎవరికి వారు గెలుపు వ్యూహాలకు పదును పెడుతూ అభ్యర్థులను బరిలో దింపే యోచనలో ఉన్నాయి. విజయోత్సాహంలో ఉన్న కాంగ్రెస్ మరింత దూకుడు పెంచి అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తోంది. మల్కాజిగిరి ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షునిగా రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేసి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి సీఎం అయిన రేవంత్‌రెడ్డి తన సిట్టింగ్ స్థానంపై ఫోకస్ పెట్టినట్టు పార్టీలు వర్గాలు చెబుతున్నాయి. ఈ పార్లమెంట్ పరిధిలోకి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు రంగారెడ్డి జిల్లాలోని ఎల్బీనగర్ నియోజకవర్గం కూడా వస్తుంది. ఈ ఆరు నియోజకవర్గాల్లోనూ ...13లో

రెడ్‌సీలో రణరంగం

సముద్రంలో కార్గో నౌకలపై హౌతీ దాడులు

- డ్రోన్లు, క్షిపణుల ప్రయోగం
- అంతర్జాతీయ వాణిజ్యంపై ప్రభావం
- పెరగనున్న చమురు, నిత్యావసరాల ధరలు
- భారత్‌లోనూ ఆందోళన



వివరాలు 3లో

ప్రపంచ గమనం

మధ్యప్రాచ్యంలో మహాపోరు

- అమెరికా, ఇజ్రాయిల్ లను ఎదుర్కొంటున్న హౌతీ మిలిటెంట్లు



ఇజ్రాయిల్ గాజాపైన చేస్తున్న ఘోరమైన మానవ హననాన్ని ఎదుర్కునేందుకు యెమెన్ లో అన్సరల్లా నాయకత్వంలోని హౌతీ మిలిటెంట్లు సిద్ధపడ్డారు. ముందుగా ఇజ్రాయిల్ వైపు డ్రోన్లను, క్రూయిజ్ మిసైల్లను ప్రయోగించిన హౌతీ మిలిటెంట్లు ఆ తరువాత ఎర్ర సముద్రం గుండా ప్రయాణిస్తున్న ఇజ్రాయిల్ కి చెందిన నౌకల రవాణాను అడ్డుకోవటం మొదలెట్టారు. అంతేకాకుండా ఎర్ర సముద్రంలోని ఏకైక ఇజ్రాయిలీ ఓడ రేవు ఐలాత్ కు వచ్చే రవాణా మార్గాన్ని పూర్తిగా మూసివేశారు. హౌతీ మిలిటెంట్లు అనేక నౌకలను స్వాధీనం చేసుకుని, మరెన్నో నౌకలపైన డ్రోన్లతో దాడులు చేస్తున్నారు. దానితో ఐలాత్ ఓడరేవులో కార్యకలాపాలు 85శాతం మేరకు స్తంభించాయి. పర్యవసానంగా అంతర్జాతీయ, ఇజ్రాయిలీ షిప్పింగ్ కంపెనీలు దక్షిణాఫ్రికాను చుట్టివచ్చే, 12రోజులు అదనంగా పయనించవలసివచ్చే సుదూర మార్గాన్ని ఎంచుకుంటున్నాయి.


హౌతీ మిలిటెంట్ల దాడులను అడ్డుకోవటానికి ఒక బహుళ దేశ నౌకా దళాన్ని ప్రవేశపెట్టాలని అమెరికా రక్షణ కార్యదర్శి లాయిడ్ ఆస్టిన్ చేసిన సూచనపట్ల ఆ ప్రాంతంలోని దేశాలైన సౌదీ అరేబియా, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఏమాత్రం ఆసక్తిని చూపటం లేదు. అంతర్జాతీయ న్యాయ సూత్రాల ప్రకారం ఒక ప్రాంతంలో సైన్యాన్ని ప్రవేశపెట్టాలంటే ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానం మద్దతు అవసరం ఉంటుంది. అది అందుబాటులోలేని స్థితిలో అమెరికా మరో విదేశీ జోక్యానికి సిద్ధపడినట్టయింది. ఇలా అమెరికా చేసుకోదలిచిన జోక్యానికి ప్రాంతీయ దేశాల మద్దతు కొరవడటం అమెరికా ప్రాబల్య క్షీణతను సూచిస్తోంది. అంతేకాకుండా అమెరికా జోక్యం యెమెన్ కు చెందిన అన్సరల్లా స్థాయిని పెంచింది. 2014లో అప్పటి యెమెన్ అధ్యక్షుడు అబ్బ్రబు మన్సూర్ కి వ్యతిరేకంగా సాగిన ఒక ప్రజా ఉద్యమం ద్వారా అన్సరల్లా అధికారంలోకి వచ్చాడు. 2015లో యెమెన్ రాజధాని సనాలో అన్సరల్లా అధికారాన్ని కూలదోయటానికి సౌదీ అరేబియా నేతృత్వంలో అమెరికా మద్దతుతో యెమెన్ లో 7సంవత్సరాలపాటు చేసిన సైనిక జోక్యంలో దాదాపు 4లక్షల మంది ప్రజలు మరణించారు. అయినప్పటికీ అన్సరల్లా అధికారాన్ని కదిలించలేకపోయారు.

పశ్చిమ దేశాల కార్పొరేట్ మీడియా "ఇరాన్ మద్దతుగల తిరుగుబాటుదారులు" అని పిలిచే అన్సరల్లా నాయకత్వంలోని హౌతీ మిలిటెంట్ల సాయుధ సామర్థ్యం ఏమిటో పైన వివరించిన యుద్ధం తెలియజేస్తుంది. హౌతీ మిలిటెంట్లను ఎదుర్కోవటానికి అమెరికా ప్రతిపాదించిన బహుళ జాతి నౌకా దళం ఈ మిలిటెంట్లు ఆ ప్రాంతంలో ప్రాబల్యంగల శక్తి అని చెప్పకనే చెబుతోంది. సనాలోని అన్సరల్లా ప్రభుత్వాన్ని కూలదోయటానికి అమెరికా చేసిన ప్రయత్నంవల్ల యెమెన్ లో ఒక బలమైన సైనిక శక్తి ఆవిర్భవించింది. 2021లో అమెరికా విదేశాంగ విధానంపైన అధ్యక్షుడు జో బైడెన్ చేసిన ఉపన్యాసంలో యెమెన్ లో జరుగుతున్న యుద్ధానికి ముగింపు పలకాలని చెప్పాడు. అయితే యెమెన్-సౌదీ అరేబియాల మధ్య సంధి కుదర్చటానికి బదులుగా అమెరికా సౌదీ అరేబియా-ఇజ్రాయిల్ ల మధ్య ఒప్పందాన్ని కుదిర్చింది. ఆ తప్పే ఇప్పుడు అమెరికా విధాన నిర్ణేతలను ఎక్కిరిస్తోంది.

గాజాపైన ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధానికి అపరిమిత స్థాయిలో మద్దతునిస్తున్న అమెరికా యుద్ధాన్ని అరబ్-ఇజ్రాయిల్ యుద్ధంగా పరిణామం చెందేలా చేస్తోంది. ఇజ్రాయిల్ సైన్యం లెబనీస్ హెజ్బొల్లా మిలిటెంట్లతో తలపడటం రోజురోజుకూ దగ్గరౌతోంది. గాజాపైన ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధానికి అమెరికా ఇస్తున్న అపరిమిత మద్దతు పశ్చిమ ఆసియాలో అమెరికాను ఏకాకిని చేస్తోంది. ఆ ప్రాంతంలోని దేశాలన్నీ గాజాపైన తక్షణం యుద్ధం ఆపాలని రష్యా, చైనాలు చేస్తున్న డిమాండ్ కు తమ మద్దతునిస్తున్నాయి. అమెరికా పాటిస్తున్న ద్వంద ప్రమాణాలను ప్రపంచ దేశాలు గమనిస్తున్నాయి. కేవలం రెండు నెలలలో 23వేల మందిని ప్రధానంగా మహిళలను, పిల్లలను హతమార్చటం చరిత్రలో ఒక మచ్చగా మిగిలిపోతుంది. గాజాలాంటి ఒక చిన్న ప్రాంతంలో ఇంతగా మానవ హననం జరగటం ఆధునిక చరిత్రలో కనపడదు. ఇంత జరుగుతున్నా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో కాల్పుల విరమణ తీర్మానాలను అమెరికా పదేపదే అడ్డుకుంటోంది. ప్రస్తుతం తన కూటమిలోని దేశాలను యెమెన్ పైన యుద్ధం చేయటానికి లాగుతోంది. గాజాపైన ఇజ్రాయిల్ యుద్ధ విరమణను ప్రకటిస్తేనే ఎర్ర సముద్రంలో రవాణా నౌకలపైన తమ దాడులు ఆగుతాయని అన్సరల్లా ప్రకటించాడు. యుద్ధాన్ని ఆపే శక్తి అమెరికాకు ఉన్నా ఆపటానికి సిద్ధపడటం లేదు. యెమెన్ పైన అమెరికా కూటమి దేశాలు యుద్ధాన్ని ప్రకటిస్తే అది యుద్ధ విస్తరణకే దారితీస్తుంది తప్ప సమస్యను పరిష్కరించటానికి ఉపయోగపడదు.

ప్రపంచ చెల్లింపులలో యువాన్ వాటా పైపైకి..

- నాలుగో స్థానానికి ఎగబాకింది..గ్లోబల్ ఫైనాన్షియల్ మెస్సేజింగ్ సర్వీస్ "స్విఫ్ట్" డేటా



2023 నవంబర్ నెలలో ప్రపంచ చెల్లింపులలో క్రియాశీలంగా ఉపయోగిస్తున్న కరెన్సీలలో చైనీస్ యువాన్ నాలుగవ స్థానానికి ఎగబాకిందని గ్లోబల్ ఫైనాన్షియల్ మెస్సేజింగ్ సర్వీస్ "స్విఫ్ట్" సేకరించిన డేటా సూచిస్తోంది. ఈ వారంలో స్విఫ్ట్ విడుదలచేసిన నివేదిక ప్రకారం చైనీస్ యువాన్ ను 4.61శాతం లావాదేవీలలో వినియోగించారు. అక్టోబర్ నెలలో ఇది 3.60శాతంగా ఉండి 3.91శాతం నుంచి 3.41శాతానికి దిగజారిన జాపనీస్ యెన్ వాటాను అధిగమించింది. మొత్తంమీద యువాన్ చెల్లింపుల విలువ అక్టోబర్ తో పోల్చినప్పుడు 34.87శాతం పెరిగింది. 2022 నవంబర్ నుంచి వార్షికంగా చూచినప్పుడు 2.37శాతంగావున్న యువాన్ గ్లోబల్ షేర్ దాదాపు రెండింతలు అయింది.

నవంబర్ నెలలో ప్రపంచంలోని టాప్ కరెన్సీల వాటా క్షీణించింది. అమెరికన్ డాలర్ వాటా అక్టోబర్ లో 47.25శాతంవుండగా నవంబర్ కల్లా అది 47.08శాతానికి పడిపోయింది. యూరో వాటా 23.36శాతం నుంచి 22.95శాతానికి, బ్రిటీష్ పౌండ్ వాటా 7.33శాతం నుంచి 7.15శాతానికి పడిపోయాయి. అంతర్జాతీయ వాణిజ్యంలో చైనా యువాన్ వాటా పెరగటం డాలర్ నుంచి తాను దూరమవటాన్ని, తన కరెన్సీని చైనా ప్రమోట్ చేయటాన్ని సూచిస్తోందని స్విఫ్ట్ నివేదిక తెలుపుతోంది. రష్యా, మధ్యప్రాచ్య, దక్షిణ అమెరికా దేశాల వాణిజ్యంలో తన కరెన్సీలో లావాదేవీలు జరిగేలా చైనా ప్రోత్సహిస్తోందని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు.

అబద్ధాల పుట్ట..తప్పుల తడక..

(మొదటిపేజీ తరువాయి)

ఒక బ్యారేజీలో చిన్న తప్పు దొర్లితే మొత్తం ప్రాజెక్టునే లోపభూయిష్టంగా పేర్కొనటం శోచనీయమన్నారు. రైతుల సహజ మరణాలను సైతం అన్నదాతల ఆత్మహత్యలుగా చిత్రీకరించటం కాంగ్రెస్ సర్కారుకే చెల్లిందని విమర్శించారు. ఉచిత కరెంటు, భూ గర్భ జలాలు పెరగటం తదితర వెసులుబాట్ల వల్ల వ్యవసాయ మోటార సంఖ్య బాగా పెరిగిందని చెప్పారు. దీనిపై కూడా సీఎం రేవంత్ వ్యంగ్యంగా మాట్లాడటం దారుణమన్నారు. అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు. దాన్ని ఖర్చుగా చూడకూడదని, భవిష్యత్ తరాలకు పెట్టుబడిగా భావించాలని అన్నారు. తెలంగాణ సంపదను అగౌరవపరిస్తే సహించబోమన్నారు. 'అది ఒక దీపస్తంభం లాంటిది, దాన్ని ఆరిపోనివ్వం.. ఆగిపోనివ్వం.. నిలబెడతాం...' అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రాజెక్టులపై న్యాయ విచారణకు ఆదేశిస్తామంటూ ప్రభుత్వం చెబుతోంది.. మేం ఎలాంటి విచారణకైనా సిద్ధం... అని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

చెప్పుకోలేక పోయాం...

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ వైపు నుంచి కొన్ని తప్పులు జరిగిన మాట వాస్తవమేనని కేటీఆర్ ఈ సందర్భంగా అంగీకరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు అత్యధిక వేతనాలు, అత్యధిక మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన తదితరాంశాలను సరిగ్గా చెప్పుకోలేకపోయామని అన్నారు. ప్రతీ ఎన్నికల్లోనూ గెలుపోటములు సహజమేనని తెలిపారు. ప్రస్తుత ఓటమి తమ పార్టీకి స్పీడ్ బ్రేకర్ లాంటిదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలతోపాటు ఇంకా 412 హామీలను అమలు చేయాల్సి ఉందన్నారు. అందువల్ల వాటన్నింటినీ పూర్తి చేయాలని సూచించారు.

ప్రజా దర్బార్ పట్టించుకోలేదు : అన్నపూర్ణను ఆదుకున్న కేటీఆర్



ప్రజాదర్బార్‌లో నాలుగు సార్లు విన్నవించినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగిన అన్నపూర్ణ అనే మహిళను మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదుకున్నారు. తన ఆర్థిక కష్టాలను, తన పిల్లల చదువుల ఇబ్బందులను, తన దుర్భరమైన జీవితాన్ని వివరిస్తూ తమను ఆదుకోవాలని ఆమ ప్రజాదర్బార్‌లో కోరారు. అయితే ఫలితం లేకపోవడంతో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలవడంతో ఆమె కూతురు నర్సింగ్ చదువుకునేందుకు రూ.ఒక లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. కేటీఆర్‌కు అన్నపూర్ణ ధన్యవాదాలు తెలిపారు.

శ్వేదపత్రంలోని ముఖ్యాంశాలు... తలసరి ఆదాయం (రూ.)	
2013-14	2022-23
1,12,162	3,17,115
జీఎస్డీపీ (లక్షల కోట్లు)	
2013-14	2022-23
4.51	13.27
పేదరికం	
2013-14	2022-23
21.92	5.8

విద్యుత్ రంగం

- ఈ రంగంపై పెట్టిన ఖర్చు రూ.1,37,517 కోట్లు
- స్థాపించిన విద్యుత్ సామర్థ్యం 2013-14లో 7,778 మెగావాట్లు, 2022-223 నాటికి అది 19,464 మెగావాట్లకు పెరిగింది
- తలసరి విద్యుత్ వినియోగం 2013-14లో 1,196 యూనిట్లుగా ఉంది. 2022-23 నాటికి అది 2,140 యూనిట్లకు పెరిగింది.
- రాష్ట్ర పీక్ డిమాండ్ 2013-14లో 5,661 మెగావాట్లు, 2022-23 నాటికి అది 15,497 మెగావాట్లకు పెరిగింది.
- మోటారు కనెక్షన్లు 2013-14లో 19 లక్షలుగా ఉంటే, 2022-23 నాటికి వాటి సంఖ్య 28 లక్షలకు పెరిగింది.

బడ్జెట్ అప్పులు (రూ.కోట్లలో) 3,89,673

- పాత బడ్జెట్ రుణాలు (రూ.కోట్లలో) 72,658
- స్థూలంగా బడ్జెట్ రుణాలు (రూ.కోట్లలో) 3,17,015 (6,71,757 కాదు)
- ఎస్‌పీవీలు (ప్రభుత్వ గ్యారెంటీలు ఉన్నవి రూ.కోట్లలో) 1,27,208
- ఎస్‌పీవీలు (రూ.కోట్లలో) 95,462
- ప్రభుత్వ హామీలేని రుణాలు (రూ.కోట్లలో) 59,414
- పౌర సరఫరాల శాఖ లోన్లు రూ.21,029 కోట్లు మాత్రమే (వీటిని కాంగ్రెస్ ప్రభుత్వం రూ.56,146 కోట్లుగా చూపింది-లేని రూ.35 వేల కోట్లను అదనంగా చూపించారు)
- తమ పరపతితో కట్టుకునే బడ్జెటేతర అప్పు స్థూలంగా రూ.2,46,969 కోట్లు
- ఆర్టీసీ, విద్యుత్, పౌర సరఫరాలశాఖలో లేని అప్పులను ఉన్నట్టుగా చూపారు.



వ్యవసాయ రంగం...

- ఉచిత విద్యుత్ కోసం రూ.36,899 కోట్లు ఖర్చు
- మొత్తం 58.29 లక్షల మందికి రూ.30 వేల కోట్ల మేర రుణాల మాఫీ
- రైతు బీమా కోసం రూ.6,861 కోట్ల ప్రీమియం చెల్లింపు
- తొమ్మిదేండ్లలో రూ.1,34,768 కోట్ల విలువైన ధాన్యం కొనుగోళ్లు (723 లక్షల మెట్రిక్ టన్నులు)

నిన్న ఉపరాష్ట్రపతి..ఇపుడు ప్రధాని మోడీ

- మరోసారి టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ మిమిక్రీ
- కళను ప్రదర్శిస్తే.. విమర్శలు తగవు..బెనర్జీ



టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ మరోసారి వార్తల్లో నిలిచారు. పార్లమెంట్ బయట రాజ్యసభ చైర్మెన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌ను అనుకరిస్తూ మిమిక్రి చేస్తే..తాజాగా తన పార్లమెంటరీ నియోజకవర్గం శ్రీరాంపూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌తో పాటు ప్రధాని మోడీని కూడా బెనర్జీ అనుకరించారు.

ఇక్కడ జరిగిన ర్యాలీలో కళ్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి ధన్కర్ తన పదవికి ఉన్న రాజ్యాంగ గౌరవాన్ని నాశనం చేస్తున్నారని అన్నారు. ఎందుకంటే పదవిపై దురాశతో ప్రధాని మోడీకి లొంగిపోతున్నారు. తనను తాను రైతు కొడుకు అని చెప్పుకునే ధన్కర్‌కు జోధ్‌పూర్‌లో కోట్ల ఆస్తి ఉందని కళ్యాణ్ చెప్పారు. ఢిల్లీలో విలాసవంతమైన ఫ్లాట్‌ని కలిగి ఉన్నారని. రోజూ లక్ష రూపాయల సూటు వేసుకుంటారని ఆరోపించారు.

ప్రధాని మోడీని అనుకరిస్తూ..

పార్లమెంట్ భద్రతకు విఘాతం కలిగించారంటూ ప్రధాని మోడీని టార్గెట్ చేశారు. కేవలం చరిత్ర పుటల్లో తన పేరును లిఖించేందుకే ప్రధాని మోడీ హడావుడిగా కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించారని, అయితే అందుకు ప్రతిగా ఎంపీల భద్రత విషయంలో రాజీపడ్డారని కళ్యాణ్ అన్నారు. ఆ ఇద్దరికి పాస్‌లు జారీ చేసింది ఒక్క బీజేపీ ఎంపీ మాత్రమే.

ఆయన్ను కాపాడేందుకు ప్రతిపక్షాలకు చెందిన 146 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. ఉపరాష్ట్రపతిని మిమిక్రీ చేసిన ఘటనను ఓ కళగా అభివర్ణించిన కళ్యాణ్ బెనర్జీ.. ఉపరాష్ట్రపతి చిన్న స్కూల్ పిల్లాడిలా చిన్నపాటి విషయానికే పెడబొబ్బలు పెట్టారని అన్నారు.

నా లోక్‌సభ నియోజకవర్గ ప్రజలకు మాత్రమే జవాబుదారీగా ఉంటానని, మరెవరికీ నేను జవాబుదారీ కానని టీఎంసీ నేత స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ప్రధాని మోడీని అనుకరించారు. నరేంద్ర మోడీ, అమిత్ షాల ప్రభుత్వాన్ని ఎప్పుడు పడగొట్టాలన్న విషయాలను ఏకరువు పెట్టారు.

ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ పై చర్యలు తీసుకోవాలి

ఫార్మసిస్టుల ధర్నా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్, జూనియర్ క్లర్క్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు ఫార్మసిస్టులు డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన ధర్నాలో తెలంగాణ ఫార్మా సొసైటీ అధ్యక్షులు ఆకుల సంజయ్ రెడ్డితో పాటు తేజ, శివకుమార్, కొలిపాక బాలరాజు, మాదెం ప్రభాకర్, కన్నెబోయిన శ్రీనివాస్, కంభంపాటి శ్రీకాంత్, ఎం.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయనీ, ఫార్మసిస్టుల సంతకాలు వెరిఫై చేయాలని కోరారు. కౌన్సిల్ 29,594 ఓట్లు మాత్రమే చూపిస్తున్నదనీ, మిగతా 23,406 ఓట్లు ఎటు పోయాయని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో కౌన్సిల్ నుంచి కోటి రూపాయలు దుర్వినియోగం చేశారని ఆరోపించారు.

20 వేల పోస్టల్ బ్యాలెట్ లో 6,500 తిరస్కరించడానికి గల కారణాలు ఏమిటి.? అని ప్రశ్నించారు. రిజిస్ట్రార్ యోగానందం, జూనియర్ క్లర్క్ గోపి, కార్యాలయ సిబ్బంది అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో ఎంక్వైరీ కమీషన్ వేయాలని కోరారు.

లక్షమంది కార్మికులు తైవాన్‌కు పోతున్నారా..?

- యూఎస్ నివేదికపై దుమారం



న్యూఢిల్లీ : భారతదేశం నుంచి తైవాన్‌కు లక్ష మంది కార్మికులు పోతున్నారన్న యూఎస్ నివేదికపై తైవాన్ కార్మిక మంత్రి సు మింగ్-చున్ నుంచి వెలువడిన ఒక ప్రకటన కలకలం రేపింది. మంత్రి సు మింగ్-చున్ మాట్లాడుతూ.. భారతదేశం నుంచి 1 లక్ష మంది వలస కార్మికులను తైవాన్‌కు తీసుకురావడానికి మా ప్రభుత్వానికి ఎలాంటి ప్రణాళిక లేదు. ఈ అంశం ఉపాధి సహకారానికి సంబంధించిన అంశమని తెలిపారు. వలస కార్మికులను తీసుకురావడానికి తైవాన్ భారత్‌తో ఎలాంటి అవగాహనా ఒప్పందం (ఎంఓయూ)పై సంతకం చేయలేదని సు మింగ్-చున్ చెప్పారు.

అయితే లక్ష మంది భారతీయ కార్మికులకు తలుపులు తెరిచేందుకు తైవాన్ తన డిమాండ్‌కు సంబంధించి చేసిన ఏవైనా వాదనలు నకిలీవని సు మింగ్-చున్ నొక్కి చెప్పారు. ఎన్నికల ప్రయోజనాల కోసం ప్రజల అభిప్రాయాలను తారుమారు చేయాలనే దురుద్దేశంతో ఈ వాదనలు చేస్తున్నారని ఆయన అన్నారు. సు మింగ్ యొక్క ఈ వ్యాఖ్య కుమింటాంగ్ (కేఎంటీ) అధ్యక్ష అభ్యర్థి హౌ యు-ఇహ్ ఇచ్చిన ప్రకటన సందర్భంలో వచ్చింది.

వార్తా సంస్థ ప్రకారం, సీఎన్ఏ నివేదించిన ప్రకారం, భారతీయ వలస కార్మికులను తీసుకురావడానికి ఎంఓయూ కుదుర్చుకున్నట్టు (కేఎంటీ) నామినీ హౌ మీడియా నివేదికను ఉదహరించిన తర్వాత సు మింగ్-చున్ సంతకంతో ఉన్న ప్రకటన వచ్చింది.

నివేదికలో ఏమున్నదంటే...

ఎంప్లాయి మొబిలిటీ అగ్రిమెంట్ ప్లాన్ చేస్తున్నట్టు ఈ నివేదికలో పేర్కొన్నారు. లక్ష మందికి పైగా భారతీయ వలస కార్మికులను తైవాన్‌కు తీసుకువచ్చే ఒప్పందంపై ఈ ఏడాది డిసెంబర్‌లో సంతకం చేయవచ్చని కొంతమంది సీనియర్ అధికారులు అమెరికన్ మీడియా నివేదికల ద్వారా పేర్కొన్నారని తైవాన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (సీఎన్ఏ) తెలిపింది.

తైవాన్ , భారతదేశంల మధ్య... వలస కార్మికులను తీసుకురావడానికి ఏడాది చివరి నాటికి అవగాహన ఒప్పందంపై సంతకం చేయడానికి ఇరుదేశాలు సిద్ధంగా ఉన్నాయని నవంబర్‌లో హెచ్ఎస్‌యూ చెప్పిందని హౌ కార్యాలయం శనివారం తెలిపింది, 2023 ముగియడానికి ఇంకా 8 రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున. ఎంఓయూపై ఎప్పుడు సంతకం చేస్తారు, ఒప్పందం ప్రకారం ఎంత మంది భారతీయ కార్మికులు తైవాన్‌కు వస్తారో హెచ్ఎస్‌యు స్పష్టం చేయాలి. నవంబర్ 13న స్థానిక మీడియాతో మాట్లాడిన హ్సు మింగ్-చున్, క్యాబినెట్ ఈ ప్రణాళికపై సంతకం చేసిన తర్వాత వలస కార్మికులను తీసుకురావడానికి తైవాన్ , భారతదేశం సంవత్సరాంతానికి ఎంఓయూ సంతకం చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు.

క్షమ, ప్రేమకు మించిన గుణంలేదు

- ఏసు ప్రభువును స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలి : మంత్రి సి.దామోదర్ రాజనర్సింహా గిఫ్ట్‌ప్యాక్‌ల అందజేత

నవతెలంగాణ-జోగిపేట



క్షమ, ప్రేమకు మించిన గుణం లేదనే గొప్ప సందేశాన్ని.. ఏసు ప్రభువు 2వేల ఏండ్ల క్రితం తన త్యాగం ద్వారా చెప్పారని వైద్యారోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహా అన్నారు. సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్‌హాల్‌లో క్రైస్తవ సోదరులకు ప్రభుత్వం తరపున క్రిస్మస్ గిఫ్ట్ ప్యాకెట్‌లను ఆదివారం రాత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ధర్మాన్ని కాపాడేందుకు ఏసు ప్రభువు లాగా మన పాత్ర ఉండాలన్నారు. సమాజంలో గెలుపు, ఓటములు నిరంతర ప్రక్రియ అన్నారు. ప్రసంగాలు వినడానికి గొప్పగా ఉన్నప్పటికీ.. వాటి ఆచరణ చాలా కష్టంగా ఉంటుందన్నారు. అనంతరం చర్చి ఫాదర్‌లతో కలిసి కేక్‌ను కట్ చేసారు. చర్చి ఫాదర్‌లు మాణిక్యం, విజయ్‌తో పాటు పలువురు మంత్రిని శాలువాతో సత్కరించారు. అనంతరం అందోలు నియోజకవర్గంలోని అందోల్, పుల్కల్, చౌటకూరు, వట్‌పల్లి, టేక్మాల్ మండలాలకు చెందిన క్రైస్తవ సోదర, సోదరీమణులకు గిఫ్ట్ ప్యాక్‌లను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ పాండు, ఎంపీడీవో సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ మధుకర్‌రెడ్డి, జడ్పీటీసీ సరోజ, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సముద్రంలో కార్గో నౌకలపై హౌతీ దాడులు

- డ్రోన్లు, క్షిపణుల ప్రయోగం
- అంతర్జాతీయ వాణిజ్యంపై ప్రభావం
- పెరగనున్న చమురు, నిత్యావసరాల ధరలు
- భారత్‌లోనూ ఆందోళన

జెరూసలేం : ఇజ్రాయిల్-హమాస్ యుద్ధ జ్వాలలు ఇప్పుడు సముద్రానికీ వ్యాపించాయి. సముద్రం ఇప్పుడు అనేక దేశాలకు యుద్ధ భూమిగా మారింది. హమాస్‌కు మద్దతు ఇస్తున్న హౌతీ రెబల్స్ ఇజ్రాయిల్ వెళుతున్న లేదా ఆ దేశంతో సంబంధం ఉన్న నౌకలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నారు. నౌకలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ సమాజంలో ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నాయి.

ఇజ్రాయిల్, హమాస్ మధ్య అక్టోబర్ 7న యుద్ధం ప్రారంభమైంది. ఇజ్రాయిల్‌లో ప్రవేశించిన హమాస్ వందలాది మందిని హతమార్చి 200 మందికి పైగా ప్రజలను బందీలను చేసింది. దీంతో హమాస్ ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా ఇజ్రాయిల్ గాజా, గాజా స్ట్రిప్‌పై భీకర పోరు ప్రారంభించి పాలస్తీనియా ప్రజలను పెద్ద సంఖ్యలో పొట్టనపెట్టుకుంటోంది. ఈ యుద్ధం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. అదే సమయంలో ఇజ్రాయిల్ దాడులను వ్యతిరేకిస్తున్న హౌతీ రెబల్స్ కూడా ఆ దేశానికి చెందిన నౌకలపై దాడులు చేస్తున్నారు. వీరు ఎర్ర సముద్రం, అరేబియా సముద్రం మీదుగా వెళుతున్న అనేక నౌకలను లక్ష్యంగా చేసుకొని డ్రోన్లు, క్షిపణులతో దాడి చేస్తున్నారు. కొన్ని నౌకలను దోచుకుంటున్నారు. గడచిన నెల రోజుల వ్యవధిలోనే హౌతీ రెబల్స్ 12 సార్లకు పైగా వాణిజ్య నౌకలపై దాడులు చేశారు.

జరిగిన దాడులు ఇవే

గత నెల 19న హౌతీ రెబల్స్ బ్రిటన్‌కు చెందిన కార్గో నౌక 'గలాక్సీ లీడర్'పై దాడి చేసి దానిని స్వాధీనం చేసుకున్నారు. సముద్రం మధ్యలో ప్రయాణిస్తున్న నౌకపై సినీ ఫక్కీలో హెలికాప్టర్‌ను దింపి సిబ్బందిని బందీలుగా పట్టుకున్నారు. ఈ నెల 3న ఇజ్రాయిల్‌కు చెందిన రెండు నౌకలపై దాడి చేశారు. 12వ తేదీన నార్వే ట్యాంకర్‌పై క్షిపణితో దాడి చేశారు. ఈ దాడిలో ట్యాంకర్‌కు నిప్పంటుకున్నప్పటికీ ఎవరూ గాయపడలేదు. 13వ తేదీన బాబ్ అల్ మాన్‌దేబ్ జలసంధిలో మన దేశానికి చెందిన కార్గో నౌకపై రెండు క్షిపణులను ప్రయోగించారు. అయితే అదృష్టవశాత్తూ ఆ దాడి నుండి భారత నౌక తప్పించుకోగలిగింది. ఈ నెల 22న శుక్రవారం నాడు అరేబియా సముద్రంలో ఓ నౌకపై దాడి జరిగింది. గుజరాత్‌లోని వెరావల్‌కు నైరుతి దిశలో 200 కిలోమీటర్ల దూరంలో ఈ దాడి జరిగింది. దాడి అనంతరం నౌకలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అయితే మంటలను సకాలంలో ఆర్పివేశారు. సౌదీ అరేబియా ఓడరేవు నుండి ఈ నౌక మంగళూరు వస్తుండగా ఈ ఘటన జరిగింది. శనివారం దక్షిణ ఎర్ర సముద్రంలోని అంతర్జాతీయ నౌకా ప్రయాణ మార్గాలపై హౌతీ రెబల్స్ నౌకా విధ్వంసక బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించారు. ఈ దాడులలో జరిగిన నష్టం వివరాలు ఇంకా అందలేదు.

ధరలు పెరిగే అవకాశం

ముడి చమురు, ఇతర నిత్యావసర వస్తువులతో సముద్రంలో ప్రయాణిస్తున్న నౌకలను లక్ష్యంగా చేసుకొని హౌతీ రెబల్స్ దాడులు సాగిస్తున్నారు. ఈ దాడులు ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో చమురు ధరలు మాత్రమే కాకుండా నిత్యావసరాల ధరలు కూడా భగ్గుమనే అవకాశం ఉంది. ఈ దాడుల కారణంగా తన వ్యాపారానికి విఘాతం కలగవచ్చునన్న ఆందోళన భారత్‌లో కూడా కన్పిస్తోంది. హౌతీ రెబల్స్ దాడులపై ప్రధాని మోడీ ఇటీవలే ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూతో మాట్లాడారు. సముద్ర మార్గంలో భద్రతపై వారిద్దరూ పరస్పరం ఆందోళనను పంచుకున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, వ్యాపార ప్రయోజనాల దృష్ట్యా ఈ దాడులు ఆగిపోవాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు.

అంతర్జాతీయ సరఫరాలకు ఆటంకం

హౌతీ దాడుల కారణంగా సముద్ర మార్గంలో జరుగుతున్న అంతర్జాతీయ వాణిజ్యం బాగా దెబ్బతింది. ఎందుకంటే ఎర్ర సముద్రం మీదుగానే వ్యాపార కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతుంటాయి. పశ్చిమాసియా మాత్రమే కాకుండా అరేబియా, యూరప్, ఆఫ్రికా, భారత్ కూడా సముద్ర మార్గం ద్వారానే వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. హౌతీ రెబల్స్ దాడుల కారణంగా అంతర్జాతీయ సరఫరాలకు ఆటంకం కలుగుతోంది. దాని ప్రభావం ఇప్పటికే కన్పిస్తోంది. దాడుల నేపథ్యంలో ప్రపంచంలోని అతి పెద్ద కార్గో కంపెనీలు ఇకపై ఎర్ర సముద్రం ద్వారా తమ సరకు రవాణా నౌకలను పంపడానికి ఇష్టపడవు. ఆ కంపెనీలు



ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటాయి. అయితే దీనివల్ల దూరం పెరుగుతుంది. ఫలితంగా ఖర్చు కూడా పెరుగుతుంది. వ్యయం పెరిగితే దాని ప్రభావం ఈరోజు కాకపోయినా రేపైనా ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. చివరికి ఆ భారాన్ని మోయాల్సింది వినియోగదారులే.

ఎర్ర సముద్రమే ఎందుకు?

హౌతీ రెబల్స్ తమ దాడులకు ఎర్ర సముద్రాన్నే ఎందుకు ఎంచుకుంటున్నారు? ప్రపంచ వాణిజ్యంలో 12% ఈ సముద్రం మీదుగానే జరుగుతోంది. ఈ మార్గం ద్వారా ప్రతి సంవత్సరం 10 బిలియన్ డాలర్ల కంటే అధిక విలువ కలిగిన సరుకులు ఎగుమతి లేదా దిగుమతి అవుతున్నాయి. దీనిని బట్టి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఎర్ర సముద్రానికి ఎంతటి ప్రాధాన్యత ఉన్నదో అర్థమవుతుంది. హౌతీ రెబల్స్ ఈ మార్గాన్ని ఎంచుకోవడానికి మరో కారణం కూడా ఉంది. ఈ దాడుల వల్ల అంతర్జాతీయ సమాజంలో అలజడి మొదలవుతుందని, హమాస్‌పై యుద్ధానికి స్వస్తి చెప్పవలసిందిగా ప్రపంచ దేశాలు ఇజ్రాయిల్‌పై ఒత్తిడి పెంచుతాయని వారు భావిస్తున్నారు.

ప్రపంచానికి ఎర్ర సముద్రం ఎంతో ముఖ్యమైనది. ఈ సముద్రంలో జరిగే దాడుల నుండి నౌకలను కాపాడేందుకు అమెరికా 20 దేశాలతో ఓ కూటమిని ఏర్పాటు చేసింది. నౌకల భద్రతపై ఈ దేశాలు పరస్పరం సహకరించుకుంటాయి.

సభ్య దేశాల మధ్య కుదిరే ఒప్పందాల ప్రాతిపదికనే ఏ కార్యకలాపమైనా జరుగుతుంది.

ఆ నౌక భారత్‌ది కాదు...గబాన్‌ది

న్యూఢిల్లీ : భారత్‌కు చెందిన ఇరవై ఐదు మంది సిబ్బందితో ఎర్ర సముద్రంలో ప్రయాణిస్తున్న ముడి చమురు ట్యాంకర్ డ్రోన్ దాడికి గురైంది. హౌతీ రెబల్స్ ఈ డ్రోన్‌ను ప్రయోగించారని అమెరికా సైన్యం చెబుతోంది. దాడి జరిగిన తర్వాత ట్యాంకర్ నుండి అదే ప్రాంతంలో ఉన్న అమెరికా యుద్ధ నౌకకు సందేశం వెళ్లింది. పశ్చిమ ఆఫ్రికాలోని గబాన్ దేశానికి చెందిన ఈ నౌక పేరు 'ఎంవీ సాయిబాబా'. డ్రోన్ దాడిలో ఎవరూ గాయపడలేదని, నౌకలోని 25 మంది సిబ్బంది సురక్షితంగానే ఉన్నారని భారత నౌకాదళ అధికారులు ధృవీకరించారు. నౌకపై భారత్ పతాకం ఉన్నదని తొలుత వార్తలు వచ్చాయి.

అయితే అది గబాన్‌కు చెందిన నౌక అని, భారతీయ షిప్పింగ్ రిజిస్టర్ నుండి సర్టిఫికేషన్ పొందిందని నౌకాదళం వివరణ ఇచ్చింది.

ఆరుగ్యారంటీల అమలు ఇప్పట్లో అసాధ్యం

- పార్లమెంట్‌లో దాడి భద్రతాలోపం
- తెలంగాణలో 4 జిల్లాలే కాంగ్రెస్‌కు అనుకూలం
- పార్టీ ఆదేశిస్తే నా కుమారుడు అమిత్ పోటీ : శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నవతెలంగాణ-నల్లగొండ టౌన్

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఇప్పట్లో అమలు సాధ్యం కాదని శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని తన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఆదేశిస్తే నల్లగొండ లేదా భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తన కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డి పోటీ చేస్తారని తెలిపారు. తెలంగాణలో నాలుగు జిల్లాల్లో మాత్రమే కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయన్నారు. మిగతా జిల్లాల్లో మిశ్రమ ఫలితాలు వచ్చాయని తెలిపారు. హైదరాబాద్, మెదక్ జిల్లాల్లో బీఆర్‌ఎస్ ఆధిపత్యం కనిపించిందన్నారు. ఎమ్మెల్యేల మీద వ్యతిరేకత స్పష్టంగా కనిపించిరా.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోతుందని కలలో కూడా అనుకోలేదని చెప్పారు. ముఖ్యమంత్రిగా కేసీఆరే ఉండాలని ప్రజలంతా అనుకున్నారని, కానీ ఎమ్మెల్యేలు ఓడిపోవడం వల్ల ఫలితం తారుమారైందని తెలిపారు. నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై కొత్తగా వచ్చిన ప్రభుత్వం బడ్జెట్ కేటాయించాలని, తన వంతుగా ప్రాజెక్టులపై సూచనలు, సలహాలు అందించానని చెప్పారు. కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ప్రొటోకాల్‌ను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ తెలంగాణలో సృష్టించిన ఆస్తుల మీద శ్వేతపత్రం విడుదల చేస్తుందని తెలిపారు. పార్లమెంట్‌లో పొగ బాంబ్ దాడి భద్రతా లోపాలను స్పష్టంగా చూపిస్తుందన్నారు. ప్రభుత్వాలు రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి కోసం పని చేయాలి కానీ పట్టుదలకు పోయి చతికలపడొద్దని సూచించారు.

గిగ్ వర్కర్ల సంక్షేమంపై సీఎం హామీలను స్వాగతిస్తున్నాం

- ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ల నాయకులతో ప్రభుత్వం సమావేశం నిర్వహించాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిగ్ వర్కర్ల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను స్వాగతిస్తున్నామని తెలంగాణ పబ్లిక్, ప్రయివేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్-సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వీరయ్య, పి.శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఓలా, ఊబర్, స్విగ్గీ, జొమాటో లాంటి ఆన్‌లైన్ యాప్ ద్వారా పనిచేసే డ్రైవర్లు, ఫుడ్ డెలివరీ బాయ్స్‌కు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం, ఆరోగ్య శ్రీద్వారా రూ.10 లక్షల వైద్య సహాయం అందించేందుకు ప్రత్యేక బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెడుతామనీ, ప్రభుత్వం ద్వారానే ఆన్‌లైన్ యాప్ తీసుకొచ్చి వారికి ఉపాధి కల్పిస్తామని హామీనివ్వడం శుభపరిణామం అని పేర్కొన్నారు. 20 లక్షల మంది కార్మికులు రవాణారంగంపై ఆధారపడి పనిచేస్తున్నారనీ, వారంతా సరైన ఉద్యోగాల్లేక ఉపాధి కోసం ఆ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీలను అమలు చేయాలనీ, గ్రిగ్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో,క్యాబ్ డ్రైవర్లకు ఉపాధి తగ్గిపోయిందనీ, గీత, నేత, బీడీ కార్మికులకు ఇస్తున్నట్టుగా వారికీ నెలవారీ జీవనభృతి అందించాలని విన్నవించారు. ఇన్సూరెన్స్, వాహనాల ఫిటినెస్, రోడ్ టాక్స్‌లను ప్రభుత్వమే భరించాలిలని కోరారు. ఈఎంఐపై మూడు నెలల పాటు మారిటోరియం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ట్రాన్స్‌పోర్టు యూనియన్ల నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

కేసీఆర్ ఉద్యమకారుడు కాదు..విధ్వంసకారుడు

- పరిపాలన ఎలా చేయకూడదో అలా చేశాడు
- అన్ని వ్యవస్థలకూ ఆగం చేశాడు : విశ్రాంత ఐఏఎస్ ఎ.మురళి
- టైటిల్ గ్యారంటీ తేవాలి..గ్రామంలోనే సమస్యలు పరిష్కారం కావాలి : భూమి సునీల్
- అధికారుల కోసం కాదు.. పేదల కోసం పనిచేయండి : ప్రొఫెసర్ కోదండరామ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేసీఆర్ ఉద్యమకారుడు కాదనీ, ఆయన తెలంగాణ విధ్వంసకారుడని విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మురళి ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక, విద్యా, రెవెన్యూ, పంచాయతీరాజ్, టీఎస్‌పీఎస్‌సీ, ఇలా అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. పరిపాలన ఎలా చేయకూడదో అలా చేసిచూపాడన్నారు. కలెక్టర్లను రియల్టర్లుగా మార్చిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని హోటల్ ప్లాజాలో తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ బలోపేతం అనే అంశంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ..అత్యధిక అవినీతికి పాల్పడే అధికారులను తీసుకొచ్చి హైదరాబాద్, రంగారెడ్డి వంటి జిల్లాల్లో పోస్టింగులు ఇచ్చి దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్యేలు సైతం దొంగలుగా మారి దోచుకున్నారని విమర్శించారు. రెవెన్యూ ఉద్యోగులపై అవినీతి ముద్ర వేసి వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థలను రద్దు చేసి భూరికార్డులను ఆగం చేసి దోచుకోవాల్సినంత భూమిని గత పాలకులు దోచుకున్నారని ఆరోపించారు. అవినీతి, అక్రమాలతో సంపాదించిన డబ్బుతో దేశాన్నే కొనేయాలని కలలు కన్నారని విమర్శించారు. గ్రామ స్థాయిలోనే రైతుకు అన్ని రకాల సేవలను అందించాలన్నారు. ఇందుకోసం పటిష్టమైన గ్రామ పాలనా వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. మన రాష్ట్రాన్ని మనమే రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కొత్త దొంగలు తయారవ్వకుండా చూసుకోవాలని సూచించారు.

టీజేఎస్ అధ్యక్షులు, ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ...న్యాయాన్ని పక్కన పెట్టి, సొంత అవసరాల కోసం చట్టాలను తయారు చేస్తే ఎలా ఉంటుందనే దానికి ధరణి పోర్టలే మంచి ఉదహరణ అని చెప్పారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ తన సొంతానికే రెవెన్యూ చట్టంలో మార్పులు తెచ్చారని ఆరోపించారు. చివరకు భూ రికార్డులను సైతం విధ్వంసం చేశారన్నారు. కేవలం వారికి మాత్రమే కావాల్సినవి రాసుకున్నారని ఆరోపించారు. మిగతా జరిగిన తప్పులకు రెవెన్యూ వారికి శిక్షలు విధించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. వీఆర్‌ఏల నుంచి కనీసం అభిప్రాయం కూడా తీసుకోకుండా రెవెన్యూకు దూరం చేశారన్నారు. అధికారులు పాలకుల కోసం కాకుండా ప్రజల కోసం పని చేయాలని పిలుపునిచ్చారు.

రెవెన్యూ నిపుణులు, న్యాయవాది భూమి సునీల్ రాష్ట్రంలో ప్రధానమైన భూ సమస్యకు పరిష్కారం చూపకుండా బంగారు తెలంగాణ, ఆకుపచ్చ తెలంగాణ..ఏ తెలంగాణా సాధ్యం కాదని నొక్కి చెప్పారు. ప్రపంచవ్యాప్తంగానూ భూ సమస్య పరిష్కారమైన దేశాలే అభివృద్ధి చెందిన విషయాన్ని గుర్తుచేశారు. భూ పరిపాలన గ్రామ స్థాయిలో ఉండాలనీ, రైతు సమస్యలు అక్కడే పరిష్కారమయ్యేలా వ్యవస్థ ఉండాలని ఆకాంక్షించారు. భూమి హద్దులు స్పష్టంగా ఉండాలనీ, హక్కుల కల్పించే పత్రాలు పక్కాగా, హక్కుల మార్పిడి వెంటనే జరిగేలా ఉండాలని సూచించారు. భూమి హక్కులకు ప్రభుత్వమే గ్యారంటీ ఇవ్వాలన్నారు. దస్తావేజుల రిజిస్ట్రేషన్ కాదు.. హక్కులకు రిజిస్ట్రేషన్ కావాలన్నారు. లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 25వేల జూనియర్ అసిస్టెంట్ల నియామకంతో గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలు పెరిగినప్పటికీ ఉద్యోగుల సంఖ్య పెరగలేదన్నారు. ఇతర విభాగాలకు బదిలీ చేసిన వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను అదే హోదాలో రెవెన్యూ శాఖకు రప్పించి గ్రామ స్థాయిలో పాలనను పటిష్టం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎ.జానయ్య, డిప్యూటీ కలెక్టర్ల సంఘం నేతలు రమేష్ రాథోడ్, కె.రామకృష్ణ, ఎస్‌ఆర్ సరిత, టీజీటీఏ అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి ఎస్‌పీఆర్ మల్లేష్‌కుమార్, నేతలు ఉమాశంకర్, పూల్‌సింగ్, రమేష్ పాక, ఆరేటి రాజేశ్వర్, రాధ, వివిధ ఉద్యోగ సంఘాల నేతల ఉపేందర్‌రావు, సత్యనారాయణ, పద్మ, రెవెన్యూ ఉద్యోగ సంఘాల మాజీ నేతలు, విశ్రాంత అధికారులు లక్ష్మయ్య(ట్రెసా), రవీందర్‌బాబు, శ్రీనివాసరావు, మధుసూదన్, రాజారావు, ఆర్టీసీ జేఏసీ నేత అశ్వత్థామరెడ్డి, తదితరులు మాట్లాడారు.

యువత సవాళ్లను ఎదుర్కొని ముందుకు సాగాలి

సమాజం, దేశం కోసం పనిచేయాలి : ఆర్టీసీ ఎండీ సజ్జనార్

- ఘనంగా ఐసీబీఎం 16వ స్నాతకోత్సవం



నవతెలంగాణ-రాజేంద్రనగర్

నేటి యువత ఏ రంగంలోనైనా రాణించడానికి అనేక సవాళ్లను ఎదుర్కోవాలని అప్పుడే అత్యున్నత స్థానంలో ఉంటామని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. యువత సమాజం, దేశం కోసం పనిచేయాలని కోరారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పరపల్లిలో ఐసీబీఎం 16వ స్నాతకోత్సవానికి సజ్జనార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 2021-2023 సంవత్సరానికి సంబంధించి 150 మంది విద్యార్థులకు ఐసీబీఎం చైర్మెన్ ప్రొఫెసర్ జరార్‌తో కలిసి సజ్జనార్ విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని దాన్ని సాధించడానికి నిరంతరం కృషి చేయాలన్నారు. 34 ఏండ్లుగా కాలేజీని విజయవంతంగా కొనసాగిస్తున్న చైర్మెన్ ప్రొఫెసర్ జరార్, రీతు జరార్, జితేందర్‌ను అభినందించారు.

విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని తెలిపారు. ఈ కాలేజీలో చదివిన ప్రతి విద్యార్థికీ వందశాతం జాబ్ గ్యారెంటీతో పాటు ఎంతో మంది వివిధ రంగాల్లో అత్యున్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. తాను ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు చేపట్టినప్పుడు అనేక సమస్యలు స్వాగతం పలికాయని, ఒక్కొక్క సమస్యను ఒక్కొక్క రీతిలో పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నానని తెలిపారు. ఆర్టీసీ మొత్తం దివాళా తీసి ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ఉంటే ఇప్పుడు వాటన్నింటినీ అధిగమించి లాభాల్లోకి తీసుకొస్తున్నామని చెప్పారు. ప్రజల వద్దకు ఆర్టీసీ, గమ్యం యాప్, ఆర్టీసీ కార్మికుల కోసం ప్రత్యేక బీమా ఆరోగ్యం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ముందుకు సాగడంతో మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు.

అదేవిధంగా ఆర్టీసీ కార్మికులకు వివిధ రకాల శిక్షణా కార్యక్రమాలు ఇచ్చి ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేసినట్టు వివరించారు. ఆర్టీసీలోని 50 వేల మంది ఉద్యోగులకు యాప్ ద్వారా మీటింగ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సంస్థ ఆర్థిక పరిస్థితి వివరించి భవిష్యత్తులో చేయవలసిన కర్తవ్యాల గురించి వివరించినట్టు తెలిపారు. అదేవిధంగా ఆర్టీసీ ద్వారా వివిధ రకాల వ్యాపారాలను కూడా ప్రారంభించి లాభాలు తీసుకొచ్చామన్నారు. నిత్యం విద్యార్థులు పుస్తకాలు బాగా చదవాలని సూచించారు.

మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఎప్పుడు నిర్లక్ష్యం చేయొద్దని తెలిపారు. అనంతరం చైర్మెన్ ప్రొఫెసర్ జరార్ మాట్లాడుతూ.. ఐసీబీఎం కాలేజీ క్రమశిక్షణకు మారుపేరన్నారు. తమ కాలేజీలో మొదట క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇస్తానని తద్వారా భవిష్యత్తులో విద్యార్థులు ఆ రంగాల్లో రాణించడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇందులో చదివిన ప్రతి విద్యార్థికీ కచ్చితంగా ఉద్యోగం లభిస్తుందని స్పష్టం చేశారు. తమ కాలేజీలో చదవడానికి ఇతర రాష్ట్ర విద్యార్థులు పెద్ద సంఖ్యలో వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ కిరణ్ నేటి, సుమన్ సుగుణ, సురేష్, డైరెక్టర్లు రీతు జరార్, జితేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పెరియార్ స్ఫూర్తితో సామాజికోద్యమాలు : కేవీపీఎస్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వేల ఏండ్లుగా దేశంలో కొనసాగుతున్న అన్ని రకాల ఆధిపత్యాలను అంతం చేయడమే భారత సామాజిక ఉద్యమ పితామహుడు పెరియార్ రామస్వామికి అర్పించే నిజమైన నివాళి అని పలువురు వక్తలు తెలిపారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద పెరియార్ రామస్వామి నాయకర్ 50వ వర్ధంతి సభను నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి ఎస్వీకే ట్రస్ట్ కార్యదర్శి ఎస్ వినయకుమార్, టీపీఎస్‌కే రాష్ట్ర కన్వీనర్ జి రాములు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులు మాట్లాడారు. పెరియార్ స్ఫూర్తితోనే భౌతిక వాద దృక్పథం దక్షిణ భారతదేశమంతటా వ్యాపించిందన్నారు. విగ్రహారాధన, దేవుడు, మూఢనమ్మకాలు, బ్రాహ్మణాధిపత్యంపై ఆనాడే ఆయన తిరుగుబాటు బావుట ఎగరేశారని గుర్తు చేశారు. వేదాలను బ్రాహ్మణిజాన్ని ప్రశ్నించడం ద్వారా ప్రజలు చైతన్యవంతులు కావాలనీ, ప్రతి దాన్ని పాదార్థికంగా పరిశీలించటం నేర్చుకోవాలని సూచించారన్నారు. రష్యాకెళ్లొచ్చీ, అక్కడి కమ్యూనిజం భావాజాలాన్ని వంటపట్టించుకున్నారని వివరించారు. ప్రశ్నించడం నేరమైతే ఆ నేరాన్ని పదేపదే చేస్తానని ఆయన చెప్పడంగొప్ప విషయమని గుర్తుచేశారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్క, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్, టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఐత విజయ్, సోషల్ మీడియా ఇంచార్జి జగదీష్, టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, టీటెన్‌సీఈవో సుందర్,కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్ బాల పీరు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువ రైతు మృతి



నవ తెలంగాణ - దౌల్తాబాద్

గుండెపోటుతో యువరైతు మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం గొడుగుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మంత్రి కనకయ్య(29) శనివారం మండల కేంద్రమైన దౌల్తాబాద్‌కు వ్యవసాయ పనిమీద వెళ్లి తిరిగి వస్తున్నాడు. గొడుగుపల్లి గ్రామంలోనే గుండెపోటుతో బాధపడుతూ ద్విచక్ర వాహనం మీద నుండి కుప్పకూలాడు. వెంటనే కనకయ్యను 108 వాహనంలో గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యం చేస్తుండగానే ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య సంధ్య, కూతురు, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి :కేసు నమోదు

నవతెలంగాణ-తొగుట

స్టాప్‌లో బస్సు ఆపలేదన్న కోపంతో డ్రైవర్‌పై దాడి చేసిన ఘటన సిద్దిపేట జిల్లా తొగుట మండలం వెంకట్రావు పేట సమీపంలో జరిగింది. దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ బి.లింగం తెలిపారు. గజ్వేల్ డిపోకు చెందిన టీఎస్ ఆర్టీసీ అద్దె బస్సు సికింద్రాబాద్ నుంచి దుబ్బాక వెళ్తోంది. కాగా, వెంకట్రావుపేట వద్ద ఆటోలో వచ్చిన ముగ్గురు డ్రైవర్‌పై దాడి చేశారు. హమ్మదీపూర్ వద్ద బస్సు ఎందుకు ఆపలేదని డ్రైవర్, కండక్టర్‌ను బూతులు తిడుతూ దాడి చేశారు.కండక్టర్ రజిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేశామని, ఆటో నెంబర్ ఆధారంగా నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

సీఎం రేవంత్‌తో నోరి దత్తాత్రేయుడు భేటీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రముఖ అంకాలజిస్టు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు ఆదివారం హైదరాబాద్‌లోని రేవంత్ నివాసంలో ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆయన అమెరికాలోని మెమోరియల్ స్లోన్ కేటరింగ్ ఆస్పత్రిలో క్యాన్సర్ విభాగానికి అధికారిగా పని చేస్తున్నారు. రాష్ట్ర వైద్యరంగంలో సంస్కరణలు తీసుకొచ్చేందుకు తమ వైపు నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సహకారం కావాలన్న అందిస్తామని ఈ సందర్భంగా రేవంత్‌కు తెలియజేశారు.

మనిషితనపు కలల జెండా - రహీమొద్దీన్ కవిత్వం

> కవిత్వంలో ఆసక్తికరమైన ఎత్తుగడ, వినూత్నమైన ప్రతీకలు, పాఠకుడిని ఒక అవ్యక్తమైన భావనకు గురిచేసే ఆర్ద్రమైన ముగింపు ఉన్నప్పుడు ఆ కవిత్వం పాఠకుడిని ఆసాంతం చదివేలా చేస్తుంది. వాస్తవ జీవితాలను ఆవిష్కరించిన కవిత్వం పది కాలాలపాటు నిలుస్తుంది. రహీమొద్దీన్ కవిత్వంతో పాఠకుడు ఆ అనుభూతికే లోనవుతాడు.

ఇటీవల కలల రంగు కవిత్వం (తొలి కవితా సంపుటి)తో తెలుగు సాహిత్యంలో తనదైన ముద్రతో అడుగుపెట్టారు రహీమొద్దీన్. ఒక చేయి తిరిగిన అనుభవజ్ఞుడైన కవి రాసిన కవితా పంక్తులుగా ఇందులోని కవితలు దర్శనమిస్తాయి. రహీమొద్దీన్ సాహిత్యం చదివిన వారు కాదు. కానీ జీవితాన్ని చదివిన వారు. మానవీయ విలువలు, వివక్ష పట్ల నిరసన, భవిష్యత్తు సమాజం పట్ల ఆలోచన వీరి కవిత్వంలో స్పష్టంగా కనిపిస్తుంది.

రహీమొద్దీన్ కవిత్వంలో మనిషితనం ఉట్టిపడుతోంది. తన ఊర్లో ఇంటి పక్కన ఉండే రాములు బాబాయ్ మరణించినప్పుడు కవి ఆవేదన ఆయనలోని మానవీయ గుణాన్ని బహిర్గత పరుస్తుంది.

"పుట్టిన మట్టిని సారవంతం చేసే/ వాన పాము లాంటి పుట్టుకలు కొన్నే ఉంటయ్/ మా రాములు బాబాయి లెక్క.../ దొండపాదు లెక్క/ గుండె లోపలికి తీగలు బారిన ఆత్మీయతలాయే!/ మనిషి పోయినంత సులభం కాదు మరిచిపోవడం..." అంటూ రాములు బాబాయ్ గుణాన్ని అద్భుతంగా కవిత్వీకరించారు. కల్మషం లేని గ్రామీణుల మనస్తత్వాన్ని ఈ కవితలో చిత్రీకరించాడు.

అనగనగా ఒక అమ్మ కథ కలల రంగు కవిత్వ సంపుటిలో ఎన్నదగిన కవిత. తల్లి గొప్పదనాన్నే కాదు ఆ తల్లి ఏ విధంగా వివక్షకు గురవుతున్నదో కూడా ఈ కవితలో చెప్పారు.

"ఎనుగంతా పారిన కంచ కాకర తీగకు/ మొదలెక్కడో దొరకనట్టు/ అంతం లేని అమ్మ దు:ఖపు తీగకు/ అది ఎక్కడో దొరకదు." అంటూనే అమ్మ కళ్ళలో సుడిగుండాలను చూశానని, తాను రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడ్డా అమ్మ ఏనాడు బాధపడలేదని తన మనసులోని బాధలకు రికాము లేని పనినే ఔషధంగా పూసుకున్నదని తల్లి సహనశీలతను అభివర్ణిస్తారు. బిడ్డగా,కోడలిగా, భార్యగా అనేక బాధ్యతలు నిర్వహించిన అమ్మ అన్ని చోట్ల దు:ఖాన్నే అనుభవించిందని ఆవేదనతో చెప్పారు.

"మసీదు మీనారు మీద నుంచి/ కనిపించే పండుగ నెలవంక కోసం అందరూ వెతుకుతుంటే/ అమ్మ ముఖంలో మెరిసే నెలవంక కోసం/ నేను వెతుకుతున్న..." అంటూ ఒక ఆశావహ దృక్పథంతో కవితను ముగిస్తారు. అమ్మ చేతి ఆసరా అనే మరో కవితలో చీపురు గురించి చెప్పినట్లు కనిపించినా అంతర్లీనంగా ఆ కవిత నిండా అమ్మ కష్టమే దాగి ఉంది.

సాధారణంగా మనిషి ఉన్నప్పుడు మనిషి విలువ తెలియదు. ఇంట్లో అన్నీ తానై నడిపించే అర్ధాంగి లేని ఓ సాయం కాలాన్ని కవి జీర్ణించుకోలేని స్థితిని అద్భుతంగా కవిత్వీకరించారు

"తోడు లేనప్పుడు అంకెల విలువే కాదు/ ఆనందం విలువ కూడా తగ్గిపోతుందని/ ఆమె లేని ఈ సాయంత్రం/ జీవిత గణితంలోని తీసివేతల అధ్యాయం నాకు నేర్పింది..." అంటూ అర్ధాంగి లేని వెలితిని చక్కని కవిత్వంగా మలిచారు.

పెరుగుతున్న ప్రపంచీకరణ నగరీకరణ ఫలితంగా అంతరిస్తున్న పల్లెలు, ధ్వంసం అవుతున్న పర్యావరణం పట్ల ఆవేదన వీరి కవిత్వంలో కనిపిస్తున్నది. పొలం నెత్తురు కవితలో

"పట్నం పులి పంజా విసురుతున్నది/ నగరపు రోడ్డు కొండచిలువలా చుట్టేస్తున్నది/ దరిదాపుల్లో ఉండటమే పంట పొలం చేసుకున్న పాపం/ పచ్చని దేహం నిండా పచ్చి నెత్తురు తాగే కోరల గాట్లే" అంటూ సాగే ఈ కవితలో నగరం పల్లెలను ఎట్లా మింగేస్తున్నదో, ఆశల గాలానికి చిక్కిన రైతు బతుకు ఎలా విలవిలలాడుతున్నదో, పొలాలు ధ్వంసమై ధనవంతుల చేతుల్లో చిక్కుకున్న వైనాన్ని చక్కగా కవిత్వీకరించారు.

ప్రపంచీకరణ కార్పొరేటీకరణ చాప కింద నీరులా పాకి మనలను బందీ చేస్తున్న వైనాన్ని తెలుపుతూ రాసిన వీరి కవిత్వం పాఠకులను ఆలోచింపజేస్తుంది

"వాడి ఉపాయం వలలో చిక్కిన/ ఐక్యమత్యం మరచిన అమాయక పావురాలం కదా/ మనం కన్ను తెరిచేలోపే/ వాడు మన కలలన్నీ ఖరీదైన కవర్లో ప్యాక్ చేస్తడు/ రేపటి మన ముద్దని కార్పొరేట్ గద్దలు ఎత్తుకుపోయినంక/ ఈయాల రోడ్డు మీద మొలిచిన మేకులే రేపు మన కంచంలో మొలుస్తయ్" అంటూ హెచ్చరిస్తున్నాడు.

పర్యావరణ స్పృహ వీరి కవిత్వంలో స్పష్టంగా కనిపిస్తున్నది. చెట్లు పెంచాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తూ రాసిన ఆకుపచ్చని దీవెన కవితలో


"ఊయల నుండి ఊత కర్ర దాకా తోడై నడిపించి/ విషాన్ని పీల్చుకొని అమృత ఫలాలు దోసిళ్లతో పంచుతూ/ ఆకుపచ్చగా దీవించింది.." అని చెట్టు గొప్పదనాన్ని తెలియ చెప్పారు.

మనిషి ఆనంద విషాదాలకు మూలం మనసే. మనసును ప్రశాంతంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని ఒక తాత్విక దృక్పథంతో చెప్పారు రహీమొద్దీన్.

'కష్టజీవి' కి ఇరువైపుల నిలిచిన వాడే కవి అన్నారు శ్రీశ్రీ. శ్రమజీవుల పట్ల రహీమొద్దీన్ సరిగ్గా ఇట్లాంటి అభిప్రాయాన్నే కలిగి ఉన్నారు. తన ఇంటిని నిర్మించిన భవన నిర్మాణ కార్మికులను చూసి వారి బతుకు చిత్రాన్ని కవిత్వంగా అల్లారు.

"పొద్దున్నే తాపీ పట్టుకున్న సూర్యులై/ తన కళ్ళలో సంతోషపు కిరణాలు మెరిపించే వాళ్ళు" అని తాపీ మేస్త్రీలను కృతజ్ఞతా పూర్వకంగా అభినందిస్తారు. రైతుల పట్ల కూడా రహీమొద్దీన్ ప్రేమ ఇలాగే కనిపిస్తుంది.

"వాళ్లు వానలో తడిసి పచ్చని పొలమై చిగురిస్తరు/ వాళ్లు బురదను బుజ్జగించి బువ్వ చేస్తరు/ అరకబట్టి ఆదమరిసి నిద్రపోతున్న మట్టి పొరలని తట్టి లేపుతరు" వంటి కవిత్వ పాదాలు అన్నదాతల పట్ల వీరికి ఉన్న మమకారాన్ని తెలుపుతున్నాయి. రైతు అయిన తన తండ్రిని స్మరించుకునే కవితలోనూ రైతు పట్ల సహానుభూతి కనిపిస్తుంది.



> పెరుగుతున్న ప్రపంచీకరణ నగరీకరణ ఫలితంగా అంతరిస్తున్న పల్లెలు, ధ్వంసం అవుతున్న పర్యావరణం పట్ల ఆవేదన వీరి కవిత్వంలో కనిపిస్తున్నది.

"అన్నం పెట్టే రైతును/ ఆడపిల్లను కన్న తండ్రిని/ తలెత్తుకొని బతకనిచ్చే దేశమా ఇది?" అంటూ ఆవేదన వ్యక్తం చేస్తారు. మున్సిపల్ కార్మికుల సేవ గొప్పదనాన్ని మనసారా కీర్తించారు.

రహీమొద్దీన్ కవిత్వంలో అస్తిత్వ స్పృహ ఉన్నది. సమాజంలో తనకు ఎదురవుతున్న వివక్షను ప్రశ్నించే గుణం ఉన్నది. నేను ఒంటరిని కాదు అనే కవితలో తాను ఈ దేశ మూలవాసినని ద్వితీయ పౌరులుగా ఎంచబడుతున్న మైనారిటీల పక్షాన నిలబడి మాట్లాడగలిగారు.

"నేనెప్పుడూ పుట్టిన మట్టిని సాటి మనిషినీ/ సమానంగా ప్రేమించే వాణ్ణే/ మతాన్ని మసీదు గుమ్మం దగ్గరే వదిలి/ సోదర భావాన్నే తలపై పెట్టుకున్నాను" అని స్పష్టం చేశారు. తానెప్పుడూ ఒంటరిని కాదని, కుర్చీ కోసం తనను ఒంటరిగా చేసే కుట్రలను భగ్నం చేస్తానని, గాయపడుతున్న సోదరులంతా తన వెంటే ఉంటారని చెప్పడం వీరి అస్తిత్వ దృక్పథానికి, సామాజిక స్పృహకు నిదర్శనం. కొత్త మచ్చ అనే మరో కవితలో కూడా ఇట్లాంటి స్పృహ కనిపిస్తున్నది. కరోనా వ్యాపిస్తున్న తొలిదశలో ఈ దేశంలోకి ముస్లింలే ఆ వ్యాధిని తీసుకువచ్చినట్లుగా సామాజిక మాధ్యమాల్లో విష ప్రచారాలు విచ్చలవిడిగా సాగాయి. బహుశా ఈ నేపథ్యంలో కవి స్పందన...

"పుట్టుకతో ఉన్న మచ్చలనే ఉతికి ఆరేసుకుంటూ/ నా వతన్ మీద నాకున్న ప్యార్ ను నిరూపించుకోలేక/ నా తిప్పలేదో నేను పడతాంటే/ అటు పోయి ఇటు పోయి కొత్త మచ్చ లెక్క/ నన్ను అంటుకున్నవేందే కరోనా?" అంటూ ప్రశ్నిస్తాడు. కలల రంగు సంపుటిలో ఉన్న మరో కవిత వెలుగు రాగాల పాట ప్రజా చైతన్యమే లక్ష్యంగా ఆవిర్భవించింది.

"నక్షత్రం కాలేకపోయినా/ మినుగురులై నలుగురు కదిలితే చాలదూ/ వెలుతురు నెత్తురులో ఉరకలెత్తడానికి/ ఐదు వేళ్ళు కలిస్తే ఆయుధమవుతుందని మరిచారా/ శక్తులను వ్యక్తులుగా విడదీస్తున్న కుట్రలను గమనించలేదా..." అని నిలదీస్తూ ప్రశ్నిస్తూ పాదాలకు కవాతులు పరిచయం చేయమంటాడు. శ్వాసకు జ్వలించడం నేర్పమంటాడు. కన్నీటి నిప్పు అనే మరొక కవితలోనూ పేదరికం తీవ్రమైనప్పుడు విప్లవం తప్పదని స్పష్టం చేస్తారు.

"మరిగే గుండెలో మంట పుడితే/ కన్నీళ్లలో నిప్పు రాజుకొని/ కార్చిచ్చు వ్యాపించక తప్పదు" అని హెచ్చరిస్తారు.

ప్రజలను చైతన్య పరచడమే నిజమైన కవి కర్తవ్యం. రహీమొద్దీన్ ఈ కర్తవ్య సాధనలో కతకృత్యువయ్యారు.

రహీమొద్దీన్ స్త్రీల పట్ల సమాజంలో వారు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల సానుభూతి కలిగిన వారు. స్త్రీ పురుష సమానత్వాన్ని కాంక్షించే కవిత్వం వీరి కవిత్వ సంపుటిలో కనిపిస్తున్నది. దీన్ని స్త్రీవాద సంఘీభావ కవిత్వం అనవచ్చునేమో..

"ఇల్లు అతనిదే ఇంటి పేరు అతనిదే/ కనిపించని అనేక గాయాల సాక్షిగా/ నా దేహం మీది హక్కులన్నీ అతనివే..." పురుషాహంకార సమాజంలో ఎదుర్కొంటున్న అవస్థలను ఆవేదనభరితంగా 'హింసాగృహం' తెలియజేశారు కవితలో. ఈ కవిత చివరలో ఇట్లాంటి బాధితుల అడుగులన్నీ ఒక్కటై కవాతు చేస్తే హింసాగృహాలన్నీ ధ్వంసం అవుతాయనే ఆకాంక్షను వ్యక్తపరిచారు.

ఇట్లా చెప్పుకుంటూ వెళ్తే రహీముద్దీన్ కవిత్వమంతా ఉటంకించదగినదే. ఇటీవల కాలంలో తెలుగులో సీరియస్ కవిత్వం రాస్తున్న యువతరం పెరుగుతుండడం హర్షనీయపరిణామం. తగుళ్ల గోపాల్, తుల శ్రీనివాస్, మెట్టా నాగేశ్వరరావు, చిగురాళ్లపల్లి ప్రసాద్, పల్లిపట్టు నాగరాజు, తండా హరీష్ వంటి కవుల కోవలోనివారే రహీమొద్దీన్. భవిష్యత్తు తెలుగు కవిత్వానికి భరోసా సంతకంగా నిలుస్తున్న రహీమొద్దీన్ కవిత్వానికి జేజేలు పలుకుతున్నాను.

- డా॥ సాగర్ల సత్తయ్య,
7989117415



కొన్ని భావనలు.. !



మౌనం మరీ..
ప్రశాంతమేం కాకపోవచ్చు!
దీర్ఘకాలం మంచి
సంభాషణలే
గుర్తుంటాయేమో!!

లవణం
మంచినీళ్ళలో మిళితమై
మూలాల్ని చెరిపేసినట్లు..

జలసిరులు
సముద్రంలో కలిసి
ఉప్పుగా మారినట్లు..

నరులతో
సహవాసం పద్మవ్యూహం!
స్వార్థానికి పేటెంట్లు వీళ్ళు!!

ఉద్వేగాల్ని
ఉన్నపళంగ రెచ్చగొట్టి
ఒకే ఒక్క క్రియతో
మనోభావాల్ని దెబ్బతీస్తారు!

అందరూ..
మనమాటే వినాలనేం లేదు!
సెప్పెటోళ్ళకు సూచనో, ఆజ్ఞో
నిర్దేశించే పరిణతి ఉండాలె
కదా!!
అలాగని అన్నిసార్లు
మాటలతో పనేం జరుగదు !
చేతలతో..
నిరూపించుకోవాల్సే ఉంటది!!

పోరాటం..
సేయాల్సి వచ్చినప్పుడు
పెద్దయుద్ధమే జరగాలె!
పూలవాన కాదు
నిప్పుల వర్షమే కురువాలె!!
భావనలు, భావాలు
చెడ్డవైతే..
జీవితం ఏమంత
రుచిగుండదు!
చెట్టు వికాసానికి
భూమి లోపలి వేర్లే కారణం!
మనిషి..
ఉనికికి మంచితనమే పునాది!

- అశోక్ అవారి,
9000576581

నీవు మొలవడం ఓ తమాషా..



నచ్చవు గాని
మెత్తగా గుచ్చినా
భలే ఇష్టం నీవంటే....
అమాంతం నిజంలోకి దూకి
ఆ ధూళిలోనే ఒడిసిన కలను
ఓర్పునల్లి, నీడను చల్లి
విస్తృతంగా వీచే ఎండను తాగి
ఎర్రని కిరణాలని కౌగిట్లో ఆర్పి
మేఘమై కరగడంలో
తడవడం సరదా
తేమవడం సందడి
అందులో నీవు మొలవడం ఓ తమాషా..

- శ్రీ సాహితి, 9704437247

పోరాటాల పురిటిగడ్డపై పరశువు నెత్తిన సివంగి

స్త్రీ ఆది పరాశక్తి అంటూ పొగడ్తలతో అణిచేయడంతోనే చరిత్ర ముడిబడింది. అడుగడుగునా అదృశ్య కచ్చడాలు ధరించే, భరించే స్వాతంత్ర్య మర్యాత లేని సమాజ నేపథ్యంలో గట్టిగా మాట్లాడితే నాన్నా, ఎదురు తిరిగితే అమ్మా, లేటైతే అన్నా, రోడ్డు మీద అబ్బాయితో మాట్లాడితే పొరుగువాడూ, పైట సరిగ్గా వేసుకోపోతే ఇంట్లో పనోడూ శాశించగలిగే వెసులబాటును కల్పించిన ఈ సమాజంలో కొందరైనా గొంతు విప్పి ప్రశ్నించే స్థాయికి ఎదగడానికి తోడ్పడే అంశాలు యేవీ అని తరిచి చూస్తే, అది ఒక నికార్సైన చైతన్య స్థాయే అని చెప్పక తప్పదు. ఝూన్సీరాణి పోరాట స్ఫూర్తిలో స్వాభిమానం, ఆత్మ గౌరవం, హక్కుల్ని తిరస్కరించే విదేశీ దురాక్రమణ దారుడిపై ఏవగింపూ, నేలను కాపాడుకోవడం కోసం ప్రాణాలకైనా తెగించే వీరోచితత్వం కనబడితే - గున్నమ్మ నీ, ఐలమ్మనీ నడిపిన చైతన్యం వేరు. నిరుపేద కుటుంబాలకు చెంది, సామాజికంగా అట్టడుగు వర్గాలకు చెందిన అతి సామాన్యులు వీళ్ళు. గున్నమ్మ వెనక పున్నమ్మా, మహాలక్ష్మి, కౌసల్యా, తులశమ్మా అందరూ అలగా జనమే. ఈ వంటింటి కుందేళ్ళకు సివంగిలా గర్జించడం నేర్పిన చైతన్యం ఎక్కడిది? తలెత్తి భర్తని చూసే అలవాటు కూడా నేర్వని ఈ మనుధర్మచారిణి, కుమారీ శతకాల్ని వంట బట్టించుకున్న ఈ పొయ్యిలో పిల్లికి చిరుతలా చీల్చే శక్తి నిచ్చిన చైతన్యం ఎక్కడిది?



ఈ దుంపలోవి పిల్లతో, రైతు నాయకుడు చక్రపాణి తమ్ముడు చిన్నారాయణ, పంతుళ్ళ గురించి ఇలా అంటాడు, - "పంతుళ్ళందరికీ శాస్త్రాలు తెలిసినా, రాజు చేసింది తప్పని తెలిసినా, అది చెప్పలేరమ్మా! గుడులూ మఠాలూ కట్టి, కృష్ణా, గోదావరి ప్రాంతాల నుంచి శాస్త్రాలు తెలిసిన పంతుళ్ళ కుటుంబాలను రప్పించి, వాళ్ల సుఖంగా బతకడానికి మాన్యాలు ఇచ్చారు రాజులు. ఆ మాన్యాలు దున్ని, పంటలు పండించి, వాళ్ళ గాదెల్లో పోసింది మన రైతులూ, కూలోళ్లే! చెమట చుక్క కింద పడకుండా, నెయ్యి చుక్కలతో సన్నబియ్యం ముద్ద దిగుతుంటే, వాళ్ళు ఎందుకు చెబుతారమ్మా బుద్ధులు?"

ఇదుగో ఇటువంటి నారాయణలో, చక్రపాణీలో నింపిన ఈ చైతన్యమే ఈ మగువల్ని సివంగుల్ని చేసింది.

రైతు ఉద్యమాలను నడిపే నాయకుల చైతన్యం గడీల్లో, కోటల్లో వున్నవాళ్లను ప్రశ్నించడం నేర్పింది. తెలంగాణా రైతాంగ పోరాటం ఎందరో ఇటువంటి వీరవనితల ధీరోదాత్త, సాధారణ మహిళల చైతన్యాన్ని శిఖరాయమానంగా చూపింది. వడిశలలూ, రోకలి బండలు, కారం పొడితోనే ప్రాణాలకు తెగించి పోరాడిన మహిళల్ని తయారుచేసింది. గడీలను కూల్చిన మహోగ్రపు ఆవేశాన్ని రుచి చూపింది. దుర్భేద్యమైన కోటగోడల్ని ఛిద్రం చేసింది.

గుడ్డి ద్వేషంతోనో, వ్యక్తి పగలతోనో, శత్రు సంహారం చేసే అపరిపక్వ సెల్యులాయడ్ చైతన్యంతో కాకుండా, కనీస హక్కులకోసం, బతుక్కోసం, మట్టి కోసం, చెట్టుకోసం ప్రాణాలకు తెగించి పోరాటం చేయడంలో ముందుకురికిన ఈ మగువల తెగింపు వెనుక, వారి పోరాట పటిమ వెనుక, ఒక సుశిక్షిత చైతన్యం వుంది. చల్లపల్లి, మందస, ముసునూరు గడీలు ఇవ్వాళ ప్రాణం లేని రాళ్ల కుప్పలు, శిథిలమై పోయి, గడ్డిదుబ్బులు మొలిచి, అహంకారపు మూలుగులు వినిపించే, పీడనకు సమాధులు కట్టిన ఆనవాళ్లు. ఇదంతా యేం చెబుతోంది? ఒక జాతిని ఇంకో జాతీ, ఒక మనిషిని ఇంకో మనిషీ పీడించే న్యాయం ఇక చెల్లదని.

1940 - 50 మధ్య ఆంధ్ర ప్రాంతాల్లో వెల్లివిరిసిన చైతన్యంలో, ప్రధానంగా కమ్యూనిస్టు పార్టీ, సామాన్య ప్రజల్లో పోరాట పటిమకు అక్షరాభ్యాసం చేసింది. తలదించుకోవడానికి అలవాటు పడిన అర్భక ప్రాణాలకు ఏకంగా తలెత్తి ఎదురు తిరగడాన్ని నేర్పించింది. ఈ నేపథ్యంలో, శ్రీకాకుళం మందస ప్రాంతాల్లో, ముఖ్యంగా జాతాపు సవరలు వంటి గిరిజన తెగలు ఎక్కువగా ఉండే అటవీ భూముల్లో, భూస్వాముల, పెత్తందారీ వర్గాల దాస్టీకాలు అంతూ పొంతూ లేకుండా పోతున్న తరుణంలో, జమీందారీ గడీల పెత్తనాన్ని ఎదిరించి నిలబడిన వీర మహిళ గున్నమ్మ పోరాట స్ఫూర్తిని, ఒక డాక్యుమెంటరీగా, అదే సమయంలో, ఒక వాస్తవిక చారిత్రక గాధను, నవలా శిల్పంతో పఠితల హృదయాన్ని కట్టిపడేసే రీతిలో రాసిన తీరు అద్భుతం. నవల ఆసాంతం చివరి కంటా చదివే వరకూ పఠితలను ప్రశాంతంగా ఉండనివ్వదు. నిజంగా జరిగిన సందర్భాల్ని నవలలో ఇమిడ్చిన తీరు ప్రశంసాపాత్రం. ఇందులో తారసిల్లే నాయకులూ, ఉద్యమ దృశ్యాలూ, సంఘర్షణలు, పోరాటాలూ నిజ జీవిత సందర్భాలు.

ఒక గొప్ప చారిత్రిక నేపథ్యాన్ని నవలికగా, సజీవంగా అక్షర బద్ధం చేసిన నల్లి ధర్మారావు గారి కృషి అనన్య సామాన్యం. ఉత్తరాంధ్ర భాషా సొబగుల్ని జీర్ణించుకున్న ధర్మారావు పాత్రోచిత సంభాషణలో ఆ మధురిమలు ఎంత చక్కగా పొదవి పట్టుకున్నారంటే మీరు ఉత్తరాంధ్రవాసులైతే ఇట్టే కనెక్ట్ అయిపోతారు. కారా మాస్టారి కథలూ అప్పలనాయుడు కథలూ చదివే సాహితీ ప్రియులైతే ఈ నవల మిమ్మల్ని రంజింప చేస్తుంది. అన్నింటికీ మించి ఒక చారిత్రక నేపథ్యంలో ఒక తెగువ కలిగిన మగువ పోరాట చైతన్యాన్ని మనస్ఫూర్తిగా ఆహ్వానించే వారైతే ఈ నవల మీ హృదయాన్ని గాఢంగా తాకుతుంది.

- వి. విజయకుమార్,
8555802596



అస్తిత్వ హృదయం-హైదరాబాద్!

తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ తాత్వికతలో హైదరాబాద్ నగరానిది హృదయస్థానం. ఘనమైన చారిత్రక వారసత్వం, భిన్న సంస్కృతుల సహజీవనం, గంగాజమునా తెహజీబ్‌తో నిత్యచైతన్య స్రవంతికి వేదిక ఈ నగరం. కులీ-భాగమతి ప్రేమకు చిహ్నంగా భావించే.. ఈ అపురూపమైన నగరంపట్ల తెలంగాణ కవులు చెప్పలేని అభిమానాన్ని చాటారు. హైదరాబాద్ చారిత్రక జ్ఞాపకాలనూ, అడుగడుగునా తారసపడే వైభవోపేత వారసత్వాన్ని గుర్తుచేసుకొని మురిసిపోయారు. 'చిలుకల మేడ చార్మినారే లేకుంటే/ ఇంతకాలం చందమామ దీపంలా వెలిగేదికాదు.. హైదరాబాదు లేకుంటే మల్లెపందిరిలా అల్లుకొన్న/ ఆకాశం కూడా వుండేది కాదు' (జిగర్. పుట 53) అంటూ ఈ మహానగరపు ఆత్మీయతను, దాని పునాదులైన వందల ఏళ్ల చారిత్రక స్మృతులను ఆశారాజు పలువరిస్తాడు. ఘనమైన గతచరిత్రకు సాక్ష్యాలుగా నేటికీ నిలిచి ఉన్న చార్మినార్, లాడ్ బజార్, గుల్జార్‌హౌజ్, మూసీ నది, సాలర్‌జంగ్ మ్యూజియం, ఫలక్‌నామా, గోలకొండ కోట, దేవిడిలు, ఇరానీ హొటళ్లు, నుమాయిష్.. ఇలా నిత్యజీవితంలో తారసపడే ఈ సాంస్కృతిక ప్రతీకల్ని ఎంతో అపురూపంగా తన కవిత్వంలోకి ఎత్తుకున్నాడు.

కులమతాలకతీతంగా ప్రజలందరినీ అక్కున చేర్చుకునే తల్లి హైదరాబాద్ నగరం. హైదరాబాద్ ఒక కవల పిల్లల కన్నతల్లి/ పెద్దకొడుకు యాదగిరి రంజాన్ అంటాడు/ చిన్నవాడు దస్తగిరి దసరా అంటాడు/ ఆ తల్లికి మాత్రం ప్రతి రోజూ పండుగే" (జాగో.. జగావో. పుట 48) అంటాడు కవి అమ్మంగి వేణుగోపాల్. ఏ మతం వారైనా తన బిడ్డలపై వివక్ష చూపని తల్లి హైదరాబాద్ అని గుర్తుచేస్తూ... తానీషా కథలో అందరికీ రాముణ్ని చూపిస్తుంది/ తుర్రేబాజ్ ఖాన్ కథలో తిరుగుబాటు చెప్తుంది/ తాను మాత్రం మక్కా మసీదు పావురమై ఎగురుతుంది" అంటూ ఈ నగర చారిత్రక, సాంస్కృతిక ఔన్నత్యాన్ని, పోరాట వారసత్వాన్ని చాటిచెప్తాడు. ఎందరెందరో, ఎక్కడెక్కడి నుంచో వచ్చి హైదరాబాద్‌లో జీవిస్తూ ఉంటారు. అలా బతకడానికి వచ్చిన వారిని ఏ భేదభావం లేకుండా అక్కున చేర్చుకునే ఈ నగరాన్ని 'తోటి పిల్లలతో కొట్లాడి/ తలదాచుకోడానికొస్తే రెక్కల్లో దాచుకున్న తల్లికోడి' అని తలుచుకుంటాడు ఎస్వీ సత్యనారాయణ. తన బాల్యపు జ్ఞాపకాలలో నిండిన ఇక్కడి సర్వమత సమదృష్టిని నెమరువేసుకుంటూ.. వీధి భాగోతంలో చిందులేసే చిన్ని కృష్ణుడైనా, పీర్ల పండుగనాడు దూల ఆడినా, బాల క్రీస్తు వేషం వేసినా, బోనాల పండుగలో కోయ నృత్యం చేసినా.. హైదరాబాద్ ఒక తల్లిలా అందరినీ ఆదరించిన వైనాన్ని చిత్రిస్తాడు.




హైదరాబాద్ నగరమనగానే మొదట గుర్తుకొచ్చేది చార్మినార్ కట్టడమే. పురానీ షెహర్ (పాతబస్తీ) జీవితానికి ప్రతీక అయిన ఈ కట్టడాన్ని పేదవాని గుండెతో పోలుస్తాడు కవి అన్వర్. గరీబ్‌లోగోంకా అడ్డా - చార్మినార్/ గరీబ్ లోగోంకా హర్ ఏక్‌మాల్ - చార్మినార్" (జిగర్. పుట 43) అంటూ చార్మినార్ ఇక్కడి జీవితాల్లో ఎలా భాగమైందో చాటుతాడు. మైసమ్మ గుడిలో గంటల చప్పుడు, మసీదు అజా పిలుపులు కలిసిపోయి.. కులమతాలకు అతీతంగా హైదరాబాద్ సాంస్కృతిక ప్రతీకగా చార్మినార్ ఠీవిగా నిలబడిన తీరును చిత్రిస్తాడు.

తెలంగాణ సంస్కృతికి మేలిమి వన్నెలద్దిన మరో ముఖ్యాంశం.. ఇక్కడి సూఫీ సాంస్కృతిక దృశ్యం. మతాల కన్నా మనుషులే ముఖ్యమన్న తత్వం. హైదరాబాదే కాదు.. తెలంగాణా నలుచెరగులా కనిపించే ఈ నమ్మకాన్ని ఎలుగెత్తుతూ.. "తెల తెల వారుతున్నప్పుడు/ దర్గా దయకోసం మోకరిల్లిన/ అన్ని మతాల వారినీ చూశాను" అంటూ కవి యాకూబ్ (తెలంగాణా కవిత 2009. పుట 86-87) తెలంగాణ ఆత్మలో భాగమైన బహుళ సంస్కృతిని చాటుతాడు.

ప్రేమకు చిహ్నంగా అకురించిన హైదరాబాద్ నగర చారిత్రక మూలాలను స్పృశిస్తూ.. "ఒక తెలంగాణ తల్లి భాగీరథి/ ఒక తెలంగాణ ప్రేయసి భాగమతి/ తెలంగీ"ని హత్తుకున్న ప్రేమ ఫలాని" అంటారు సుంకిరెడ్డి నారాయణరెడ్డి (జిగర్. పుట 285). ఈ ఇద్దరి పేరు మీదగానే భాగ్యనగర్ నిర్మాణానికి పునాది వేసి.. తెలంగీని హత్తుకున్న కులీ కుతుబ్‌షాహి గొప్పతనాన్ని చాటిచెపుతాడు. "కుమారగిరి సింగభూపాల/ కృష్ణరాయల రాసిక్య/ రచనా పల్లకీల మోతల్లో/ నువ్వు లేవు గానీ/ తరాజు ముల్లు నీవైపే/ తొలి ఉర్దూ రాజకవీ" అంటూ సాహిత్య చరిత్ర రచనలో కులీని విస్మరించిన వైనాన్ని గుర్తుచేస్తాడు. స్వయంగా కవి అయిన కులీ ఉర్దూలో 'ఖుల్లీయత్' అనే కవితా సంపుటిని ప్రకటించి.. తొలి ఉర్దూ రాజకవిగా ఘనత వహించిన తీరును జ్ఞప్తికి తెస్తాడు.

"ఇరానీ చాయ్ కమ్మదనపు రుచి/ హైదరాబాదీ బిర్యానీ ఘుమఘుమల ధూమాలు/ భూమి చుట్టూ సాంబ్రాణి పొగలై అలుముకుంటాయి" (జాగో.. జగావో. పుట 43) అంటూ షాజహానా తెలంగాణ అస్తిత్వానికి, ఔన్నత్యానికి ప్రధాన భూమికగా నిలిచిన ఈ నగరాన్ని హృదయానికి హత్తుకుంటారు. మలిదశ ఉద్యమంలో హైదరాబాద్ ఎవరిది అన్న చర్చను ధిక్కరిస్తూ.. ఈ నగర మూలవాసులుగా, ఇక్కడ తరతరాలుగా నివసిస్తున్న ప్రజల వారస్వత హక్కుగా ఈ నగరం తమకే చెందుతుందని గొప్ప అస్తిత్వ చైతన్యంతో తెలంగాణ కవులు చాటారు. ఈ నగరం మీద ఎనలేని ప్రేమనే కాదు.. దీనిపై తమ హక్కును కూడా గొప్ప ఆత్మగౌరవంతో ప్రకటించుకున్నారు. "బాజాప్తుగ భాగ్యనగరం మాదే/ గీ అవ్వల్ దర్జా హైద్రాబాద్/ మా వీర తెలంగాణది/ పోరు తెలంగాణది/ మా వేరు తెలంగాణది" (జాగో.. జగావో. పుట 64) అంటారు జూపాక సుభద్ర. తెలంగాణ సంస్కృతిలో, జీవనరీతిలో అంతర్లీనమైన హైదరాబాద్ ఎవరిదీ అనే ప్రశ్న మలిదశ ఉద్యమంలో రావడమే ఇప్పుడు పెద్ద ఆశ్చర్యంగా అనిపించవచ్చు. ఈ క్రమంలోనే తెలంగాణ అస్తిత్వాన్నే కాదు.. ఆ అస్తిత్వాన్ని మూలకేంద్రమైన హైదరాబాద్ నగరాన్ని కూడా గుండెలనిండా నింపుకొని.. తమ కవితాపతాకాలను ఎగరేశారు కవులు. తమ అస్తిత్వ వైభవంలో మణిహారమైన హైదరాబాద్ నగరాన్ని గొప్ప సాంస్కృతిక అభినివేశంతో కవిత్వంలో పలికించి.. ఈ నగర ఘనతలను మరోసారి పునర్జీవింపజేశారు.

- కె. శ్రీకాంత్,
8008668285
పరిశోధక విద్యార్థి,
ఉస్మానియా యూనివర్సిటీ



సాహితీ వార్తలు

'వెంకటయ్య బావి' ఆవిష్కరణ

దాసరి మోహన్ రచించిన 'వెంకటయ్య బావి' నవల ఆవిష్కరణ ఈ నెల 25వ తేదీ సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి మినీహాల్లో జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జంట నగరాల తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు కందుకూరి శ్రీరాములు, నందిని సిధారెడ్డి, రూప్‌కుమార్ డబ్బీకార్, కాంచనపల్లి గోవర్ధనరాజు, పొత్తూరి సుబ్బారావు, నాళేశ్వరం శంకరం, వఝల శివకుమార్, రమాదేవి కులకర్ణి, బెల్లంకొండ సంపత్‌కుమార్ హాజరవుతారు.

సాహిత్య అకాడమీ గ్రంథావిష్కరణ

సాహిత్య అకాడమీ, తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథావిష్కరణ ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సి. మృణాళిని, పి.ఎస్.గోపాలకృష్ణ, మామిడి హరికృష్ణ, నందిని సిధారెడ్డి, ఖదీర్ బాబు, అనంత్ చింతలపల్లి, ప్రసేన్, స్వర్ణ కిలారి, నాళేశ్వరం శంకరం పాల్గొంటారు.

కొలకలూరి పురస్కారాలు -2024

కొలకలూరి సాహిత్య పురస్కారాలు ఈ సంవత్సరం కూడా మూడు ప్రక్రియా గ్రంథాలకు మూడు పురస్కారాలు ప్రకటించారు. ఈ పురస్కారాలకు తెలుగు సాహిత్య స్రష్టలందరూ అర్హులు. ప్రతి పురస్కారానికి 15 వేల రూపాయలు బహుమతి. ఆయా ప్రక్రియల్లో ప్రచురితమైన గ్రంథాలు జనవరి 1. 2022 తర్వాత ముద్రితమైనవి ఒక్కొక్కరు ఒక సంకలనం మాత్రమే నాలుగేసి ప్రతులు పంపాలి. చిరునామాలు : 1. కథానికా సంకలనాలు/ నవలలు: ఆచార్య కొలకలూరి మధుజ్యోతి (సెల్ 94419 23172), తెలుగు శాఖాధ్యక్షులు, పరీక్ష విభాగం డీన్,అకడమిక్ అఫైర్స్ డీన్, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి - 517 502 ఆం.ప్ర. 2. విమర్శన గ్రంథాలు: ఆచార్య కొలకలూరి సుమకిరణ్ (సెల్: 99635 64664), ఆంగ్లాచార్యులు, ఆంగ్లశాఖాధ్యక్షులు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి - 517 502. ఆం.ప్ర.

'సముద్రం' అంశంపై కథల పోటీ

విశాలాక్షి సాహిత్య మాస పత్రిక శ్రీ ఆళ్ల దశరథరామిరెడ్డి స్మారకంగా 'సముద్రం' అంశంపై కథల పోటీ నిర్వహించి ఎంపికైన కథలతో ప్రత్యేక కథా సంపుటి తేవాలనుకుంది. ప్రథమ బహుమతి ఐదు కథలకు ఒక్కో కథకు రూ.5 వేలు, ద్వితీయ బహుమతి ఐదు కథలకు ఒక్కంటికి రూ. 3 వేలు, తృతీయ బహుమతి ఐదు కథలకు రూ.2 వేలు. సాధారణ ప్రచురణకు ఎంపికైన ప్రతి కథకు వెయ్యి రూపాయలు. ఒకరు ఒక కథ మాత్రమే పంపాలి. ఏ అంశం అయినా కథా వస్తువుగా స్వీకరించవచ్చు. జనవరి 20, 2024 లోపు విశాలాక్షి సాహిత్య మాస పత్రిక, 27-5-487 పద్మావతి నగర్, బాలాజీ నగర్ ఎక్స్టెన్షన్, నెల్లూరు 524002 కు పంపాలి.

- ఈతకోట సుబ్బారావు, 9440529785

దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@gmail.com కు పంపించగలరు. చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్‌నెం. 21/1, అజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500020

ఈవీఎం మాయ

- 'ఇండియా' కూటమి అనుమానాలు
- మూడు రాష్ట్రాల్లో ఊహించని ఫలితాలపై ఆశ్చర్యం



న్యూఢిల్లీ : ఇటీవల ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం) మళ్లీ చర్చకు వచ్చింది. పలు సర్వేలు, ఎగ్జిట్ పోల్స్‌కు విరుద్ధంగా వచ్చిన ఈ ఫలితాలు సర్వత్రా ఆశ్చర్యాన్ని కలిగించాయి. ముఖ్యంగా, రెండు రాష్ట్రాల్లో అధికారాన్ని కోల్పోయిన కాంగ్రెస్‌కు ఇది షాక్‌ను కలిగించింది. 'ఇండియా' కూటమి సైతం ఈవీఎంల పనితీరుపై అనుమానాలు వ్యక్తం చేసింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ఈనెల 7న వెలువడ్డాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోయింది. బీజేపీ విజయం సాధించింది. మధ్యప్రదేశ్ ఎన్నికల్లోనూ గెలిచి కాషాయ పార్టీ అధికారాన్ని మళ్లీ నిలబెట్టుకున్నది. వాస్తవానికి ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికలకు సంబంధించి పలు వార్త సంస్థలు, సర్వే ఏజెన్సీలు ఎగ్జిట్ పోల్ ఫలితాలను విడుదల చేశాయి. పలు సంస్థలు ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందనీ, తెలంగాణలో తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతుందని అంచనా వేశాయి. అలాగే, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో టఫ్ ఫైట్ ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఫలితాలు ఉంటాయని చెప్పాయి. అయితే, డిసెంబర్ 7న వెలువడిన ఫలితాల్లో మాత్రం ఇది పూర్తి విరుద్ధంగా మారింది. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో విస్పష్టమైన మెజారిటీతో బీజేపీ అధికారంలోకి వచ్చింది. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోసి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నది. అయినప్పటికీ.. ఫలితాల్లో ఇది ప్రతిబింబించకపోవటం, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో ఊహించనీ రీతిలో కాషాయ పార్టీ సీట్లను గెలుచుకొని అధికారాన్ని సొంతం చేసుకోవటంపై కాంగ్రెస్‌తో పాటు 'ఇండియా' కూటమిలోని పలు పార్టీలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నాయి.ఫలితాలు వెలువడిన అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ ఇవే ఆరోపణలు చేశారు. తమ ఓటమికి కారణం ఈవీఎంలేనని చెప్పారు. దీంతో ఈవీఎంలపై చర్చ మళ్లీ మొదటికొచ్చినట్టయ్యింది. ఈవీఎం అనేది ఒక పరికరమనీ, దానిని ట్యాంపరింగ్, హ్యాకింగ్ చేయవచ్చని కొందరు నిపుణులు అంటున్నారు. అలాగే, కావాల్సిన విధంగా ప్రోగ్రామింగ్ చేసుకునే అవకాశాలనూ కొట్టిపారేయలేమని చెప్తున్నారు. ఇలాంటి అనుమానాల నేపథ్యంలో కాంగ్రెస్ మాత్రం బ్యాలెట్ పోరుకు డిమాండ్ చేస్తున్నది. మరికొన్ని పార్టీలైతే వీవీప్యాట్‌లను వంద శాతం లెక్కించాలనీ, లేదనకుంటే వాటిని ఓటరుకు ఇచ్చి బ్యాలెట్ బాక్స్‌లో వేసే విధంగా సిస్టమ్‌ను మార్చాలని చెప్తున్నాయి. రానున్న లోక్‌సభ ఎన్నికలను పరిగణనలోకి తీసుకొని ఎన్నికల సంఘం ఈ విషయంలో వేగంగా స్పందించి అందుకు అనుగుణంగా మార్పులు తీసుకురావాలని కాంగ్రెస్ సహా పలు పార్టీలు కోరుతున్నాయి.

సోషల్ మీడియాకు బైబై

- 2025 నాటికి 50 శాతానికి పైగా వినియోగదారులు దూరం
- గార్ట్‌నర్ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ : సోషల్ మీడియా నేటి ప్రజలపై ఎంతగానో ప్రభావం చూపుతున్నది. అనేక మంది ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, స్నాప్‌చాట్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలను చూడనిది తమ రోజును గడపలేకపోతున్నారు. అయితే, స్వేచ్ఛ అధికంగా ఉండే ఈ సామాజిక మాధ్యమానికి వినియోగదారులు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడం, విషపూరితమైన వినియోగదారు స్థావరాలు, బాట్‌ల ప్రాబల్యం కారణంగా 50 శాతం కంటే ఎక్కువ మంది వినియోగదారులు 2025 నాటికి సోషల్ మీడియాతో తమ పరస్పర చర్యలను వదులుకోవటం, గణనీయంగా పరిమితం కావటం వంటివి చేయనున్నారు. ఈ విషయాన్ని గార్ట్‌నర్ తన సర్వేలో వెల్లడించింది. సర్వే సమాచారం ప్రకారం.. 53 శాతం మంది వినియోగదారులు గత సంవత్సరం లేదా ఐదేండ్ల క్రితంతో పోలిస్తే ప్రస్తుత సోషల్ మీడియా స్థితి క్షీణించిందని నమ్ముతున్నారు. "డిజిటల్ మార్కెటింగ్ కోసం సోషల్ మీడియా టాప్ ఇన్వెస్ట్‌మెంట్ ఛానెల్‌గా ఉన్నది. అయితే వినియోగదారులు తమ వినియోగాన్ని పరిమితం చేయటానికి చురుకుగా ప్రయత్నిస్తున్నారు" అని గార్ట్‌నర్ మార్కెటింగ్ ప్రాక్టీస్‌లో సీనియర్ ప్రిన్సిపల్ రీసెర్చర్ ఎమిలీ వీస్ అన్నారు.

ప్రతి మహిళకూ సాధికారత కల్పించాలి

- భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



న్యూఢిల్లీ : భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే ప్రతి మహిళకూ సాధికారత కల్పించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా భారత్ స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలను జరుపుకునే లక్ష్యాన్ని సాధించటం దేశంలోని ప్రతి మహిళ బలం, స్వావలంబన, సాధికారతపై ఆధారపడి ఉన్నదని ఆమె తెలిపారు. అణగారిన వర్గాలను, ముఖ్యంగా మహిళలను ఉద్ధరించడంలో స్వయం సహాయక సంఘాల పాత్రను కూడా ఆమె నొక్కి చెప్పారు. జైసల్మేర్‌లో జరిగిన లఖపతి దీదీ సదస్సులో ప్రసంగిస్తూ ఆమె ఈ విధంగా అన్నారు. రాజస్థాన్‌లోని మహిళలు వారి కుటుంబాలు, ఆర్థిక పురోగతికి అందిస్తున్న సహకారాన్ని రాష్ట్రపతి ఎత్తిచూపారు. రాష్ట్రంలో 11 లక్షలకు పైగా "లఖపతి దీదీలను" తయారు చేయటం కేంద్ర ప్రతిష్టాత్మకమైన లక్ష్యమని అన్నారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోడీ 'లఖపతి దీదీ' పథకాన్ని ప్రకటించారు. ఇందులో రెండు కోట్ల మంది మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఇస్తూ మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌ను ప్రారంభించేలా ప్రోత్సహిస్తారు.

ఇమ్రాన్‌ఖాన్ పిటిషన్‌కు పాక్ సుప్రీంకోర్టు నో

- మూడేండ్ల శిక్షను తగ్గించాలని మాజీ ప్రధాని విన్నపం

ఇస్లామాబాద్ : తోషాఖానా అవినీతి కేసులో పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బతగిలింది. మూడేండ్ల శిక్షను రద్దు చేయాలన్న ఇమ్రాన్‌ఖాన్ అప్పీల్‌ను సుప్రీంకోర్టు కార్యాలయం తిప్పి పంపినట్లు స్థానిక మీడియా ఆదివారం తెలిపింది. 2023, డిసెంబర్ 11న ఇస్లామాబాద్ హైకోర్టు (ఐహెచ్‌సి) ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 185 ప్రకారం ఇమ్రాన్‌ఖాన్ కౌన్సిల్ లతీఫ్ ఖోశా దాఖలు చేసిన అప్పీల్‌ను శనివారం రిజిస్ట్రార్ కార్యాలయం తిప్పి పంపింది. వాస్తవ వివాదాలు లేదా గత వ్యాజ్యం కాలక్రమానికి అనుసరించి పిటిషన్ లేదని పేర్కొంది. ప్రభుత్వ బహుమతులను చట్టవిరుద్ధంగా విక్రయించినందుకు ఐహెచ్‌సి అదనపు సెషన్స్ జడ్జి ఈ ఏడాది ఆగస్టు ఐదున ఇమ్రాన్‌ఖాన్‌కు మూడేళ్ల జైలుశిక్ష విధించిన సంగతి తెలిసిందే. తోషాఖానా లేదా రాష్ట్ర రిపోజిటరీ నిబంధనలను మాజీ ప్రధాని ఉల్లంఘించారంటూ తోషాఖానా కేసు నమోదైంది.

నకిలీల నడుమ ప్రజాస్వామ్యం

- ఫేక్ వార్తలు, క్లెయిమ్‌లతో తప్పుడు సమాచారం
- మోడీ పాలనలో అర్థం మారిన డెమోక్రసీ
- ప్రజలపై ప్రభుత్వానిది చిన్న చూపు
- సామాజిక కార్యకర్తలు, మేధావుల ఆందోళన





ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పబడుతున్నది. నివజతీ 140 కోట్ల మంది ప్రజలున్న ఈ దేశంలో ప్రజాస్వామ్యానికి అర్థం మారిపోతున్నది. కల్పిత వార్తలు, తప్పుడు ప్రకటనలు, ప్రచారాలు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి. ముఖ్యంగా, కేంద్రంలోని మోడీ పాలనలో అసలైన ప్రజాస్వామ్యానికి అర్థం మారిపోయి తప్పుడు మార్గంలో ప్రయాణిస్తున్నదని సామాజిక కార్యకర్తలు మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే పాలనలో ప్రజలను చిన్న చూపు చూస్తున్న విధానమే ఇందుకు నిదర్శనమని వారు అంటున్నారు.

న్యూఢిల్లీ : మోడీ పాలనలో ప్రజా, పత్రికా స్వేచ్ఛ హరించుకుపోయిందనీ, పలు దేశీయ, విదేశీ సంస్థల నివేదికలు సైతం వెల్లడిస్తున్నాయన్నాయి. ప్రజాస్వామ్య మంటే తమ పాలనేననీ, గత ప్రభుత్వాల కంటే తమ ప్రభుత్వంలోనే ఇది వెలుగొందుతున్నదని మోడీ సర్కారు చెప్పుకుంటున్నది. అయితే, ప్రజాస్వామ్యంలో ప్రజల నిర్ణయమే ప్రధానమనీ, కానీ కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఇవేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నదని సామాజిక కార్యకర్తలు అంటున్నారు. ఇందుకు వారు అనేక సందర్భాలనున గుర్తు చేస్తున్నారు.

కేవలం ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని ఎన్నికల్లో రాజకీయంగా లబ్ది పొందాలని మోడీ సర్కారు అనేక అడ్డదారుల్లో ప్రయాణిస్తున్నదనీ, ప్రజాస్వామ్య దేశానికి ఇదేమీ మంచి పరిణామం కాదని విశ్లేషకులు అంటున్నారు. 'బేటీ బచావో-బేటీ పడావో' అంటూ మహిళా సాధికారత విషయంలో మాటలు చెప్పే మోడీ ప్రభుత్వం.. చేతల్లో దానిని విస్మరిస్తున్నదని చెప్తున్నారు. దేశంలో మహిళా రెజ్లర్ల ఆందోళనలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ అని సామాజిక కార్యకర్తలు, విశ్లేషకులు అంటున్నారు.

వార్తలు, లోతైన ఫేక్ న్యూస్, క్లెయిమ్‌లు, కౌంటర్ క్లెయిమ్‌లు వంటి గందరగోళం మధ్య, నకిలీ, నిజమైన ప్రజాస్వామ్యాల మధ్య తేడాను గుర్తించడం చాలా కష్టంగా మారుతున్నదని సామాజిక కార్యకర్తలు చెప్తున్నారు.

ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్షాలు, పత్రికలు, మేధావులు, విమర్శకుల పాత్ర చాలా కీలకం. అయితే, బీజేపీ పాలనలో మాత్రం వారికి తగిన స్థానం దక్కటం లేదని ఆరోపిస్తున్నారు. ప్రజాస్వామ్య దేశం అభివృద్ధి చెందాలంటే ప్రశ్నించటమే ప్రధానమనీ, అలా ప్రశ్నించిన వారి గొంతు నొక్కితే అది ఆ దేశానికే ప్రమాదమని సామాజిక కార్యకర్తలు అంటున్నారు. ఇటీవల పార్లమెంటు సమావేశాల్లో పెద్ద ఎత్తున ఎంపీల సస్పెండ్‌ను వారు ఉటంకిస్తున్నారు. ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులను సామాజిక మాధ్యమాల్లో 'బఫూన్లు'గా చేసి చూపిస్తూ బీజేపీ సోషల్ మీడియా విభాగం, దాని అనుబంధ వార్త ఛానెళ్లు ఆనందం పొందుతున్నాయనీ, ఇలా చేస్తే బీజేపీకి తాత్కాలికంగా ఉపశమనం కలిగించవచ్చేమో కానీ కోట్లాది మంది ప్రజలున్న భారతదేశానికి ఇది చాలా ప్రమాదకరమని మేధావులు అంటున్నారు. ప్రజాస్వామ్యమన్న పదం చాలా విలువైనదనీ, దానిని ప్రతి ఒక్క చోటా రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని చెప్తున్నారు.

ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదంపై మోడీ సర్కారు ఏకపక్ష తీరు కూడా ఆందోళన కలిగిస్తున్నదని అంటున్నారు. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో విమర్శలు, పోస్టులు చేస్తే కొందరు అరెస్టు అయిన విషయాన్ని సామాజిక కార్యకర్తలు గుర్తు చేస్తున్నారు.

మోడీ సర్కారు ఇజ్రాయెల్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకోవటమే ఇందుకు కారణమనీ, ప్రజాస్వామ్య దేశమని చెప్పుకునే భారత్‌లో ఇదేరకమైన వ్యవహారమని మేధావులు ప్రశ్నిస్తున్నారు. బీజేపీ సర్కారు తన నిర్ణయాన్ని సమర్థించుకోవటంలో భాగంగా తన ఐటీ సెల్ విభాగంతో సోషల్ మీడియాలో విరివిగా నకిలీ వార్తలు, కథనాలు, పోస్టలతో ప్రజల మెదళ్లను కలుషితం చేస్తున్నదనీ, మోడీ సర్కారు నిర్ణయాలేవైనా సాహసోపేతమైనవంటూ కట్టుకథలు రాసుకొస్తున్నదని విశ్లేషకులు అంటున్నారు.

నట్టనడి సంద్రంలో రోహింగ్యాలు



- వారిని కాపాడాలంటూ విజ్ఞప్తి
- మరింత మంది చనిపోయే ప్రమాదముందని హెచ్చరిక

ఢాకా : దాదాపు 200మంది రోహింగ్యా శరణార్థులు ప్రయాణిస్తున్న బోటు ఇంజన్ విఫలమవడంతో హిందూ మహా సముద్రంలో చిక్కుకుపోయిన వారిలో భయాందోళనలు పెరుగుతున్నాయి.

ఆ బోటులోని ప్రయాణికుడు ఒకరు మరణించడంతో పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. మరింతమంది చనిపోయే ప్రమాదము ందని, ఇప్పటికే డజన్ల సంఖ్యలో ప్రయాణికుల పరిస్థితి ఆందోళనకరంగా వుందని ఐక్యరాజ్య సమితి శరణార్థుల హై కమిషనర్ (యుఎన్‌హెచ్‌సిఆర్) హెచ్చరించింది. బోటులో 185మంది రోహింగ్యాలు వున్నారు. వీరిలో ఎక్కువమంది మహిళలు, పిల్లలే. అండమాన్ నికోబార్ దీవులకు సమీపంలో బోటు విఫలమవడంతో వారి పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. బంగ్లాదేశ్‌లో కిక్కిరిసిపోయిన శరణార్థ శిబిరాల నుండి రోహింగ్యాలు పారిపోతున్నారు. తమ మాతృభూమి మయన్మార్ నుండి వచ్చేసి ఇక్కడ వారు ఆశ్రయం పొందారు.

ముస్లిం మైనారిటీలపై మిలటరీ అణచివేత చర్యలకు పాల్పడడంతో 2017లో వీరు మయన్మార్ నుండి పారిపోయారు. నడి సముద్రంలో చిక్కుకుపోయిన వారిని సకాలంలో కాపాడకపోతే, సమీపంలోని సురక్షితమైన ప్రాంతానికి చేర్చకపో యినట్లైతే అనేక తీర ప్రాంత దేశాలు చూస్తుండగానే వారిలో అనేకమంది చనిపోతారని యుఎన్‌హెచ్‌సిఆర్ హెచ్చరించింది. నిజంగా ఇది దారుణమైన పరిస్థితని వ్యాఖ్యానిం చింది. మయన్మార్‌లో తమపై జరుగుతున్న వేధింపులు భరించలేక వేలాదిమంది రోహింగ్యాలు ముప్పుతో కూడిన సముద్ర ప్రయాణాలు చేస్తూ, ఇతర ప్రాంతాలకు ప్రధానంగా మలేసియా లేదా ఇండోనేషియాలకు తరలిపోతున్నారు. గతేడాది 2వేల మందికి పైగా రోహింగ్యాలు ఇలాగే ప్రయాణించారు. ఇలా ప్రయాణించే వారిలో గతేడాది నుండి 570మందికి పైగా మరణించారు.

ఈ స్థాయిలో మానవ విపత్తులు జరగకుండా నివారించేందుకు ఈ ప్రాంతంలోని దేశాలు తక్షణమే పూర్తి స్థాయిలో సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం వుందని యుఎన్ హెచ్‌సిఆర్ స్పష్టం చేసింది.

29న కేరళ క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ



తిరువనంతపురం : కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ 29న జరగనుంది. ఇద్దరు నూతన మంత్రులు ఈ నెల 29న ప్రమాణస్వీకారం చేయనున్నారని, ముఖ్యమంత్రి పినరయి విజయన్ వారి పోర్టుఫోలియోలను నిర్ణయించనున్నారని ఎల్‌డీఎఫ్ కన్వీనర్ ఇపి జయరాజన్ ఆదివారం విలేకరులకు వెల్లడించారు. ఆదివారం రాష్ట్ర కమిటీ సమావేశం తరువాత ఆయన మాట్లాడుతూ 2021లో రెండోసారి విజయన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో నాలుగు మిత్రపార్టీలకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలకు రెండున్నర సంవత్సరాల కాల పరిమితితో మంత్రి పదవి అవకాశం ఇస్తామని హామీ ఇచ్చింది గుర్తు చేశారు. ఇద్దరు మంత్రుల కాల పరిమితి ఈ ఏడాది నవంబర్‌లోనే పూర్తయిందని, అయితే 'నవకేరళ సదస్సు' కారణంగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఆలస్యమయిందని తెలిపారు. ప్రస్తుత మంత్రులు డెమోక్రటిక్ కేరళ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆంటోని రాజు, ఇండియన్ నేషనల్ లీగ్ ఎమ్మెల్యే అహ్మద్ దేవర కోవిల్ స్థానంలో కేరళ కాంగ్రెస్(బి) ఎమ్మెల్యే కెబి గణేష్ కుమార్, కాంగ్రెస్ (ఎస్) ఎమ్మెల్యే కాదనపల్లి రామచంద్రన్ ప్రమాణ స్వీకారం చేయనున్నారని జయరాజన్ చెప్పారు. ఆంటోని రాజు, అహ్మద్ దేవర కోవిల్ ఆదివారం ఉదయం ముఖ్యమంత్రి విజయన్‌కు రాజీనామా లేఖలు సమర్పించినట్లు తెలిపారు. మరోవైపు మంత్రి పదవులు ఆశిస్తున్న వారిలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కె.థామస్, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (లెనినిస్ట్) నాయకులు, ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన కోవూరు కుంజుమోన్ ఉన్నట్లు సమాచారం.

గాజాలో కాల్పుల విరమణను కోరలేదు

- వెల్లడించిన బైడెన్
- నెతన్యాహుతో సుదీర్ఘంగా ఫోన్‌లో చర్చలు



గాజా : అమెరికా అధ్యక్షుడు బైడెన్, ఇజ్రాయిల్ అధ్యక్షుడు నెతన్యాహులు గాజాలో సాగుతున్న మిలటరీ ఆపరేషన్ లక్ష్యాలు, వాటి తీరుతెన్నులపై చర్చించారు. ఇరువురు నేతలు టెలిఫోన్‌లో సుదీర్ఘంగా మాట్లాడుకున్నారు. గాజాలో కాల్పుల విరమణ గురించి తాను నెతన్యాహును అడగలేదని బైడెన్ చెప్పారు. శనివారం నెతన్యాహుతో తాను సుదీర్ఘంగా మాట్లాడానని, కానీ అదంతా ప్రైవేట్ సంభాషణ అని బైడెన్ విలేకర్లకు చెప్పారు. కాల్పుల విరమణ గురించి తాను ప్రస్తావించలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తర్వాత వైట్‌హౌస్ దీనిపై ఒక ప్రకటన చేసింది. గాజాలోని పౌరులను కాపాడాల్సిన అవసరాన్ని బైడెన్ నొక్కి చెప్పారని ఆ ప్రకటన పేర్కొంది. యుద్ధం జరుగుతున్న ప్రాంతాల నుండి దూరంగా సురక్షిత ప్రాంతాలకు వెళ్ళడానికి ప్రజలను అనుమతించాల్సిన ప్రాముఖ్యతను కూడా వారు చర్చించారు. అలాగే మిగిలిన బందీలను కూడా సురక్షితంగా విడుదల చేయాల్సిన అవసరం వుందన్నారు. గాజాలో తక్షణమే సాయాన్ని పెంచాల్సిన అవసరం వుందని కోరుతూ భద్రతామండలి తీర్మానాన్ని ఆమోదించిన నేపథ్యంలో ఇరువురు నేతలు చర్చించారు. ఐక్యరాజ్య సమితిలో అమెరికా తీసుకున్న వైఖరిని నెతన్యాహు ఈ సందర్భంగా అభినందించారు. తామనుకున్న లక్ష్యాలన్నీ పూర్తిగా నెరవేరేవరకు ఇజ్రాయిల్ ఈ యుద్ధాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. గత 24గంటల్లో గాజాలో 200మందికి పైగా మరణించారు.

సైనిక కస్టడీలో పౌరుల మరణం దారుణం

- జమ్మూ కాశ్మీర్‌లో సైనిక హత్యలను ఖండించిన సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ : జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ముగ్గురు పౌరులు సైనిక కస్టడీలో వుండగా దారుణంగా చనిపోవడాన్ని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. మహమ్మద్ షౌకత్, సఫీర్ హుస్సేన్, షబ్బీర్ అహ్మద్‌లను సైనిక సిబ్బంది తమ అదుపులోకి తీసుకుని, వారిని తీవ్రంగా హింసించి, వేధించారని, ఫలితంగా వారు మరణించారని పొలిట్‌బ్యూరో తెలిపింది. బాధిత కుటుంబాలకు జమ్మూ కాశ్మీర్ పాలనా యంత్రాంగం నష్టపరిహారాన్ని ప్రకటించింది. కానీ, అది సరిపోదని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ ఘటనపై సత్వరమే దర్యాప్తు జరపాలని, బాధ్యులైన వారిని శిక్షించాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. శిక్ష పడకుండా తప్పించుకునే ఇలాంటి వెసులుబాటు చర్యలతో దీర్ఘకాలంగా బాధలు పడుతున్న జమ్మూ కాశ్మీర్ ప్రజలు ఈ విషయంలో జవాబుదారులెవరో నిర్ధారిస్తారని, న్యాయం జరిగేలా చూస్తారని ఆశిస్తున్నారు.

నిర్వీర్యం చేశారు

సింగరేణిని 25 ఏండ్లుగా ఏలిన గుర్తింపు సంఘాల వైఫల్య ఫలితం

- 1.16 లక్షల నుంచి 39 వేలకు పడిపోయిన కార్మికుల సంఖ్య
- ఖజానా ఖాళీ చేసిన కేసీఆర్.. సంస్థనే మూసే పనిలో మోడీ
- కాపాడుకోవలసిన బాధ్యత కార్మికులదే..
- 27న సింగరేణి ఎన్నికలు



నవతెలంగాణ-ఇల్లందు

135 సంవత్సరాల చరిత్ర గల సింగరేణిని బొందల గడ్డగా మార్చిన ఘనత గుర్తింపు సంఘాలుగా ఉన్న ఏఐటీయూసీ-ఐఎన్‌టీయూసీ, టీబీజీకెఎస్‌లకే దక్కింది. 1998లో తొలిసారిగా సింగరేణిలో ఎన్నికలు జరిగాయి. ఆనాటి నుంచి ఏఐటీయూసీ 3 సార్లు, ఐఎన్‌టీయూసీ ఒక్కసారి గెలిచింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవించిన అనంతరం జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘం టీబీజీకేఎస్ 2012, 2017లో గెలుపొందింది.

బొగ్గు బ్లాకులను కాంట్రాక్టీకరణ చేసిన ప్రధాని మోడీ..!

1998 నుంచి 3 సార్లు దాదాపు పుష్కరకాలం సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ సంస్కరణలపై పోరాట బాట వదిలి పైరవీలు చేసుకుంటూ యాజమాన్యం తొత్తు సంఘంగా మిగిలింది. కార్మికులకు, సంఘాలకు వ్యతిరేకంగా సింగరేణి యాజమాన్యం ప్రవేశపెట్టిన సంస్కరణలకు తలూపింది. పైకి మాత్రం వ్యతిరేక పోరాటం అంటూ హల్‌చల్ చేసినా.. కోడ్ ఆఫ్ డిసిప్లేన్, ఓసీల ఏర్పాటు, వారసత్వ తొలగింపు, ప్రయివేటీకరణ ప్రవేశపెట్టినా నోరెత్తలేదు. కోడాఫ్ డిసిప్లేన్ వల్ల గుర్తింపు సంఘం తప్ప మిగతా సంఘాలకు యాజమాన్యంతో మాట్లాడే అవకాశం లేకుండా పోయింది. బొగ్గుబావులపై మీటింగ్‌లకు గుర్తింపు సంఘానికే అవకాశం ఉండేటట్టు చేశారు. కార్మికుల హక్కులు కాలరాశారు. దాంతో ఆ సంఘానికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి. గుర్తింపు సంఘం సూచించినవారికే సింగరేణిలో ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, క్వార్టర్స్, కోరుకున్న చోట బదిలీలు, తేలికపాటి పనులు తదితర అవకాశాలు కల్పించారు. వ్యతిరేకించిన కార్మిక సంఘాల నాయకులను ఇబ్బందులకు గురిచేశారు. కఠినమైన పనులకు పంపారు. సమస్యలపై కార్మికులు గుర్తింపు సంఘం దగ్గరికి వెళితే తమ సంఘంలో చేరితేనే సమస్య పరిష్కరింపజేస్తామని తేల్చిచెప్పేవారు. ఆ విధంగా కార్మికులను లోబరుచుకున్నారు. మాట వినని కార్మికులను తేలికపాటి పనుల నుంచి కఠినమైన పనిలో వేయడం, జనరల్ షిఫ్ట్ అయితే మూడు షిఫ్టుల్లోకి మార్చడం చివరికి ఆదిలాబాద్ జిల్లా గోలేటి మైన్స్‌కు బదిలీ చేయడం కార్మికులు చవిచూశారు. ఇదే బాటలో ఐఎన్‌టీయూసీ నడిచింది. టీబీజీకేఎస్ గెలిచిన అనంతరం ఒకడుగు ముందుకు వేసిన మాజీ సీఎం కేసీఆర్ సింగరేణిని తన గుప్పిట్లో పెట్టుకుని రాజకీయ జోక్యానికి తెరలేపారు. రూ.29 వేల కోట్ల బ్యాంక్ బ్యాలెన్స్ ఉన్న సింగరేణి ఖజానా ఖాళీ చేసి నిర్వీర్యం చేశారు. ప్రధాని మోడీ గారేమో.. కోల్ ఇండియాలో161 బొగ్గు బ్లాకులు, తెలంగాణలో 2 గనులను ప్రయివేటీకరణ చేశారు. గుర్తింపు సంఘాలేమో చోద్యం చూస్తూ గడిపేశాయి.

సింగరేణిలో సంస్కరణలతో దిగజారిన కార్మికులు, బావుల సంఖ్య

సింగరేణిలో గుర్తింపు సంఘాలు యాజమాన్యానికి బాసటగా నిలవడంతో సంస్కరణల బాట పుంజుకొంది. ఖమ్మం, వరంగల్, కరీంనగ్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో 56 భూగర్భ బావులు ఉండగా నేడు 22కు పడిపోయాయి. ఓసీల సంఖ్య 18కి చేరింది. 1.16లక్షల మంది ఉన్న కార్మికులు నేడు 39 వేలకు పడిపోయారు. యాంత్రీకరణతో పాటుగా బొగ్గు ఉత్పత్తి పెరిగింది. భూగర్భ గనుల స్థానంలో ఓసీల సంఖ్య పెరుగుతోంది. కాంట్రాక్టు కార్మికుల సంఖ్య 25 వేలకు చేరింది. సింగరేణి కార్మికులకు మినిమం రూ.28 వేల వేతనం కాగా కాంట్రాక్టు కార్మికులకు కేవలం రూ.8వేలు మాత్రమే. వారు శ్రమ దోపిడీకి గురౌతున్నారు. బొగ్గు గనులున్న పట్టణాలు నిర్వీర్యం అవుతున్నాయి. దీనికి నిదర్శనం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇల్లందు. బ్రిటీష్ కాలంలో 1889లో బొగ్గుట్టగా పేరొందిన పట్టణం నేడు బొందల గడ్డగా మారింది. ఇక్కడ ఇండ్లకు, స్థలాలకు విలువ లేకుండా పోయింది. రాబోయే కాలంలో కొత్తగూడెం, మణుగూరు, సత్తుపల్లి, భూపాలపల్లి, గోదావరి ఖని, తదితర పట్టణాల గతీ ఇంతే కానుంది. దీనిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడ్డ లక్షలాది మంది ప్రజలు ఉపాధి కోల్పోయారు. దీనికి కారణం ఆనాటి గుర్తింపు సంఘాలేనని కార్మికులంటున్నారు.

నిశ్శబ్ద యుద్ధం ద్వారా సీఐటీయూను గెలిపించండి

ఈ నేపథ్యంలో డిసెంబర్ 27న సింగరేణి వ్యాప్తంగా బొగ్గుగనుల్లో గుర్తింపు సంఘం ఎన్నికలు జరగనున్నాయి. 'నిశ్శబ్ద యుద్ధం ద్వారా సీఐటీయూను గెలిపించండి.. ఉదయించే సూర్యుని గుర్తుపై ఓటు చేయండి.. అంటూ ఆ సంఘం నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. బీఎస్ఎన్ఎల్‌లో 25 ఏండ్లుగా సీఐటీయూ గుర్తింపు సంఘంగా ఉంది. రామగుండం ఎన్‌టీపీసీ, హైదరాబాద్‌లోని బీహెచ్ఈఎల్, మహేంద్ర అండ్ మహేంద్ర, ఐడీపీఎల్, బీడీఎల్, ఈఎల్ఎల్, రెడ్డి ల్యాబ్, అరవింద్ ల్యాబ్, ఎంఆర్ఎఫ్ టైర్స్, విశాఖపట్నంలోని స్టీల్ ప్లాంట్‌లో సీఐటీయూనే కార్మికులు గెలిపించారు. రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని పరిశ్రమల్లో ఇటీవల ఎన్నికలు జరిగితే స్వయంగా రాష్ట్ర మంత్రులు ప్రచారం చేసి పోటీలో పాల్గొన్నా వారిని కార్మికులు చిత్తుగా ఓడించి సీఐటీయూ నాయకులను గెలుపించుకున్నారు. కార్మికుల తరుపున సీఐటీయూ నికరంగా నిజాయితీగా నిలబడటం వల్లే కార్మికులు ఆదరిస్తున్నారు. సీఐటీయూ అంటే సింగరేణి కార్మికులకు కూడా నమ్మకం ఉంది. నీతి, నిజాయితీ, నిజాలే చెబుతారని మైన్స్‌పై ఎందరో కార్మికులు అంటుంటారు. ఆ నమ్మకం ఓటుగా మారాల్సిన అవసరం ఉంది.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

జేఎన్.1 ఆందోళనకరం కాదు...హెచ్చరికే...

దీనికంటే ఫ్లూ జ్వరమే ప్రమాదకరం

- నాలుగో డోస్ మంచిదే
- వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి : ప్రముఖ వైరాలజిస్ట్ షాహిద్ జమీల్





న్యూఢిల్లీ : కరోనా వైరస్ నూతన వేరియంట్ జేఎన్.1 ఆందోళనకరమైనది కాదని, అయితే అది ఓ హెచ్చరిక వంటిదని ప్రముఖ వైరాలజిస్ట్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన గ్రీన్ టెంప్లీటన్ కళాశాల సీనియర్ ఫెలో ప్రొఫెసర్ షాహిద్ జమీల్ తెలిపారు. దీనిలో ఒమిక్రాన్ కంటే ఇన్‌ఫెక్షన్ కొంచెం ఎక్కువేనని చెప్పారు. జేఎన్.1 తీవ్రమైన అనారోగ్యాన్ని కలిగిస్తుందని చెప్పడానికి ఆధారాలేవీ లేవని, వాస్తవానికి దీనికంటే ఫ్లూ జ్వరమే మరింత ప్రమాదకరమైనదని అన్నారు. 'ది వైర్' పోర్టల్ కోసం సీనియర్ పాత్రికేయుడు, టెలివిజన్ వ్యాఖ్యాత కరణ్ థాపర్‌కు ఆయన ఇంటర్వ్యూ ఇస్తూ వివిధ అనారోగ్యాలతో బాధ పడేవారు, వృద్ధులు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జనసమ్మర్దమైన ప్రదేశాలలో తిరిగే సమయంలో మాస్కులు ధరించాలని సలహా ఇచ్చారు.

'ఉత్తర భారతదేశంలో చలి అధికంగా ఉంటుంది. వాతావరణ కాలుష్యమూ ఎక్కువే. కాబట్టి వృద్ధులు, ఆరోగ్యపరంగా బలహీనులు జాగ్రత్తగా ఉండాలి' అని జమీల్ చెప్పారు. చలి, వాతావరణ కాలుష్యం రోగ నిరోధక శక్తిని తగ్గిస్తాయని, దీనివల్ల ప్రజలు జేఎన్.1కి గురయ్యే అవకాశాలు ఉంటాయని వివరించారు. అయితే గతంలో కోవిషీల్డ్, కోవాక్సిన్ తీసుకున్న వారికి, గతంలో వచ్చిన ఇన్‌ఫెక్షన్ల బారి నుంచి సహజంగా రోగ నిరోధక శక్తిని పొందిన వారికి కొత్త వేరియంట్ నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. బూస్టర్ డోస్ తీసుకునే ఆర్థిక స్తోమత ఉన్న వారు దానిని ఈ దశలో తీసుకోవడం మంచిదేనని చెప్పారు. గతంలో తీసుకున్న వ్యాక్సిన్‌కు భిన్నంగా ఉండే వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. అయితే బూస్టర్ డోస్‌తో కలిపి ఇప్పటికే కోవిషీల్డ్‌ను మూడుసార్లు తీసుకున్న వారు నాలుగోసారి అదే వ్యాక్సిన్ తీసుకోవడం మంచిది కాదని, దానివల్ల కొన్ని సమస్యలు వస్తాయని తెలిపారు.

కేరళలో కోవిడ్-19 కేసులు అధికంగా నమోదవడాన్ని జమీల్ ప్రస్తావిస్తూ 'దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కేరళలో ఎక్కువ పరీక్షలు చేశారు. నిజాయితీగా, వేగవంతంగా ఫలితాలు ప్రకటించారు. ఇతర రాష్ట్రాలలో అధిక కేసులు నమోదు కాలేదని నమ్మడానికి కారణాలేమీ లేవు. ఏదేమైనా కేరళ అనుభవాన్ని ఓ ఉదాహరణగా చూడాలి' అని జమీల్ వివరించారు.

ధరణిపై ఆధారాలతో వస్తాం

మీడియాతో మంత్రి పొంగులేటి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ధరణిపై స్పష్టమైన ఆధారాలతో త్వరలోనే మీడియా ముందుకు వస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో జరిగిన సమావేశ వివరాలను ఆయన వెల్లడించారు. డిసెంబర్ 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీవరకు ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తుల్ని ప్రజాపాలన కార్యక్రమం ద్వారా స్వీకరిస్తామని చెప్పారు. దీనికి సంబంధించిన విధివిధానాలను డిసెంబర్ 28వ తేదీలోపే గ్రామ సభలకు అందచేస్తామన్నారు. 6 గ్యారెంటీలకు ప్రజలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కలెక్టర్ల సమావేశం గతంలో మాదిరి వన్‌సైడ్‌గా జరగలేదనీ, అధికారులంతా స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడించారని చెప్పారు. ధరణి పేరు మీద గత ప్రభుత్వంలో పెద్దలు ప్రభుత్వ భూముల్ని తమ పేరుపై రిజిష్టర్ చేసుకున్నారనీ, అలాంటి మరికొన్ని ఫైల్స్ ఇంకా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆ రికార్డులు అన్నీ తీసి, ధరణి భాగోతాలను కచ్చితంగా ప్రజల ముందు పెడతామనీ, దీనిపై అధికారులతో ఒక రోజంతా సమీక్ష చేయాల్సి ఉందని తెలిపారు. త్వరలోనే దాన్నీ ఏర్పాటు చేస్తామన్నారు. అప్పుచేసి ఆస్తులు కూడబెట్టామని బీఆర్ఎస్ నేతలు చెప్తున్నారనీ, ఉన్న సెక్రటేరియట్ కూలగొట్టి విలాసవంతమైన భవనం కట్టడం ఆస్తి ఎలా అవుతుందని ప్రశ్నించారు. విద్యుత్ సంస్థలు రూ.81వేల కోట్ల అప్పుల్లో ఉన్న విషయాన్ని శాసనసభలో ఆపార్టీ నేతలే అంగీకరించారని చెప్పారు. 'ప్రజాపాలన'ను విజయవంతం చేయాలని కోరారు.

రెజ్లర్ల పోరుతో దిగొచ్చిన కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికయ్యాడు. సంజయ్ సింగ్ 40 ఓట్లు దక్కించుకోగా.. మాజీ రెజ్లర్ అనిత షియోరాన్‌కు ఏడు ఓట్లు పోలయ్యాయి. బ్రిజ్‌భూషణ్ సన్నిహితుడు, వ్యాపార భాగస్వామి, కరడుగట్టిన ఆర్ఎస్ఎస్ వాది సంజయ్ సింగ్ అధ్యక్ష కుర్చీలో కూర్చోవటంతో.. రెజ్లింగ్ క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. అండర్-15, అండర్-20 జాతీయ ట్రయల్స్ గోండాలోని నందినగర్‌లో నిర్వహిస్తున్నట్టు ఇటీవల బ్రిజ్‌భూషణ్ ప్రకటించారు. నిబంధనల ప్రకారం ఈ ట్రయల్స్‌ను ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎంపిక చేసిన ప్రదేశాల్లోనే నిర్వహించాలి. 'భారత రెజ్లింగ్ సమాఖ్య రూల్స్ 3(ఈ) ప్రకారం.. ఏదేని సీనియర్, జూనియర్ లేదా సబ్ జూనియర్ జాతీయ చాంపియన్‌షిప్స్‌ను యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ రూల్స్‌ను అనుసరించి.. ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎంపిక చేసిన ప్రదేశాల్లోనే నిర్వహించాలి. ఇటువంటి నిర్ణయాలను ముందస్తుగా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఎజెండాలో ఉంచి, ఆపై నిర్ణయాలు తీసుకోవాలి. నూతనంగా ఎన్నికైన ఎగ్జిక్యూటివ్ కమిటీ పూర్తిగా గత పర్యాయం ఆఫీస్ బేరర్ల ఆధీనంలో పని చేస్తుందని అనిపిస్తుంది. ఇది జాతీయ స్పోర్ట్స్ కోడ్‌కు అవమానం. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు, డబ్ల్యూఎఫ్ఐ నూతన కార్యవర్గం రెజ్లింగ్‌కు సంబంధించి ఎటువంటి కార్యకలాపాల్లో భాగస్వామ్యం అయ్యేందుకు వీల్లేదు' అని క్రీడాశాఖ పేర్కొంది. సంజయ్ సింగ్ సారథ్యంలోని డబ్ల్యూఎఫ్ఐ.. అటు సమాఖ్య సొంత నిబంధనలు, ఇటు జాతీయ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కోడ్‌ను పాటించలేదని క్రీడాశాఖ తన ఉత్తర్వుల్లో తెలిపింది.


ఈ నెల 21న సంజయ్ సింగ్ ఎన్నికకు వ్యతిరేకంగా సాక్షిమాలిక్ రెజ్లింగ్‌కు వీడ్కోలు పలకగా, పూనియాతో పాటు డెఫ్లింపిక్స్ బంగారు పతక విజేత వీరేందర్ సింగ్ యాదవ్ కూడా తమ పద్మశ్రీ అవార్డులను వెనక్కి ఇస్తున్నట్టు ప్రకటించడం, వివిధ రైతు సంఘాలతో కూడిన సంయుక్త కిసాన్ మోర్చా కూడా ఈ విషయంలో మద్దతుగా రంగంలోకి దిగుతామని హెచ్చరించిన నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.

'రెజ్లింగ్' నుంచి రిటైర్మెంట్.. బ్రిజ్ భూషణ్

భారత రెజ్లింగ్ సమాఖ్య నూతన ప్యానెల్‌ను కేంద్రం సస్పెండ్ చేసిన వేళ.. డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కీలక ప్రకటన చేశారు. రెజ్లింగ్ వ్యవహారాల నుంచి తాను రిటైర్మెంట్ తీసుకున్నట్టు చెప్పారు. కొత్తగా ఎన్నికైన ప్యానెల్ దీనిని చూసుకుంటుందని తెలిపారు. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలతోపాటు ఇతర అనేక బాధ్యతలు తనపై ఉన్నాయన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో సమావేశమైన అనంతరం బ్రిజ్‌భూషణ్ ఈ మేరకు మాట్లాడారు."నేను 12 ఏండ్లపాటు రెజ్లింగ్‌కు సేవలందించాను. అది మంచో, చెడో.. కాలమే సమాధానం చెబుతుంది. ప్రస్తుతం నేను రెజ్లింగ్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్నా. క్రీడలతో నా సంబంధాన్ని తెంచుకుంటున్నాను. డబ్ల్యూఎఫ్ఐ వ్యవహారాలను కొత్తగా ఎన్నికైన సంఘం చూసుకుంటుంది. నాపై అనేక ఇతర బాధ్యతలున్నాయి. లోక్‌సభ ఎన్నికలు కూడా సమీపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో క్రీడా రాజకీయాలకు దూరంగా ఉంటాను' అని బ్రిజ్‌భూషణ్ వ్యాఖ్యానించారు.

సింగరేణిలో విప్లవ సంఘాల కూటమికి ఓటేద్దాం

- విప్లవకార్మికోద్యమాన్ని బలోపేతం చేద్దాం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో విప్లవ సంఘాల కూటమికి ఓటేయాలని తెలంగాణ సింగరేణి గనికార్మిక సంఘం(టీఎస్‌జీకేఎస్), ట్రేడ్‌యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ)కార్మికులకు పిలుపునిస్తున్నది. ఈమేరకు ఆదివారం ఆయా యూనియన్ల నాయకులు జి.సదానందం, బి.సుధాకర్, సంజయ్ సింగ్వాలి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత పోరాట పటిమతోనే తమ హక్కులను, న్యాయమమైన డిమాండ్లను సాధించుకోవాలని కోరారు. సింగరేణిలో ప్రయివేటీకరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.




ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

- నలుగురు నక్సలైట్లు మృతి

దెంతవాడ : ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు నక్సలైట్లు మరణించారు. జిల్లాలోని కటేకళ్యాణ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దబ్బకున్న గ్రామం సమీపంలోని ఒక పర్వత ప్రాంతం వద్ద సాయంత్రం 5:30 గంటలకు ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్టు బస్తర్ రేంజ్ ఐజిపి పి సుందర్‌రాజ్ తెలిపారు. ఈ ప్రాంతంలో నక్సలైట్లు కోసం పోలీసులు గాలింపు చేపడుతుండగా, నక్సలైట్లు కాల్పులు జరిపారని, దీంతో సిబ్బంది కూడా ఎదురుకాల్పులు జరిపారని చెప్పారు. ఈ సంఘటనా స్థలం నుంచి కొన్ని ఆయుధాలు, పేలుడు పదార్థాలు కూడా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

ఆకట్టుకుంటున్న నంది నాటకాలు


(ఫైల్)

గుంటూరు : ఏపీరాష్ట్ర చలనచిత్ర టివి, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గుంటూరులో జరుగుతున్న నంది నాటకోత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. రెండోరోజు ఆదివారం రెండు నాటకాలు, మూడు నాటికలు ప్రదర్శించారు. తొలిగా డాక్టర్ పి.వి.ఎన్.కృష్ణ రచన దర్శకత్వంలో శ్రీ మాధవ వర్మ పద్య నాటకాన్ని, అనంతరం 'బాధ్యత' బాలల నాటిక ప్రదర్శన జరిగింది. పర్యావరణ పరిరక్షణ నేపథ్యంలో చిచ్చరపిడుగుల్లాంటి బాలలు తమ నటనా కౌశలాన్ని ప్రదర్శించి ప్రశంసలందుకున్నారు. స్వార్థంతో చెట్లను నరకడం మంచిదికాదనే సందేశాన్ని ఆముదాల సుబ్రహ్మణ్యం రచన, దర్శకత్వంలో ఆకట్టుకునేలా ప్రదర్శించారు. మూడో ప్రదర్శనగా 'కలనేత' నాటకాన్ని ప్రదర్శించారు. ఆకెళ్ల రచనకు బిఎం రెడ్డి దర్శకత్వం వహించారు. 'చీకటిపువ్వు' నాటిక చక్కని సందేశాన్ని అందించింది. చేసిన తప్పులు తెలుసుకొని పశ్చాత్తపడిన తర్వాత కూడా అలాంటి వారిని దూరం పెట్టకూడదని సందేశాత్మకంగా నాటకం సాగింది. మూలకథ పిఎస్ నారాయణ, నాటకీకరణ, రచన, పరమాత్ముని శివరాం, దర్శకత్వం రమేష్ మంచాల వహించారు.

ఆదర్శవంత ప్రదర్శన ఉద్ధమ్ సింగ్

భరతమాత బానిస సంకెళ్లు తెంచడానికి స్వాతంత్ర్య సంగ్రామంలో ఎందరో వీరులు పోరాటం చేశారు. అలాంటి వారిలో ఉరికంబాన్ని ముద్దాడి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఉద్ధంసింగ్ ఆదర్శ జీవితాన్ని నాటికలో చక్కగా చూపించారు. ఈ నాటికకు కథ, మాటలు, దర్శకత్వాన్నిపి.వివేక్ అందించారు.

త్రిజుడు

'త్రిజుడు' నాటికకు మూలకథ పి.వి.వి.సత్య నారాయణ, నాటకీకరణ యల్లాప్రగడ భాస్కరరావు అందించారు. వై.ఎస్.కృష్ణేశ్వరరావు దర్శకత్వంలో చక్కగా ప్రదర్శితమైంది. కులం, మతం, పుట్టుక, డబ్బు ఇవేవీ మనిషి మంచితనా నికి గీటురాళ్లు కాదు. ఒక్క మానవత్వం మాత్రమే మనిషిని మనిషిగా ప్రపంచానికి చూపెడుతుందన్న సత్యాన్ని నాటిక ద్వారా ప్రేక్షకులు అందుకున్నారు.

ప్రేక్షకులను ఆకట్టుకున్న గమ్యస్తానాల వైపు

'గమ్యస్థానాల వైపు' నాటికలో సందేశం ప్రేక్షకుల హదయాలకు చక్కగా అందింది. సమస్య చిన్నదైనా, పెద్దదైనా ఎదిరించి ముందుకెళ్ళాలి. నిరాశా నిస్పృహలతో జీవితాన్ని నాశనం చేసుకో కూడదు. మన ప్రాణాన్ని మనమే చంపుకుంటే అది ఆత్మహత్య అవ్వదు, హత్యగానే పరిగణించ బడుతుంది.

ఆర్టీసీ ప్రయాణీకులకు తృటిలో తప్పిన ముప్పు

బస్సు నుంచి విడిపోయిన వెనుక చక్రాలు

- ఓవర్‌లోడ్ కాదన్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్..
- ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశం



నవతెలంగాణ-ఎల్కతుర్తి

హుజరాబాద్ నుంచి హన్మకొండ వెళ్తున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు వెనుక టైర్లు ఒక్కసారిగా ఊడిపోయి సమీపంలోని పొలాల్లోకి చక్రాలు దూసుకెళ్లాయి. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ఎల్కతుర్తి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించంలో బస్సులో ప్రయాణికులకూ ఎలాంటి ప్రమాదం జరగలేదు. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నుంచి ప్రయాణీకులతో బయలుదేరిన ఆర్టీసీ బస్సు ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి సమీపంలోకి చేరుకోగానే పెద్ద శబ్దంతో వెనుకటైర్లు బస్సు నుంచి ఊడిపోయాయి. దాంతో వెంటనే అప్రమత్తమైన డ్రైవర్.. బస్సును కంట్రోల్ చేసి ఓ పక్కకు ఆపారు. దాంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా, ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో దాదాపు 80 మంది వరకు ప్రయాణికులు ఉన్నట్టు తెలుస్తోంది. 55 మంది వెళ్లాల్సిన ఈ బస్సులో అంతమందిని ఎక్కించుకోవడం గమనార్హం. కాగా, ఈ ప్రమాదంపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ.. ఓవర్‌లోడ్ వల్లనే ప్రమాదం జరిగినట్టు వస్తోన్న వార్తలు పూర్తిగా అవాస్తవమని చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నట్టు చెప్పారు. డ్రైవర్ రాజు అప్రమత్తమై బస్సును వెంటనే ఆపడం వల్ల ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు. ప్రమాద ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అద్దె బస్సుల నిర్వహణపై వాటి యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలని, తరచూ తనిఖీ చేస్తూ బస్సులను ఎప్పుడూ ఫిట్‌గా ఉంచాలని సూచించారు.

ముగ్గురు గుజ్జర్ల కస్టడీ మృతిపై మిన్నంటిన నిరసనలు

- కేంద్రం ఉక్కుపాదం
- ఇంటర్నెట్ కనెక్టివిటీ నిలిపివేత



జమ్ము: రాజౌరి, పూంచ్ సెక్టార్ పరిధిలో ముగ్గురు అమాయక గిరిజన పౌరులను విచారణ పేరుతో హింసించి చంపిన తాజా సైనిక చర్యపై జమ్మూ కాశ్మీర్‌లో నిరసనలు మిన్నంటాయి. వీటిపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. నిరసనలపై ఆంక్షల కొరడా ఝుళిపించింది. ముందసస్తు అరెస్టులు, ఇంటర్నెట్ కనెక్టివిటి నిలిపివేయడం వంటి చర్యలు చేపట్టింది. జమ్మూ కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతమైనందున ఈ ప్రాంత పాలనా నిర్వహణ అంతా లెఫ్టినెంట్ గవర్నరు ద్వారా కేంద్ర ప్రభుత్వమే నియంత్రిస్తుంది. జమ్మూలోని పీర్ పంజాల్ ప్రాంతంలో సైనిక వాహనంపై ఉగ్రవాదులు జరిపిన మెరుపు దాడిలో నలుగురు సైనికులు చనిపోయిన మరుసటి రోజే ముగ్గురు గుజ్జర్లను కస్టడీలోకి తీసుకుని హింసించి చంపినట్లు ఆర్మీ ఆరోపణలు ఎదుర్కొంటోంది. మరణించినవారి బంధువలకు ఉద్యోగాలు, పరిహారం ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇది నేరం అంగీకరించినట్టేనని పలువురు భావిస్తున్నారు. ఆర్మీపై తీవ్ర విమర్శలు రావడంతో పౌర మరణాలపై జరిగే విచారణకు తాము సహకరిస్తామని ఒక ప్రకటన విడుదల జేసింది. తోపా మస్తాందార గ్రామానికి చెందిన ఎనిమిది మంది వ్యక్తులతో సహా గత కొన్ని రోజులుగా అనేక మంది వ్యక్తులను సైన్యం తీసుకెళ్లి ఇంటరాగేట్ చేస్తోందని స్థానికులు తెలిపారు. వీరిలో ముగ్గురు చనిపోగా, మిగతావారు మృత్యువుతో పోరాడుతున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు.

చనిపోయిన ముగ్గురు గుజ్జర్లను సఫీర్ హుస్సేన్ (37), షౌకత్ హుస్సేన్ (26), షబీర్ అహ్మద్ (32)గా గుర్తించారు. రెండు దశాబ్దాల క్రితం ఈ ప్రాంతం నుండి తీవ్రవాదాన్ని తుద ముట్టించడంలో ముస్లిం గుజ్జర్లు కీలక పాత్ర పోషించారు. 2020లో షోఫియాన్‌లో బూటకపు ఎన్‌కౌంటర్‌లో

ముగ్గురు రాజౌరి ప్రాంత పౌరులను, గుజ్జర్లను చంపివేసిన ఆర్మీ కెప్టెన్‌కు సాయుధ దళాల ట్రిబ్యునల్ జీవిత ఖైదు విధించింది. ఆ తరువాత నెల రోజులకే ముగ్గురు గుజ్జర్ల కస్టడీ మరణాలు చోటు చేసుకున్నాయి. కస్టడీలో చిత్ర హింసలకు గురి చేసిన దృశ్యాలతో కూడిన వీడియో క్లిప్‌లు వైరల్ అయ్యాయి. ఆ వీడియో వాస్తవికతను తోపా మస్తాందర గ్రామ సర్పంచ్ మొహమ్మద్ అహ్మద్ ధ్రువీకరించారు. ఆర్మీ ఎత్తుకెళ్లిన ఎనిమిది మంది ఒకరికొకరు సంబంధమున్నవారని అహ్మద్ తెలిపారు. ఈ రోజు తెల్లవారు జామున అంత్యక్రియల కోసం ముగ్గురు పౌరుల మృతదేహాలను తమకు అప్పగించారని, అయితే ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో వాటిని పూడ్చి పెట్టామని సర్పంచ్ చెప్పారు. ఈ హత్యలకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ జమ్మూ కాశ్మీర్‌లోని రాజకీయ పార్టీలు నిరసనలు చేపట్టాయి. పిడిపి నాయకురాలు, మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ, ఈ ప్రాంత ప్రజలు శాంతి ప్రేమికులు. ఉగ్రవాదానికి ఎన్నడూ మద్దతివ్వని ప్రాంతంలో ఈ భయానకమైన ఘటన జరిగిందని అన్నారు. జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక హెూదా కల్పించే ఆర్టికల్ 370 రద్దు, రక్షణలు ఉపసంహరణ, రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసి కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చిన తరువాత ఈ ప్రాంతంలో అంతా బాగానే ఉందని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చిలుక పలుకులు పలుకుతోంది. నిజానికి జమ్మూ కాశ్మీర్ ను ఒక బహిరంగ జైలుగా మారిపోయింది. సామాన్యులకు భద్రత లేని పరిస్థితి సంపన్న కాశ్మీర్ అంటే ఇదేనా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఏపీలో రాజకీయ వలసలు షురూ

- టీడీపీ అధినేత చంద్రబాబు
- పార్టీలో చేరిన పలువురు నేతలు



అమరావతి : ఏపీరాష్ట్రంలో రాజకీయ వలసలు ప్రారంభమయ్యాయని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. జగన్‌ను ఇంటికి పంపాలని జనం చూస్తున్నారని చెప్పారు. పెదకూరపాడు, తణుకు, అమలాపురం, గజపతినగరం నియోజకవర్గాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. టీడీపీ కార్యాలయంలో వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి చంద్రబాబు ఆహ్వానించారు. తాను అందరివాడినని, ఏ ఒక్కడి వాడిని కాదని చంద్రబాబు ఈ సందర్భంగా అన్నారు. రాష్ట్రంలో అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఆక్వా రైతులు కూడా పూర్తిగా దెబ్బతిన్నారని, హార్టికల్చర్ రైతులు నాశనమయ్యారని తెలిపారు. ఒక వ్యక్తి విధానాల వల్ల వ్యవస్థలు నాశనమైతే జీవితాలు నాశనం అవుతాయని, ఐదేళ్లలో ఇదే జరిగిందని అన్నారు. రాష్ట్రంలో ఇసుక మాఫియాకు అడ్డే లేదని, కృష్ణానదికి అడ్డుగా కట్టవేసి ఇసుకను దోచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదకూరపాడు ఎమ్మెల్యే రెండు జిల్లాల్లో ఇసుక మాఫియాకు నేతృత్వం వహిస్తున్నారని విమర్శించారు. ప్రశ్నిస్తున్న వారిపై అట్రాసిటీ కేసులు పెట్టి జైల్లో ఉంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తుపాను వంటి విపత్తులు వచ్చినప్పుడు ప్రభుత్వ సాయంతో కష్టం తగ్గించవచ్చునని తెలిపారు. కానీ మిచౌంగ్ సమయంలో ప్రభుత్వం కనీసం స్పందించలేదని విమర్శించారు. ప్రతియేటా జాబ్ కేలండరు ఇస్తానని హామీ ఇచ్చి ఒక్కటి కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. విశాఖపట్నంలో గాదిరాజు ప్యాలెస్‌పై జగన్ కన్ను పడటంతో దాని యాజమానిపై ఒత్తిడి తెచ్చారని తెలిపారు. విషయం మీడియాలో రావడంతో యాజమానిని బెదిరించి ఎవరూ ఇబ్బంది పెట్టలేదని చెప్పించారని పేర్కొన్నారు. జగన్‌కు తన సినిమా అయిపోయిందని తెలిసిపోయిందని, అందుకే 92 మంది ఎమ్మెల్యేలను మారుస్తున్నారని తెలిపారు. మార్చాల్సింది జగన్‌ను అని ఎమ్మెల్యేలను కాదని అన్నారు. తాను అద్దె ఇంట్లో ఉంటే అనేక దాడులు చేసిన వ్యక్తి తన పుట్టినరోజు కోసం రూ.100 కోట్లతో సొంత పత్రికకు ప్రకటనలు ఇప్పించుకున్నారని తెలిపారు. తాను సూపర్ సిక్స్ ఇస్తానని ప్రకటించడంతో ఉచిత ప్రయాణం పెడతానని ఏపీ సీఎం అంటున్నారని వ్యాఖ్యానించారు. అమరావతిలో రూ.లక్షల కోట్ల ఆస్తిని జగన్ నాశనం చేశారని విమర్శించారు. రుషికొండను విధ్వంసం చేసి రూ.500 కోట్లతో ప్యాలెస్ కడుతున్నారని పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. టిడిపి-జనసేన ప్రభుత్వం ఏర్పాటు తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు అనగాని సత్యప్రసాద్, కొమ్మాలపాటి శ్రీధర్, రెడ్డి సుబ్రమణ్యం, ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు

టీడీపీ కార్యాలయంలో ఆదివారం క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నక్కా ఆనంద్‌బాబు, మద్దిరాల ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యాగం

చంద్రబాబు తన నివాసంలో మూడు రోజులుగా నిర్వహించిన చండీయాగం, సుదర్శన నారసింహ హోమం ఆదివారంతో ముగిశాయి. ఉండవల్లిలోని తన నివాసంలో తన సతీమణి భువనేశ్వరితో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ కవి కలిదిండి వర్మ

ఆకస్మిక మృతి


(ఫైల్)

పశ్చిమగోదావరి : పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత కలిదిండి వర్మ (47) గుండెపోటుతో శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఉండి మండలం చెరుకువాడ గ్రామానికి చెందిన ఆయన చేపల మేత కంపెనీలో పని చేస్తూ భీమవరంలో స్థిరపడ్డారు. అనంతరం ఉద్యోగ నిమిత్తం బెంగళూరుకు వెళ్లారు. శనివారం రాత్రి స్నేహితులతో కలిసి టివి చూస్తుండగా గుండెపోటుతో అక్కడే కుప్పకూలి మృతి చెందారు. ఆయనకు తల్లిదండ్రులు, భార్య, కుమార్తె ఉన్నారు. వర్మ రాసిన నేను మాత్రం ఇద్దరిని, గోదారి పలకరింపు పుస్తకాలను ప్రచురితమయ్యాయి. పశ్చిమగోదావరిలోని ఆయన స్వగ్రామంలో ఆదివారం సాయంత్రం అంత్యక్రియలు చేసేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. వర్మ మృతి పట్ల సాహితీ స్రవంతి రాష్ట్ర కమిటీ ఒక ప్రకటనలో సంతాపం తెలిపింది. రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, ప్రధాన కార్యదర్శి కె.సత్యరంజన్.. వర్మ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

క్రిస్మస్ వేడుకలతో సందడిగా మారిన డీఎస్ఎల్ వర్చుర్ మాల్

స్నో మ్యాన్‌తో సరికొత్త సందడి



నవతెలంగాణ-ఉప్పల్

క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని డీఎస్ఎల్ వర్చుర్ మాల్ ప్రజలతో సందడిగా మారింది. క్రిస్మస్ అలంకరణలలో భాగంగా హైదరాబాద్‌లోని అతిపెద్ద స్నోమ్యాన్‌ను ఆవిష్కరించడం ఆనందంగా మారింది. డీఎస్ఎల్ వర్చుర్ మాల్‌లో షాపింగ్ చేసిన వారికి రూ.50 వేలతో కూడిన డ్రా కూపన్ ఏర్పాటు చేసినట్లు డీఎస్ఎల్ వర్చుర్ మాల్ మేనేజ్ మెంట్ తెలిపారు. హైదరాబాద్‌లోనే డీఎస్ఎన్ఎల్ వర్చుర్ మాల్‌లో నాణ్యమైన వస్తువులు అందజేస్తూ వినియోగదారుల అభిమానాలను పొందుతున్నామని వారు తెలిపారు.

యువత ఉత్తమ పౌరులుగా ఎదగాలి



నవతెలంగాణ-హయత్‌నగర్

జాతీయ యువజన ఉత్సవాలు 2024లో భాగంగా రంగారెడ్డి జిల్లా యువ జనోత్సవాలు సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్ తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, రంగారెడ్డి జిల్లా ఎన్.ఎస్.ఎస్ కోవిడ్ నోడల్ అధికారి డాక్టర్ చింతల రాకేశ్ భవాని హాజరయ్యారు. యువత విద్యతో పాటు నాయకత్వం, వృత్తిపర నైపుణ్యాలు, సమాజ భాగస్వామ్య అంశాల పట్ల ఆసక్తి కలిగి ఉండాలన్నారు. వివేకానందుని స్ఫూర్తి గా తీసుకుంటూ ఉత్తమ భారత పౌరులుగా ఎదగాలన్నారు. పోటీపరీక్షల నోటిఫి కేషన్లను సద్వినియోగం చేసుకొని చక్కని ప్రణాళికతో విజయం సాధించాలన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా యువజన క్రీడల విభాగం డిప్యూటీ డైరెక్టర్ చంద్రారెడ్డి ఇంచార్జిగా వ్యవహరించారు. న్యాయ నిర్ణేతలు రాధిక, జ్వాలాముఖి, కృష్ణారెడ్డి, రవీందర్ రెడ్డి, సుధాకర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



నవ తెలంగాణ-చైతన్యపురి

ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆర్కేపురం డివిజన్‌లోని వాసవి కాలనీలో వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలకు హాజరయ్యారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాట్లాడుతూ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి అనుగ్రహంతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. అనంతరం దేవాలయ చైర్మెన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్త మాట్లాడుతూ పవన్ కుమార్ సిద్ధాంతి పర్యవేక్షణలో మూడు రోజులపాటు ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ జనరల్ సెక్రెటరీ అయితే అంజయ్య, ట్రెజరర్ కృష్ణయ్య, కన్వీనర్ ప్రశాంత్, అరుణ్ కుమార్, సుదర్శన్, శ్రీధర్, నియోజక వర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అర వింద్ శర్మ, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, కందుకూరు జెడ్పిటిసి జంగారెడ్డి, అన్నపూర్ణ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మెన్ సురేందర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

యాకుత్‌పురను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



ఎమ్మెల్యే జాఫర్ ముజఫర్ హుస్సేన్

నవతెలంగాణ-సంతోష నగర్

ప్రజల సమస్య పరిష్కారానికి అభివృద్ధి లక్ష్యంగా, సంక్షేమ ఫలాన్ని అందించి యాకుత్‌పుర నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే జాఫర్ ముజాఫర్ హుస్సేన్ అన్నారు. సంతోష్ నగర్ డివిజన్ కార్పొరేటర్ ఎండీ . ముజాఫర్ హుస్సేన్, సంతోష్ నగర్ డివిజన్ అధ్యక్షులు చింతల శ్రీనివాస్, కాలనీ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ చారి స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఎంఐఎం యాక్టివ్ సభ్యులతో ఆదివారం కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా అనేక సంక్షేమ పథకాలు, పనులను ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం స్థానిక నాయకులు కార్పొరేటర్లు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కరోనా సమయంలో పెద్దలు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నియోజకవర్గం కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి





మామిడిపల్లిలో అక్రమ నిర్మాణాలను పూర్తి స్థాయిలో కుల్చివేయాలని స్థానికుల డిమాండ్..

నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మామిడిపల్లిలోని సర్వే నెంబర్ 99/1లో గ్రామానికి చెందిన కొందరు ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించుకొని ఇండ్ల నిర్మాణం చేపట్టారు. స్థానికుల ఫిర్యాదు మేరకు గురువారం బాలాపూర్ మండల తహశీల్దార్ మాధవిరెడ్డి ఆదేశం మేరకు రెవెన్యూ కార్యాలయ ఆర్.ఐ. షేక్ జమీల్ ఆధ్వర్యంలో పహాడి షరీఫ్ పోలీస్ సిబ్బందితో కలిసి అక్రమ నిర్మాణాలను కొన్నింటిని మాత్రమే కూల్చి వేయటం జరిగిందని, అక్కడ అక్రమంగా నిర్మించిన ఇండ్ల నిర్మానాలను పూర్తిగా కూల్చి వేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను కొందరు అక్రమంగా స్వాధీనం చేసు కుని నకిలీ డాక్యుమెంట్లను తయారు చేసి కోట్లాది రూపాయల గడిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. గ్రామంలో ఇంటి స్థలాలు, ఇండ్లు లేక ఎంతో మంది నిరుపేదలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన రెవెన్యూ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోని అక్రమ ఇండ్ల నిర్మాణాలను పూర్తి స్థాయిలో అన్నింటినీ కూల్చి వేయాలని, లేనిపక్షంలో అక్కడ ఉన్న ప్రభుత్వ భూమి పూర్తిగా ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని గ్రామ స్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా ముక్కోటి వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలు



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్ గూడ గ్రామంలోని శ్రీ కృష్ణ దేవాలయంలో శనివారం సీవైఆర్ కాలనీ అధ్యక్షులు, దేవాలయ కమిటీ చైర్మెన్ దగ్గుల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ముక్కోటి వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలు స్వామిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఉత్తర ద్వార దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరు భక్తి భావం దైవ చింతన కల్గి ఉన్నప్పుడే భక్తుల కోరికలు నెరవేరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, రవీందర్, కృష్ణ మూర్తి, మహిళా నాయకులు లక్ష్మి కల్యాణి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

మండలంలోని మజీద్ పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాంటేకర్ రమేష్ ఆధ్వర్యంలో ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యేగా గెలుపొందిన మల్ రెడ్డి రంగారెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కాంటేకర్ రమేష్ మాట్లాడుతూ ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే గా నూతనంగా ఎన్నికైన మల్‌రెడ్డి రంగారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు తెలి పారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలో అభివృద్ధి వేగవంతం అవుతుందని, ఇక గ్రామాల దశదిశ మారుతుందని తెలిపారు. అలాగే తమ గ్రామ అభివృద్ధి కోసం అత్యధిక నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



నవతెలంగాణ-శామీర్‌పేట

ఆరోగ్యమే మహాభాగ్యమని శామీర్ పేట మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు మునిగండ్ల కిష్టయ్య గుప్తా అన్నారు. మూడు చింతలపల్లి మండలం జగ్గంగూడలో మనిగండ్ల కిష్టయ్య ఆధ్వర్యంలో ఆయన కుమారులు ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అధితి హాస్పిటల్ (ప్రజ్ఞాపూర్) వారు రోగులకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. లయన్స్ క్లబ్ అఫ్ హైద్రాబాద్, మీర్ పేట సహకారంతో మెడి క్యూర్, రోహిణి హాస్పిటల్స్ వారు కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికీ 31 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు, 81 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. రోగులకు కిష్టయ్య కుమారులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధితి హాస్పిటల్ డాక్టర్ రాఖీ, వైద్య సిబ్బంది ఆప్తోమేట్ సుదర్శన్ రెడ్డి, టెక్నీషన్ వెంకటేష్, భాస్కర్ చారి, వైద్య శిభిరం నిర్వాహకులు మనిగండ్ల కిష్టయ్య, కుమారులు ఎం నాగరాజు(కీసర గుట్ట బోర్డు మెం బర్), ఎం ప్రవీణ్, ఎం శ్రీనివాస్, ఎం చంద్రశేఖర్, నాయ కులు బి. శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా కౌన్సిలర్ పాశం అర్చన జన్మదిన వేడుకలు

నవతెలంగాణ అబ్దుల్లాపూర్ మెట్

పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్ పాశం అర్చన దామోదర్ జన్మదిన వేడుకలను శనివారం తార కన్వెన్షన్ హాల్‌లో సహచర కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలే బోకేలు అందజేసి కేక్ కట్ చేసి సహచర కౌన్సిలర్లు పాశం అర్చనను ఘనంగా సత్కరించి, సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌన్సిలర్ పాశం అర్చన దామోదర్ తమ మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. నిండు ఆయురారోగ్యాలతో ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, ప్రజాప్రతినిధిగా ప్రజలకు మరిన్ని సేవలను అందించాలని ఆకాంక్షించారు. వేడుకల్లో మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, కౌన్సిలర్స్ విద్యావతి, కందాడ అనుపమసుప్రసేనారెడ్డి, పండుగల జయశ్రీ రాజు, రోహిణి రెడ్డి, గ్యారాల శ్రీనివాస్, సిద్ధంకి కృష్ణారెడ్డి, మురళీధర్ రెడ్డి , పబ్బతి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిపల్లిలో ..

మున్సిపాలిటీ పరిధిలోని మర్రిపల్లిలో అభిమానుల మధ్య కౌన్సిలర్ పాశం అర్చన దామోదర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శాలువతో సత్కరించి పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

శ్రేయాస్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ వేడుకలు

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

పెద్ద అంబర్ పేట మున్సిపల్ తట్టిఅన్నారంలోని శ్రేయాస్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో తొమ్మిదో పూర్వ విద్యార్థుల ఆత్మీయ వేడుకలను కళాశాల క్యాంపస్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి హాజరై ప్రసంగించారు. విద్యార్థులు అనుకుంటే దేనినైనా సాధించవచ్చునని, తన ప్రతిభను ప్రదర్శించడంతో ఏ రంగంలోనైనా విజయాన్ని సాధించవచ్చున్నారు. ఇదే కాలేజీలో 2014-18 బ్యాచ్‌కి చెందిన విద్యార్థిని కావడం, తనను అతిథిగా ఆహ్వానించడం చాలా గర్వంగా ఉందన్నారు. విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్ మెంట్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడంతో శ్రేయాస్ ఇంజనీరింగ్ కాలేజీ ముందు ఉంటుందని కళాశాల వైస్ చైర్మెన్ హృదయ్ రెడ్డి అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విన్ రెడ్డి తమ కాలేజీ విద్యార్థి కావడం సంతోషంగా ఉందన్నారు. యశస్విని రెడ్డిని కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే. సాగర్, ఫార్మర్ ప్రిన్సిపాల్ సురేష్ అఖేల, హెచ్ ఓ డి లు, ఏ ఓ. రాజు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా సంస్కృతి దేశం విడిచినా మరువరాదు

నవతెలంగాణ-కల్చరల్

వృత్తి ఉద్యోగాల రీత్యా తెలుగువారు దేశం విడిచి వెళ్లి విదేశాలలో స్థిరపడ్డా మాతృ భాషా సంస్కృతులు మరువరాదని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై తెలంగాణ అమెరికా తెలుగు సంఘం(టీటీఏ) సాంస్కృతిక వేడుకల సం రంభంలో ముఖ్య అతిథిగా బండారు దత్తాత్రేయ పాల్గొని మాట్లాడారు. మన రాష్ట్రంలో ఉన్న తెలు గువారు విదేశీ మోజులో వుంటే అక్కడి తెలుగు వారు మన కళలను నేర్చుకొంటూ సంప్రదా యాన్ని కొనసాగిస్తున్నారని అభినందించారు. వేడుకల కోఆర్డినేటర్ డాక్టర్ ద్వారకానాథ్ కార్యక్ర మం పర్యవేక్షణ చేయగా అధ్యక్షుడు వంశీ రెడ్డి స్వాగతం పలికారు. ప్రెసిడెంట్ ఎలక్ట్ నవీన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొనగా కార్యదర్శి కవిత రెడ్డి నివేదిక సమర్పించారు. అనంతరం సినీ పాటల విభావరి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

వ్యక్తి ప్రతిభకు గుర్తింపు అవసరం



నవతెలంగాణ-కల్చరల్

ప్రతి వ్యక్తీ తన ప్రతిభకు తగిన గుర్తింపు కోరుకుం టారని సాంస్కృతిక సంస్థలు అట్టి వారిని సత్కరించటం మంచి సంప్రదాయము అని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ పీ. శ్రీసుధ అన్నారు శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై లలిత కళా స్రవంతి 21వ వార్షికోత్సవం నృత్య భరితంగా జరిగాయి. శ్రీ వారి పాదాలు నాట్య సంస్థ రమాదేవి శిష్య బృందం పద్మావతి కూచిపూడి నాట్యలయ సంస్థ పద్మావతి శిష్య బృందం చే కూచిపూడి భరత నాట్య అంశాలు ఆకట్టుకు న్నాయి. సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ శ్రీ సుధ తెలుగు టీ.వీ. చానల్స్‌లోని రిపోర్టర్స్‌కు వ్యాఖ్యాతలకు ప్రతి భా పురస్కారాలు బహుకరించారు. వీరిలో జీ.సునీల్ (10 టీవీ)సౌజన్య (ఎన్‌టీవీ) ఉదయ శ్రీ(టీ. న్యూస్) అరుణ (10 టీవీ) శ్రీదేవి (భారత్ టూ డే) తదితరులున్నారు. అధ్యక్షత వహించిన ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో వెండి తెరకు ప్రాధాన్యత వుండేదనీ నేడు బుల్లి తెర కున్న ఆదరణ పెరిగిందని వివరించారు. సంస్థ స్థాపకుడు గొర్తి దీక్షి తులు స్వాగతం పలుకగా విశ్వేశ్వర రావు, శైలజ పురస్కార బహుకరణలో పాలు పంచుకొన్నారు.

దేశవ్యాప్తంగా వైశ్యులందరినీ ఒక ప్లాట్ ఫామ్ మీదకి తీసుకురావడమే

అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ప్రధాన లక్ష్యం



అంతర్జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త



నవతెలంగాణ-నాగోల్

దేశ వ్యాప్తంగా ఉన్న వైశ్యులందరినీ ఒకే ప్లాట్ ఫామ్ మీదికి తీసుకురావడమే అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ప్రధాన లక్ష్యమని అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. ఆదివారం ముషీరాబాద్ వాసవి హాస్టల్లో నూతన సంవత్సర అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర విభాగ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగింది. నూతన సంవత్సర సంబరాలు జరుపుకున్నారు. రాబోయే 2024 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో ఉన్న ఆర్యవైశ్యులందరినీ అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో పేద వైశ్యులను ఆదుకోవడానికి అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ముందుంటుందని ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. అదేవిధంగా దేశంలో ఉన్న 16 కోట్ల మంది వైశ్యులందరినీ ఒక తాటిపై తీసుకురావడానికి అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ముందుంటుంది వ్యాపార పరంగా, ఉద్యోగ పరంగా, రాజకీయపరంగా, సేవాపరంగా దేశంలో వైశ్యులందరినీ రాజకీయంగా ముందుకు తీసుకురావడానికి అన్ని పార్టీలలో సముచిత స్థానం కల్పించడానికి ఐవీఎఫ్ ముందు ఉంటదని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడానికి కలవడం జరుగుతుందని శ్రీనివాస్ గుప్తా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున పేద ఆర్యవైశ్యుల కోసం ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరడం జరిగినదని ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. గంజి రాజమౌళి గుప్తా మాట్లాడుతూ 33 జిల్లాల్లో పేద వైశ్యులకు చదువుకోవడానికి ఆర్థికంగా ఎదగడానికి ఐవీఎఫ్ ముందు ఉంటదన్నారు. అదేవిధంగా ముషీరాబాద్ వైశ్య హాస్టల్లో పేద వైశ్య స్టూడెంట్స్ కోసం చదువులో మెరిట్ స్టూడెంట్స్ కోసంఫ్రీ అకామిడేషన్ ఫ్రీ ఫుడ్‌తో వైశ్య హాస్టల్ లో జాయిన్ చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆర్యవైశ్యులందరూ కూడా వ్యాపారంతో పాటు రాజకీయపరంగా కూడా ఎదగాలని గంజి రాజమౌళి గుప్తా అన్నారు. మహిళా అధ్యక్షురాలు చందా భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నూతన సంవత్సర వేడుకలు, తాంబూలా కార్యక్రమం ఆటలు పాటలతో మహిళామణులు అందరినీ సంతోషపరిచే విధంగా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల అధ్యక్షులు రాష్ట్ర కమిటీ కేంద్ర కమిటీ సభ్యులే కాకుండా కక్కిరాల రమేష్, గట్టు మహేష్, పబ్బ చంద్రశేఖర్, లెఫ్టినెంట్ కల్నల్ రమేష్ , ముత్యాల సత్తయ్య , ఉప్పల స్వప్న, మిడిదొడ్డి శైలజ ,యువజన సంఘం అధ్యక్షుడు కట్ట రవి, కటకం శ్రీనివాస్ కొడిపాక నారాయణ, గట్టు మహేష్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డిని ఆదివారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్ గూడ పరిధిలోన్న రామిడి కళావతి నగర్ కాలనీ వాసులు, మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి సహకారంతో మర్యాద పూర్వకంగా కలసి పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించి పుష్ప గుచ్చం అందచేసి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్ పేట్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ -ఎల్ బి నగర్ :

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు వరంలాంటిదని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ అన్నారు. బాధిత కుమారుడు విజయ్ చంద్రకి రూ. 2లక్షల చెక్కును ఎల్.బి.నగర్ అందజేశారు. లింగోజిగూడా డివిజన్‌కు చెందిన నాగేశ్వరరావు గుండెకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో చికిత్స అనంతరం హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ కావడం జరిగింది. కొన్ని రోజుల తర్వాత వారు మరణించడంతో ఆర్థిక స్థితులు బాగలేక కుటుంబ సభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన సుధీర్ రెడ్డి ఆపరేషన్‌కు అవసరమైన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయగా వారికి చెక్కు మంజూరైన రెండు లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిదన్నారు. ఎల్.బి.నగర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం ధర్మకర్త ఛాతిరి మధుసాగర్, తిలక్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలి

సీఈవో సోమశేఖర్ రెడ్డి



నవతెలంగాణ-సీటీ బ్యూరో

నక్షత్ర సూట్స్ కేర్ హాస్పిటల్ వారు మీర్ పేట్ 45 వార్డు కౌన్సిలర్ అకిడి మాధవి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్టు సీఈఓ సోమశేఖర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్ల నరసింహారెడ్డి, సవిడి గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు ప్రజలు ఉపయోగించుకోవాలని, రకరకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ప్రతి ఒక్కరూ ఉచిత వైద్య శిబిరాలని ఉపయోగించుకోవాలని ఇలాంటి అవకాశం కల్పించిన హాస్పిటల్ వారికి మేము ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. హాస్పిటల్ సీఈవో సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మా హాస్పిటల్ నందు అన్ని రకాల వైద్య సేవలు సామాన్యుడికి అందుబాటులో ఉన్నాయని కార్పొరేట్ వైద్యం సైతం సామాన్యుడికి ఉంచాలని దృఢ సంకల్పంతో మా హాస్పిటల్ పని చేస్తున్నాయన్నారు. నక్షత్ర సూట్స్ కేర్ నెట్‌వర్క్ నుంచి మీరు ఆరోగ్యంగా ఉండాలని ఆశిస్తున్నామని తెలిపారు. సూట్స్ కేర్ నెట్‌వర్క్ వారు వివిధ సమస్యలతో బాధపడుతున్న మహిళలందరికీ ఇన్ఫెక్షన్స్ రొమ్ము గర్భసంచి క్యాన్సర్లు, రక్తహీనత, ఫైల్స్, థైరాయిడ్ పిసిఒడి షుగర్, బిపి వంటి సమస్యలకు ఉచితంగా స్క్రీనింగ్ చేసి మెరుగైన వైద్యం అందించుటలో తోడ్పాటు అందిస్తామన్నారు. రోగ నిర్ధారణ చేయనివి నిర్ధారణ చేయాలని నినాదంతో నవంబర్ 28 నుండి మార్చ్ 8 వరకు సూట్స్ ఉమెన్ క్యాంపియన్ నిర్వహిస్తున్నామన్నారు. దీని ప్రయోజనాలు ఉచిత కన్సల్టేషన్ ల వివిధ రకాల టెస్ట్ మీద రాయితీలు ఫార్మసీ మీద ప్రత్యేక రాయతీలు నిర్ధారణ చేయబడిన వ్యాధులకు తగిన సూచనలు ఇవ్వబడతాయని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 300 మంది దాకా ఉచితంగా బీపీ, షుగర్, థైరాయిడ్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నక్షత్ర హాస్పిటల్స్ సూట్స్ నెట్‌వర్క్ సిఓ డాక్టర్ చంద్రప్రకాష్, ఇఎన్టి డాక్టర్ కృష్ణ తులసి, ఆర్థోపెడిక్ డాక్టర్ వంశీధర్, డాక్టర్ శ్రీ వల్లి , మెడికల్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, నవ్య, ఉష, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ సోదర, సోదరీమణులకు అరవింద శర్మ క్రిస్మస్ శుభాకాంక్షలు



నవతెలంగాణ-చైతన్యపురి

క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవ సోదర, సోదరీ మణులు అందరికీ మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దైవ కుమా రుడు జీసస్ మానవునిగా జన్మించిన రోజును ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ పండుగగా జరుపుకుంటారని ఏసు ప్రభువు జీవనం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. తన బోధనల ద్వారా మానవాళిని సన్మార్గం వైపు నడిపించేలా ఏసుక్రీస్తు మార్గనిర్దేశం చేశారని పేర్కొన్నారు. నిస్సహాయులపై కరుణ, సాటివారిపై ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం.. ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాల న్నారు. ఎల్లప్పుడూ ఆ కరుణామయుని ఆశీస్సులు, దీవెనలు ప్రజలకు ఉండాలని ఆకాంక్షించారు..

నవతెలంగాణ 8

మేడ్చల్-ఉప్పల్

సోమవారం | డిసెంబర్ 25, 2023 | www.navatelangana.com

జమ్మిగడ్డ బీ.జే.ఆర్ కాలనీలో
82వ వారం జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు 82వ వారం జ్ఞానమాల టీం సభ్యులు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జమ్మిగడ్డ జ్ఞానమాల టీం సభ్యులు తాడూరి గగన్ కుమార్, టీం సభ్యులు నరసింహ చారి, నరేందర్ రావు, దయానంద్, శేఖర్, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారి



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌కు చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం నూతన సంవత్సర క్యాలెండం ‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మీర్‌పే ట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, జంపాల్‌రెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘం కమిటీ సభ్యులు ఉన్నారు.

బీఆర్ అంబేద్కర్ అణగారిన వర్గాల ఆశాజ్యోతి



- ఆ మహనీయుడి స్ఫూర్తితో ముందుకు సాగుదాం
- కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్

నవతెలంగాణ-కీసర

సబ్బండ వర్గాల అభ్యున్నతికి బాబా సాహెబ్ అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదని, ఆ మహనీయుడి స్ఫూర్తితో అణగారిన వర్గాల హక్కులను సాధించుకోవాలని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్‌లు అన్నారు. ఆదివారం కీసర గ్రామంలోని అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ జ్ఞానమాల 100వ వారం వేడుకలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ దేశంలోని అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని కొనియాడారు. అందుకే ఆయన స్ఫూర్తితోనే మన హక్కుల సాధన కోసం ముందుకు సాగుదామన్నారు. ఈ కార్యక్రమంలో కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, కాంగ్రెస్ కీసర మండలాధ్యక్షుడు కృష్ణ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్ రెడ్డి, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెరియార్ రామస్వామి 50వ వర్ధంతి



నవతెలంగాణ-కాప్రా

సామాజిక ఉద్యమ నేత పెరియార్ 50వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, స్ఫూర్తి గ్రూప్ భారత నాస్తిక సమాజం ఆధ్వర్యంలో సామాజిక న్యాయం-రాజ్యాంగం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సభాధ్యక్షులుగా స్ఫూర్తి గ్రూప్ సభ్యులు గోవిందరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా పెరియార్ రామస్వామి చిత్రపటానికి సామాజిక ఉద్యమ నాయకురాలు వనిత, ఈసీఐఎల్ రిటైర్డ్ ఏజీఎం ఈ నాగయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన కర్రె మల్లేశం మాట్లాడుతూ.. పెరియార్ మధ్యతరగతి వ్యాపార కుటుంబం నుంచి వచ్చారని, ఆయన చదువు ఐదో తరగతితో ముగించారని చెప్పారు. చిన్నతనంలోనే అంటరానితనం, బ్రాహ్మణీయ భావజాలంతో జరిగిన అనర్థాలను స్వయంగా అనుభవించారని పేర్కొన్నారు. అవమానాలను భరించలేక ఇంటి నుంచి కాశీకి వెళ్లారని చెప్పారు. అక్కడ కూడా కుల వివక్షకు గురై భోజనం సంపాదించేందుకు ఎన్నో తంటాలు పడ్డారని గుర్తు చేశారు. కాశీ నుంచి తిరిగి ఇంటికి వచ్చి వ్యాపారాలు బాగా చేయడంతో గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, వితంతు వివాహాల కోసం గట్టిగా కృషి చేశారని తెలిపారు. పట్టణానికి మేయర్‌గా ఎన్నికై ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పూర్తిగా అగ్రవర్ణాలకే ఉండటం 20 మంది అధికారులు ఉంటే 19 మంది బ్రాహ్మణులే ఉండటంతో పోరాటానికి సిద్ధం అయ్యారని వివరించారు. కాంగ్రెస్ పార్టీలో కూడా అగ్రవర్ణ భావజాలం ఉండడంతో అందులో నుంచి జస్టిస్ పార్టీలో చేరి, ఆ తర్వాత ద్రవిడ కజగం అనే పార్టీని ఏర్పాటు చేసి ద్రవిడ ఉద్యమాన్ని బ్రాహ్మణ భావజాలానికి వ్యతిరేకంగా ప్రారంభించారని వెల్లడించారు. ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు కోమటి రవి మాట్లాడుతూ.. పెరియార్ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు. అనంతరం నాగయ్య, గొడుగు యాదగిరిరావు, రషీద్, శ్రీనివాస్, కేకే ప్రసాద్ బాబు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి గ్రూపు నాయకులు శివరామకృష్ణ, సంపత్ సోమయ్య, శ్రవణ్, కుమార్, వనిత, శారద, ప్రభాకర్, శ్రీమన్నారాయణ, శ్రీనివాసరావు, శ్రీనివాస్, కన్నెగంటి గోపి, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ ముదిరాజ్ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తన కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో కుషాయిగూడ ముదిరాజ్ సంఘం సభ్యులందరూ ఏకగ్రీవంగా మద్దతు పలికి గెలిపించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముదిరాజ్ భవన నిర్మాణానికి సహకరిస్తానని సంఘం నాయకులకు హామీని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పిట్టల నాగరాజు ముదిరాజ్, గడ్డల పాండు ముదిరాజ్, సంఘం సభ్యులు బండి నర్సింగరావు, అమర్నాథ్, శ్యామ్ రావు, జక్కుల ప్రేమ్, కొల్కురి శ్రీకాంత్, చాగంటి రవి, జక్కుల కావ్య కొలిపాక కనకయ్య రెడ్డబోయిన రాజు, సార ప్రశాంత్, పిట్టల భరత్, కూర యాదగిరి, చింతల శేఖర్, పడసనబోయిన వెంకటేష్, సల్లోని పల్లె సాయికిరణ్, దొంతి రమేష్ పాల్గొన్నారు.

రైస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో
ఉచితంగా కుట్టు మిషన్లు అందజేత



నవతెలంగాణ-కాప్రా

రైస్ సంస్థ ఆధ్వర్యంలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారి సౌజన్యంతో కాప్రా సాయిరాం నగర్‌లో మూడు నెలలుగా చేపట్టిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కార్యక్రమం పూర్తయ్యింది. శిక్షణ తీసుకున్న 30 మహిళలందరికీ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రైస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఫౌండర్ మొగుళ్ల అమరేందర్ గౌడ్ ,నరేష్ కుమార్ రెడ్డి, సాయిరాం నగర్ కాలనీ ప్రతినిధులు అశోక్ గౌడ్, అబ్రహం, మాజీ వార్డ్ మెంబర్ మచ్చ శ్రీకాంత్ గౌడ్ , గజేందర్ , గోగారావ్, నవీన్, పాపిరెడ్డి, కుమార్, రుక్కయ్య రంగు వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సౌజన్య కుట్టుమిషన్ మిషన్ శిక్షకురాలు సరిత కుట్టుమిషన్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మహిళలు నేర్చుకున్న శిక్షణతో ఉపాధి పొందుతూ ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. కుట్టు శిక్షణలో ఫ్యాషన్ డిజైనింగ్ నేర్చుకొని మరింత అభివృద్ధి చెందాలని సూచించారు. సంస్థ నిర్వాహకులు మొగుళ్ల అమరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. రైస్ సంస్థను 2009లో ప్రారంభించి గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని పేదలకు విద్య జీవనోపాదులు, వ్యవసాయం, వైద్యం, ఉపాధి కల్పించడానికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. 490 మందికి కుట్టు మిషన్లు అందజేశామని చెప్పారు. అనంతరం కుట్టుశిక్షణ నేర్చుకున్న మహిళలు మాట్లాడుతూ.. ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించిన రైస్ స్వచ్ఛంద సంస్థ, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

ప్రాణాలకు ప్రమాదమని తెలిసినా పైసలే ముఖ్యమా?

- కాలనీలో సెల్ టవర్ వద్దన్నా పట్టింపులేని అధికారులు
- తొలగించకపోతే ఉద్యమం తప్పదు : కాలనీ వాసులు



నవతెలంగాణ- బోడుప్పల్

ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న సెల్‌టవర్స్‌ను ప్రజా సమూహంలో పెట్టొద్దని, వాటి వలన ప్రజల ప్రాణాలకు ప్రమాదమని తెలిసినా కాసుల కోసం కక్కుర్తి పడి ప్రజల ప్రాణాలను గాలికొదిలిన అధికారుల తీరును బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీ ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. దేవేందర్ నగర్ కాలనీలోని ఓ ఇంటిపై నూతనంగా ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ ఏర్పాటును వెంటనే విరమించుకోవాలని కాలనీ ప్రజలు హెచ్చరిన్నారు.

ప్రమాదమని తెలిసినా..చర్యలు శూన్యం

సెల్ టవర్ కారణంగా భవిష్యత్తులో మెదడు కారకమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని పలు సర్వేలు, ఆరోగ్య సంస్థలు ఇప్పటికే అనేక సార్లు నిర్ధారించినా ప్రజల ఆరోగ్యం పట్ల అధికారులు పట్టింపు లేకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తూ సెల్ టవర్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం ఏంటని కాలనీ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు సెల్ టవర్ అనుమతిపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులంటే ప్రజలకు మేలు చేసే పనులు చెయ్యాలే కానీ ఇలా ప్రజలను ఇబ్బందులకు గురి చెసే చర్యలు సరికాదని వాపోతున్నారు. కార్పొరేషన్ ఆదాయం కోసం ప్రజల ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టే విధానాలను వెంటనే విరమించుకోవాలని కోరుతున్నారు.

ఆందోళన తప్పదు..

జనవాసాల మధ్య ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్‌ను వెంటనే విరమించుకోవాలని లేని పక్షంలో కాలనీ ప్రజలతో కలిసి ప్రజా ఉద్యమాన్ని నిర్వహిస్తామని దేవేందర్ నగర్ కాలనీ వాసులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఈ విషయంపై నగర పాలక సంస్థ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశామని తెలిపారు. టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందించి టవర్ అనుమతి రద్దు చేయాలని కోరారు.

ప్రజల ఆరోగ్యం పై శ్రద్ధ లేదా..



కాలనీలో ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ కారణం గా అనేక రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఓ వైపు వైద్యులు చెప్తుంటే ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ లేని బోడుప్పల్ అధికారులు ఇలా ఏకపక్షంగా టవర్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం సరైనది కాదు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే అనుమతి రద్దు చేయాలి.

-ఉపేంద్ర, దేవేందర్‌నగర్ కాలనీ వాసి

పేదల కాలనీ అంటే అంత అలుసా ..



బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీలో రెక్కాడితే గాని డొక్కాడని వారే అధికంగా ఉంటారు. ఇక్కడ ప్రజా ఆరోగ్యం పట్ల పాల కులకు అస్సలే పట్టింపు ఉండదు. ఇప్పుడు ప్రాణాంత కమైన సెల్ టవర్స్‌ను ఏర్పాటు చేయడం వలన ప్రజల ఆరోగ్యం పై ఎఫెక్ట్ పడే అవకాశం ఉంది. అందుకే తక్షణమే సెల్ టవర్‌ను తొలగించాలి.

-కుమార్, దేవేందర్‌నగర్ కాలనీ వాసి

ప్రజలే కాదు పశుపక్షాదులకు ప్రమాదమే..



సెల్ ఫోన్ టవర్ కారణంగా ప్రజలకే కాకుండా పశుపక్షాదులకు ప్రమాదం వాటిల్లుతుందని అనేక సర్వేలో వెల్లడైంది. కానీ ఇక్కడ మాత్రం అవేమి పట్టించుకోకుండా ఇష్టానుసారంగా టవర్ అనుమతులు మంజూరు చేయడం ఎంత వరకు సమంజసమో అధికారులే చెప్పాలి.

-భాస్కర్, దేవేందర్‌నగర్ కాలనీ వాసి

వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం



- ఉప్పల్ రన్నర్స్ ఆధ్వర్యంలో 'ఫారెస్ట్ ట్రయల్ రన్'
- ప్రారంభోత్సవంలో కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్

ప్రతి ఒక్కరి జీవితంలో వ్యాయామం అనేది నిత్యకృత్యంగా మారాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తారని బోడుప్పల్ కార్పొరేషన్ 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పల్ రన్నర్స్ ఆధ్వర్యంలో అడవుల సంరక్షణ లక్ష్యంగా 'సేవ్ ఫారెస్ట్ - సేవ్ ప్లానెట్' అనే నినాదంతో నారపల్లి నందనవనంలో "ఫారెస్ట్ ట్రయిల్ రన్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పద్మారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 25కే, 16కే, 10కే, 5కేరన్‌లో యువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇందులో పాల్గొన్న వారందరికీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి ఆధ్వర్యంలో తాగునీరు, అల్పాహారం ఏర్పాటు చేశారు. అంతకుముందు పద్మారెడ్డి మాట్లాడుతూ "ఆరోగ్యమే-మహాభాగ్యము" అని పెద్దలు చెప్పినట్లు నేటి మన ఉరుకుల పరుగుల జీవితంలో కాలంతో పోటీ పడుతూ చాలామంది ఆరోగ్యం పై సరియైన శ్రద్ధ వహించడం లేదన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకుంటూ ప్రతిరోజు తప్పనిసరిగా వ్యాయామం చేసినట్లయితే మానసిక, ఏకాగ్రతతో పాటు ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. వయస్సుకు సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేస్తూ ఫారెస్ట్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువకులు, మహిళలు, పురుషులు, వృద్ధులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

కల్యాణ రాముడి ముఖద్వారం ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ సర్కిల్ పరిధిలోని గణేష్‌నగర్ కాలనీ హనుమాన్ దేవాలయం 18వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన కల్యాణ రాముడి ముఖద్వార కార్యక్రమాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దైవ దర్శనాలు ప్రజల్లో చైతన్యాన్ని నింపుతాయన్నారు. గణేష్ నగర్‌లో కల్యాణ రాముడి ముఖద్వారం ఏర్పాటు చేయడంపై నిర్వాహకులను అభినందించారు. వేలాది మంది ఐక్యమత్యంతో ఉత్సవాలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా తనను సంప్రదించాలని కోరారు. 18 ఏండ్ల క్రితం ఏర్పాటు చేసుకున్న ఆంజనేయ స్వామి దేవాలయాన్ని అప్పటి ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి ప్రారంభించారని పేర్కొన్నారు. అంతకుముందు ఆలయ ప్రాంగణం ముఖద్వారం వద్ద ఉదయం నుంచి మన్యసూక్తసహిత సంక్షేపరామాయణ హెూమం, హనుమాన్ మూల మంత్రం, సుదర్శన హెూమం వేద పండితులతో నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మెన్‌హనుమంతు, వైస్‌చైర్మెన్, కాలనీ అధ్యక్షుడు సత్యపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా రాగిడి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పొట్లూరి వెంకటేష్, కాలనీ, ఆలయ సలహాదారులు వేముల సంతోష్ రెడ్డి, గట్ల దేవేందర్ రెడ్డి, అంజిరెడ్డి, ఎల్లగోని శ్రీనివాస్ గౌడ్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి టీయూడబ్ల్యూజే
మేడ్చల్ జిల్లా కమిటీ అభినందనలు



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన బండారి లక్ష్మారెడ్డికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ మేడ్చల్ జిల్లా కమిటీ నాయకులు అభినందనలు తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గడ్డమీది బాలరాజ్‌గౌడ్, వెంకట్ రామ్‌రెడ్డిల ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు బండారి లక్ష్మారెడ్డిని సన్మానించారు. జర్నలిస్టుల సంక్షేమానికి తోడ్పాటును అందించాలని లక్ష్మారెడ్డికి విన్నవించారు. దీనికి స్పందించిన ఆయన ఎల్లవేళలా జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యుడు మోతే వెంకట్ రామ్ రెడ్డి, యూనియన్ నాయకులు పంజాల శ్రీనివాస్ గౌడ్, సీరా శ్రీనివాస్, టిడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా ఆరోగ్య కమిటీ కన్వీనర్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.



చక్రీపురం మారుతీ కాలనీ అధ్యక్షులు ధీరావత్ శ్రీనివాస్ హయాంలో మొదటి సారిగా సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా అధ్యక్షులు ధీరావత్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే రోజులలో క్రిస్మస్ పండుగను మరింత ఘనంగా జరుపుకునేలా ఏర్పాటు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు హన్మంతు నాయక్, మోహన్‌రావు, పోచయ్య, అరవింద్, విజయశ్రీ, గోవింద్ రావు, అరుణ, మున్నీ, బాలు, మూడావత్ రమేష్, బుజ్జి, అనురాధ, పాస్టర్ వెంకన్న, లంకదాసరి సుధాకర్, రమణ, కాలనీ సభ్యులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కాప్రా

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



నవతెలంగాణ-కాప్రా

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని జేవీవీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పి. నాగరాజు అన్నారు. ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 98వ మెడికల్ క్యాంపునకు విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు. కాప్రా, మల్కాజిగిరి, కీసర మండల కమిటీల ఆధ్వర్యంలో బీపీ, షుగర్ రోగుల కోసం మెడికల్ క్యాంపును శ్రీచక్రి విద్యానికేతన్ హై స్కూల్ చక్రిపురంలో నిర్వహించారు. ఈ క్యాంపులో బీపీ, షుగర్ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ క్యాంపులో చక్రిపురం, కుషాయిగూడ, చర్లపల్లి, నాగారం, దమ్మాయిగూడ, రాంపల్లి తదితర ప్రాంతాల వారు పరీక్షలు చేయించుకున్నారు. అంతకుముందు నాగరాజు మాట్లాడుతూ.. నిరంతరం వైద్య సేవలు అందిస్తున్న కాప్రా, మల్కాజిగిరి, కీసర మండల కమిటీల సభ్యులను, వాలంటీర్లను అభినందించారు. మళ్లీ కరోనా విజృంభిస్తున్న వేళ ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విద్యాసాగర్ (హెల్త్ అడ్డా) ఎం.జయరాజ్, మనోహర్, మెడికల్ క్యాంపు ఆర్గనైజర్ జీకే రెడ్డి, జేవీవీ నాయకులు సోమయ్య చారి, శేషు, వెంకటరమణ, వెంకట రామయ్య, నాగేశ్వరరావు, జెన్నీ షా, శివ శంకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, ప్రభాకర్, శివప్రసాద్, ఎం.ఎల్.చౌదరి, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డును పరిశీలించిన కార్పొరేటర్ బన్నాల



నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లోని ఆనంద నగర్ కాలనీలో రూ.19 లక్షల వ్యయంతో వేసిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ బన్నాల గీత జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చిల్కానగర్ డివిజన్‌లోని బస్తీలలో, కాలనీలలో ప్రణాళిక బద్ధంగా నూతన సీసీ రోడ్లు వేయిస్తున్నామని చెప్పారు. జీహెచ్ఎంసీ ఎలక్షల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నానని తెలిపారు. సీసీ రోడ్డుకు నిర్దేశించిన సమయానుసారం క్యూరింగ్ చేయాలని, రోడ్డు ఇరువైపులా మట్టి నింపి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎదుల కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోకొండ జగన్, బాలు, శ్యామ్ ఆనంద నగర్ కాలనీ అధ్యక్షులు మధుసూదన్ గౌడ్, కాలనీ సభ్యులు రఘుపతి గౌడ్, సుదర్శన్, భాస్కర్, పాల్గొన్నారు.

పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-బోడుప్పల్

పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. దేశ జనాభాలో అధిక శాతం జనాభా కలిగిన బీసీలు అగ్రవర్ణాల చేతిలో ఓటర్లుగానే మిగిలి పోతున్నారని పేర్కొన్నారు. ఆదివారం పర్వతాపూర్‌లో నిర్వహించిన బీసీల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ..రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. దేశంలో 70 ఏండ్లుగా పాలించిన కేంద్ర ప్రభుత్వాలు, బీసీలను ఏ రంగంలోనూ జనాభా ప్రకారం వాటా ఇవ్వలేదన్నారు. బీసీలకు జనాభా ప్రకారం వాటా దక్కేదాక ఉద్యమిస్తామన్నారు.

ఆత్మీయ సమ్మేళనాలతో ఆనందం



నవతెలంగాణ-శామీర్‌పేట్

ఉరుకుల పరుగుల జీవితంలో ఆత్మీయ సమ్మేళనాలు ఆనందాన్ని, సంతోషాన్ని కలిగిస్తాయని అప్పటి (రిటైర్డ్) ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని అలియాబాద్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 2000-2001 విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని అలియాబాద్‌లోని మర్రి ఫామ్స్‌లో నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వళన చేసి గురువులకు ఆత్మీయ సన్మానం చేసి గురు భక్తిని చాటుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులు నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అప్పటి హెచ్ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు దామోదర్, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, శ్యామల, వెంకటరెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 129 సూరారం డివిజన్ సంజయ్ గాంధీ నగర్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి, ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తుండడంతో అమృత్(లడ్డు) వారి మిత్రబృందం నారాయణ, శివ, శ్రీనివాస్ రాజు, రామకృష్ణ, బాబులు, కిరణ్, సాయి రామ్‌లతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలిపిన కర్క నాగరాజు



నవతెలంగాణ-కూకట్‌పల్లి
గ్రేటర్ హైదరాబాద్ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంగం అధ్యక్షులు కర్క నాగరాజు ఆధ్వర్యంలో, ఇటీవల తెలంగాణ రాష్ట్రానికి పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్, ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సీతక్కని, న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ ఆమె నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి పూల బోకేతో శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంగం నాయకులు జక్కుల అశోక్, శ్రీనివాస్, సదామహేష్, ఫయాస్,శివరాజు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-దుండిగల్
మైసమ్మగూడలో సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నోస్టల్జియ 23 (రికనెక్ట్ పార్టీ) పేరుతో ఆదివారం కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులందరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం కాలేజీలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఏ ఏ కోర్సుల్లో ప్రావీణ్యం సాధించాలి, కమ్యూనికేషన్ స్కిల్స్ ఎలా ఉండాలి అనే అంశాల మీద అవగాహన కల్పించారు. తమని ఇంత ఉన్నత స్తితికి చేర్చిన మా కాలేజీకి విద్యార్థులకు ఎల్లవేళల మా సహాయ సహకారాలు ఉంటాయని స్పెక్ ఎన్సియేంట్స్ ప్రెసిడెంట్, శిరీష్ రామ్మూర్తి, ఠాకుర్ అక్షయ్ సింగ్, సెక్రెటరీ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ టివి రెడ్డి పూర్వ విద్యారులను ఉద్దేశించి మాట్లాడుతూ మీ అమూల్యమైన సలహాలు సూచనలు విద్యార్థులకు ఇవ్వాలని తెలిపారు. ప్రిన్సిపాల్ డా. కె శ్రీలత మాట్లాడుతూ ప్రస్తుతం కళాశాలలో ఉన్న విద్యార్థులకు టెక్నాలజీకి సంబంధించిన విషయాలు మీద అవగాహన కల్పించాలని కోరారు. కళాశాల చైర్మెన్ టి.బాల రెడ్డి, కళాశాల సెక్రెటరీ టి వి రెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె శ్రీలత, అకడమిక్ డైరెక్టర్.సరోజారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి, రవి పాల్గొన్నారు.

మీ సేవ నీ 'చిరునామా'ఎక్కడ..?



నవతెలంగాణ-నేరేడ్‌మెట్
ప్రజలకు పౌరసేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాటు చేసిన మీ-సేవ కేంద్రం నిరుపయోగంగా మారుతోంది. మీ సేవ కేంద్రాల ఏర్పాటు సమయంలో మల్కాజిగిరి, నేరేడ్ మెట్, మౌలాలి ప్రాంత ప్రజలకు అనువుగా ఉండి, సత్వర, సముచిత పౌర సేవలు పొంది లబ్ది పొందాలనే ఉద్దేశ్యంతో వినాయక్ నగర్‌లో మీ సేవ కేంద్రం ఏర్పాటు చేశారు. కానీ, అన్నీ వున్నా, అల్లుడి నోట్లో శని ఉందన్న చందంగా వినాయక్ నగర్ ప్రభుత్వ మీ సేవ కేంద్రం మారింది. ముఖ్యంగా బోర్డు లేని మీ సేవ కేంద్రం వినియోగదారులకు మరింత ఇబ్బందికరంగా మారింది. మీ సేవ కేంద్రం చిరునామా ఎక్కడో, అసలు మీ సేవ కేంద్రం అనేది ఎక్కడుందో తెలియని అయోమయ స్థితిలో ప్రజలు కొట్టు మిట్టాడుతున్నారు. కొద్ది రోజుల క్రితం గాలి వానకు బోర్డు రాలిపోయింది. దీనికి గేటు కూడా సరిగ్గా లేదు. పనికి రాకుండా పోయింది. గతంలో నిత్యం వందలాది మంది వినియోగదారులు ఇక్కడికి వచ్చి వెళ్తుండే వారు. ప్రభుత్వం అమలు చేసే ఏ సంక్షేమ పథకానికైనా దరఖాస్తు చేసుకోవాలంటే మీసేవకే వెళ్లాలి. మీ సేవ ద్వారానే దరఖాస్తులు అందచేయాలి. అసలు మీ సేవ ఎక్కడుందో తెలియక వినాయక్ నగర్ , నేరేడ్ మెట్ పరిసర కాలనీల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వినాయక డివిజన్ పరిధిలోని మీసేవ, వసతులు కరువైన మీసేవ.. మీసేవ ఎక్కడ చూస్తున్న జనాలు బోర్డు కనిపించక పోవడంతో మీ సేవకు వచ్చే ప్రజలు రోడ్ల పైన అక్కడ ఇక్కడ తిరుగుతూ వచ్చే వారిని అడగి వెళుతున్నారు. ఒకప్పుడు మీ సేవ కేంద్రం అనునిత్యం జనాలతో కళకళలాడుతుండేది. దీంతో పౌరసేవలు వేగవంతంగా జరిగి ప్రజలు లబ్దిపొందేవారు. కానీ ,నిర్వహణ లోపం కారణంగా మీ సేవ కేంద్రం ప్రస్తుతం లోపల దుమ్ము దూళితో బూజు పట్టిన గోడలు, వర్షాలకు నిమ్ము వచ్చి పగళ్ళతో ఉన్న గోడలు కనిపిస్తున్నాయి. ఇక నైనా మీ సేవ అడ్రస్, అడ్డా తెలియడానికి ఈ కార్యాలయానికి బోర్డు ఏర్పాటు చేయించి, గేటు సరిగ్గా అమర్చాలని పలువురు వినియోగ దారులు, ప్రముఖ సంఘ సేవకులు షేర్ల అనిల్ కోరారు. ఇప్పటికైనా పాలకులు, అధికార యంత్రాంగం స్పందించి ప్రజల ఆదరణ పొందేలా మీ సేవలో అవసరమైన సిబ్బంది, వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ప్రధానం



నవతెలంగాణ-దుండిగల్
కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్‌లోని సుందరయ్య భవనంలో ఇటీవల ప్రగతి టెక్ అకాడమీ నిర్వహణలో ప్రగతినగర్ పరిసర ప్రాంతాల పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని ఉపాధి అవకాశాల నిచ్చే కోర్సులు వెబ్ డిజైనింగ్, జావా, ట్యాలీ, కంప్యూటర్ బేసిక్స్, ఎమ్మెస్ ఆఫీస్, మల్టీమీడియా, ఫోటోషాప్ వివిధ కోర్సులలో శిక్షణ నిర్వహించారు. శిక్షణ పొందిన విద్యార్థులకు ఆదివారం సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రహీం, మురళి కృష్ణ, సుందరయ్య భవనం నిర్వహణ కమిటీ కన్వీనర్ సిహెచ్ ఎం.చారి, ప్రగతి టెక్ అకాడమీ ప్రధాన నిర్వాహకులు మల్లేష్, పిఆర్ఓ సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెన్త్, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు, గృహిణులకు అతితక్కువ ఫీజులతో ఉపాధి అవకాశాల నిచ్చే కోర్సులలో శిక్షణ అందిస్తున్న ట్లు తెలిపారు. అలాగే 2024 జనవరి నెల నుంచి ఉపాధి నిచ్చే(పైతాన్) మరో కొత్త కోర్సును ఏర్పాటు చేస్తున్నామని అకాడమీ ప్రధాన నిర్వాహకుడు మల్లేష్ తెలిపారు.

మౌలిక సదుపాయాలకు కృషి



- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్
మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మచ్చ బొల్లారం (133) డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు, అస్తవ్యస్తమైన డ్రయినేజీ వ్యవస్థ, మురుగునీరు నిలుచుట, కలుషితం అవుతున్న భూగర్భ జలాలు, కొత్తచెరువులో పెరిగి పోయిన గుర్రపు డెక్క తొలగింపు తదితర మౌలిక సమస్యలను పరిష్కరించాలని స్థానికులు, ఎమ్మెల్యే కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..స్థానికులు తనకు చెప్పిన సమస్యలన్నీ, త్వరలోనే అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఢిల్లీ పరమేష్, డోలి రమేష్, పవన్, జ్ఞానేశ్వర్, బాలరాజు, లక్ష్మారెడ్డి, కృష్ణ, మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకత పై దృష్టి కేంద్రీకరించాలి



- రాష్ట్ర జీఎస్టీ, కస్టమ్స్ ముఖ్య కమిషనర్ సందీప్ ప్రకాష్

నవతెలంగాణ-దుండిగల్
విద్యార్థులు తమ ఉద్దేశపూర్వక లక్ష్యం కోసం కష్టపడి చదవడంతోపాటు, సృజనాత్మక అభిరుచులపై దృష్టి కేంద్రీకరించలని తెలంగాణ రాష్ట్ర జీఎస్టీ, కస్టమ్స్ ముఖ్య కమిషనర్ సందీప్ ప్రకాష్ కోరారు. హైదరాబాద్ నగర శివారులోని గుండ్ల పోచంపల్లి మైసమ్మగూడలో డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ 21వ వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల ముగింపు ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సందీప్ ప్రకాష్ హాజరై స్కూలు యాజమాన్యంతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, ముగింపు ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల కెరీర్‌లో విద్యార్థులు సృజనాత్మకతను ఉపయోగించుకునే అనేక మార్గాలు ఉన్నాయని, నేర్చుకోవడాన్ని కొంచెం సరదాగా చేయడానికి మాత్రమే కాకుండా, విద్యాపరమైన లక్ష్యాలను సాధించడంలో ఎంతగానో సహాయపడతాయని అన్నారు. అలాగే స్థితి స్థాపకత సహనం పట్టుదల నాయకత్వం జవాబు దారి తనం యొక్క అద్భుతమైన ప్రదర్శనను డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షిక స్పోర్ట్స్ మీట్‌లో తిలకించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవస్థాపకులు, చైర్మెన్ దయానంద్ అగర్వాల్ మాట్లాడుతూ పిల్లల ప్రతిభను ప్రదర్శించే కార్యక్రమం ఇతర పిల్లలకు కూడా ప్రోత్సాహానికి మూలం అన్నారు. కష్టపడి చదవి, విద్య నైపుణ్యం పెంచుకొని విద్యార్థులు పాఠశాల కారిడార్ల నుండి బయటకు వచ్చిన తర్వాత దృఢ నిబద్ధతతో కొత్త శిఖరాలను చేరుకొని బాధ్యతాయుతమైన ప్రపంచ పౌరులుగా నిలువాలని దయానంద్ అగర్వాల్ కోరారు. వార్షిక క్రీడా పోటీలలో విజేతలైన విద్యార్థులకు మెడల్, ట్రోఫీ, సర్టిఫికెట్‌లను సందీప్ ప్రకాష్ అందజేసి అభినందించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కోలాహలంలో పాల్గొని భారతీయ సంస్కృతిలోని సంగీతం, పాటలు, నృత్య ప్రదర్శనలతో పాటు పాశ్చాత్య సంగీతం, పాటలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు అంజనీ కుమార్ అగర్వాల్, సంజయ్ గార్గ్ అగర్వాల్ ప్రిన్సిపల్ షణ్ముగం పరమశివన్, స్కూల్ పూర్వ విద్యార్ధిని సినీనటి సిమ్రాన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు లేక స్థానికుల ఇబ్బందులు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్
రాజుల సొమ్ము రాళ్ల పాలు..ఎక్కడి సమస్యలు అక్కడే అన్న చందంగా తయారైంది మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధిపనుల తీరు. దీనికి నిదర్శనమే రేణుకానగర్ కాలనీ.. ఇది వినాయక నగర్, నేరేడ్‌మెట్ డివిజన్‌ల మధ్య ఉంది. గతంలో డ్రయినేజీ పొంగిపోర్లుతుంటే స్థానికుల ఫిర్యాదు మేరకు డ్రయినేజీ పైప్ లైన్ వేశారు. కానీ, తర్వాత సీసీ రోడ్డు వేయడం మరిచారు. దీంతో స్థానికులు గుంతలలో నడవాలంటే ఇబ్బందిగా మారింది. రెండు డివిజన్ల మధ్యన ఖాళీలో నడవాలంటే కాలనీ వాసులు నరకయాతన పడుతున్నారు. వయో వృద్ధులు ఈ మార్గంలో నడవలేక పోతున్నారు. అంతే కాకుండా అసంపూర్తి డ్రయినేజీ పనుల కారణంగా భరించలేని కంపు వాసన కొడుతోంది. పలు మార్లు జీహెచ్ఎంసీ అధికారులకు, ఇటు ఇద్దరు కార్పోరేటర్లకు చెప్పినా ఫలితం లేదని వాపోయారు. సమస్య పరిష్కారంలో అధికారులు, పాలకులు ఇకనైనా నిర్లక్ష్యం వీడాలని స్థానికులు కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



- మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
130 సుభాష్ నగర్ డివిజన్ ప్రజల సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి అన్నారు. ఆదివారం సుభాష్ నగర్ కార్పొరేట్ కార్యాలయంలో సురేష్ రెడ్డితో పలువురు తమ సమస్యలను విన్నవించుకున్నారు. ప్రజల నుండి విద్య, వైద్యం, తాగునీరు, రోడ్డు, వీధి దీపాలు, ఉద్యానవనాలు, కమిటీ హాల్‌లు, బస్తీ దవాఖానాలు, పెన్షన్లు, రేషన్ కార్డులు వంటి మౌలిక వసతులకు సంబంధించి అనేక మంది విజ్ఞాపనలు చేశారని సురేష్ రెడ్డి తెలిపారు. తనపై నమ్మకంతో హేమలత సురేష్ రెడ్డిని గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటూ, సేవలందిస్తానని సురేష్ రెడ్డి తన సంకల్పాన్ని వెల్లడించారు. అధికారుల సహకారం ఉన్నప్పుడే ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు వీలవుతుందని, ఈ మేరకు అన్ని శాఖల అధికారులు తోడ్పాటును అందించాలని కోరారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని వాటిని అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

పేదవారికి బియ్యాన్ని అందజేసిన గవర్నర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి
స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో కూకట్ పల్లి అసెంబ్లీ పరిధిలోని పి.యస్.యమ్ పాఠశాల ప్రాంగంంలో ఏర్పాటు చేసిన, పలు సేవా కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ విచ్చేసి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. స్కూల్ విద్యార్థులు గుప్పెడు బియ్యం పేరుతో సేకరించిన బియ్యాన్ని ఆయన పేద వారికి అందజేశారు. ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్కూల్ యాజమాన్యం, విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మెన్ హనుమంత్ రావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పన్నాల హరీష్ రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరావు, సూర్యప్రకాష్ రావు, అర్మనపల్లి సూర్యారావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను సన్మానించిన వడ్డేపల్లి రాజేశ్వర్ రావు

వివేకానంద సేవ సమితి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి పి.ఎస్.ఎం హై స్కూల్‌లో నిర్వహించిన సేవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన ముఖ్య అతిథి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ హనుమంత్ రావు, మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షులు పన్నాల హరీష్ రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యప్రకాష్ రావు, అర్మనపల్లి సూర్యారావు, జిల్లా డివిజన్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చిన్న పత్రికల సంఘం అధ్యక్షునిగా శ్రావణ్ కుమార్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
టీయూడబ్ల్యూజేహెచ్ 143 అనుబంధ చిన్న పత్రికల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షునిగా కే.శ్రావణ్ కుమార్ నియామకం అయ్యారు. రాష్ట్ర కార్యాలయంలో చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బిజిగిరి శ్రీనివాస్ ఈ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో స్థానిక పత్రికలు కీలక భూమిక వహించాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో చిన్న పత్రికల అభివృద్ధి పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన అన్నారు. చిన్న పత్రికల అభివృద్ధి కొరకు నా శక్తి మేరకు కృషి చేస్తానని శ్రావణ్ కుమార్ తెలిపారు. అలాగే డీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ నాయకత్వంలో జర్నలిస్టుల సమస్యల పట్ల పోరాట మార్గం లో పని చేస్తామని ఆయన అన్నారు. తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు బిజిగిరి శ్రీనివాస్‌కు రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం



- కార్పొరేటర్ మేకల సునీత

నవతెలంగాణ-మల్కాజిగిరి
ఆధ్యాత్మిక భావంతో మానసిక ప్రశాంతత కలుగుతుంది అని కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ అన్నారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం మిరిజాలగూడలో శ్రీకాంత్, కాలనీవాసులు ఏర్పాటు చేసిన వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులతో ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరము సామూహిక అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాము యాదవ్ , నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సూరారం 129 డివిజన్ పాత ఎమ్మార్వో కార్యాలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన అలస్కా ప్లే స్కూల్‌ను విద్యావంతుడు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద, మాజీ కార్పొరేటర్ జి.సురేష్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మత సామరస్యానికి ప్రతీక గ్యార్వి షరీఫ్ ఉత్సవాలు



- ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి
ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలో జరిగిన గ్యార్వి షరీఫ్ ముబారక్ ఉత్సవ కార్యక్రమంలో, ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. మత సామరస్యానికి ప్రతీక గ్యార్వి షరీఫ్ ఉత్సవం అన్నారు. అందరూ సామరస్యంగా జరుపుకునే వేడుక అని, ఎంతో పవిత్రంగా కొలిచే గ్యార్వి షరీఫ్ ఉత్సవంను భక్తి, శ్రద్ధలతో, శాంతి యుతంగా జరుపుకోవాలని తెలిచేయసారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నాయి నేని చంద్రకాంత్ రావు, కాశినాథ్ యాదవ్, ఎల్లంనాయుడు, ముస్లిం సోదరులు, ఎం.ఏ.కరీమ్, ఎండీ.గౌస్, ఖాజా కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్: సూరారం 129 డివిజన్ పరిధి నెహ్రూ నగర్‌లో గౌస్ - ఈ- పక్ దర్గా నందు నిర్వహించిన గ్యార్వి ఉత్సవాలకు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మత సామరస్యానికి ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో గాజుల రామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, రుద్రా అశోక్, సీనియర్ నాయకులు ప్రభుదాస్, జమీల్, దశరథ్, మంజూర్ భాయ్, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి



- కొలను శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ-దుండిగల్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 12 డివిజన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల అభిమానుల పిలుపుమేరకు ఆదివారం ఇందిరమ్మ కాలనీ పేస్టు 2 లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. కాలనీవాసులు తమకున్న సమస్యలను విన్నవించుకున్నారు. దీనిపై కోలన్ స్పందించి, కాలనీ వాసులకు ఎటువంటి సమస్యలు ఉన్న నా దృష్టికి తీసుకురాగలన్నారు. తాను పై అధికారులతో మాట్లాడి తమ సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ప్రజలకు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ గవర్నమెంట్‌లో ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా ఉంటుందని రేషన్ కార్డ్స్ ,పెన్షన్స్, మహాలక్ష్మి పథకం, ఇవన్నీ త్వరలో అందుబాటులోకి వస్తున్నాయని తప్పకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలాజీ హిల్స్ బాలాజీ నగర్ కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రొ.కోదండరాంకు వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రొ.కోదండరాంకు తార్నాక లోని ఆయిన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ పార్ట్ టైం టీచర్ల పడు తున్న ఇబ్బందులను, వారి సమస్యలను వివరించారు. అనంతరం వారి సమస్యలను పరిష్కరించడానికి తన వంతు బాధ్యత నిర్వహి స్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో,అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోమేశ్వర్ బోనకుర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆరుట్ల జానకిరెడ్డి, డాక్టర్ కరుణాకర్, డాక్టర్ మౌలాలి, డాక్టర్ భూషణ్, డాక్టర్ నరేందర్, డాక్టర్ జీవన్, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లాస్య నందిత



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పలు చర్చిల్లో ఈవారం క్రిస్మస్ సందడి నెల కొంది. కాగా వార్డు 8 వార్డు 3లో చర్చిల్లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే లాస్యనందిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెూలీ ట్రీనిటీ చర్చుతో పాటు ఇతర ప్రాంతాల్లో నిర్వహించిన క్రిస్మస్ సెల బ్రేషన్స్‌కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదర, సోదర మణులందరికీ ఎమ్మెల్యే లాస్యనందిత క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకురాలు నివేదితతో పాటు పలువురు ముఖ్యనేతలు పాల్గొన్నారు.

లిఫ్ట్‌లో చిక్కుకపోయిన ఎమ్మెల్యే లాస్యనందిత





- లిఫ్ట్ డోర్లను తెరిచి బయటకు తీసిన ఆస్పత్రి సిబ్బంది .. వారి అనుచరులు

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత ఆదివారం బోయినపల్లిలోని ఒక ఆసుపత్రి ఓ ప్రారం భోత్సవ కార్యక్రమానికి వెళ్లి లిఫ్టుల చిక్కుకపోయినట్లు పలువురు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. లిఫ్ట్‌లో ఊపిరాడని పరిస్థితిలో 15 నిమిషాల పాటు ఉండిపోయినట్లు తెలిపారు. వారి అనుచరులు పలు పరికరాలతో లిఫ్ట్‌డోర్‌ను బ్రేక్ చేసి ఎమ్మెల్యేను ఆమె సోదరి నివదితను ఇతర సిబ్బందిని బయ టకు తీసినట్లు తెలిపారు. అనంతరం ఆందోళనకు గురైన లాస్య నందిత సోదరి నివేదితతో కలిసి అక్కడి నుండి ఆమె గ్రౌండ్ ఫ్లోర్‌కి వెళ్లి కార్యక్రమాన్ని ప్రారంభించకుండానే వెళ్లిపోయినట్లు తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది ప్రారంభించమని కోరినప్పటికీ జరిగిన సంఘటన వల్ల ఆందోళన గురి అయిన ఎమ్మెల్యే అంగీకరించలేదని, చివరికిఆమె సోదరి నివేదిత కార్యక్ర మాన్ని ప్రారంభించారని తెలియజేశారు.

వార్షికోత్సవాన్ని ప్రారంభించిన లాస్య నివేదిత

కంటోన్మెంట్ నియోజకవర్గంలో బోయినపల్లి ఆరోవార్డ్ గణేష్‌నగర్‌లో ఉన్న విఆర్ ఆస్పత్రి ఏడవ వార్షికోత్సవాన్ని ఆదివారం నియోజకవర్గ ఎమ్మెల్యే లాస్య నందిత సోదరి జి .నివేదిత ప్రారంభించారు లిఫ్ట్‌లో ఇరుక్కుపోయి ఆందోళనకు లోనైన ఎమ్మెల్యే లాస్య వెళ్లిపోవడంతో ఆస్ప త్రి సిబ్బంది విజ్ఞప్తి మేరకు నివేదిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ నందకిషోర్ శాలువా కప్పి నివేదితం సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నరసింహా యాదవ్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్, మాజీ సభ్యుడు పాండుయాదవ్‌తో పాటు ఆసు పత్రి వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం

- పి.విజయరెడ్డి



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఖైరతాబాద్ డివిజన్‌లో గల ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠ శాలలో సుమారుగా 400పైగా విద్యార్థులు చదువుతున్నారని, ఆ డివిజన్ పరిధిలో నిమ్స్ ఎక్స్‌టెన్షన్ పేరిట పాఠశాలకు వెళ్లే రహదారులన్నీ మూసి వేయడం విద్యార్థులు పాఠశాలకు వెళ్ళి వచ్చేం దుకు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక కార్పొరేటర్ నియోజకవర్గ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయరెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహనూ కలిసి వినతపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిమ్స్ ఎక్స్‌టెన్షన్ పేరిట రహదారులు మూసివేసి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను ఇబ్బందులు పెట్టడం సరైంది కాదని, విద్యార్థుల భవిష్యత్తులో ముఖ్యమని వారు అన్నారు. ఆ చుట్టుపక్కల బస్తీలలో నుంచి పలువురుఉ విద్యార్థులు ఈ పాఠశాలకు వస్తారని తెలిపారు. నిమ్స్ పార్కింగ్ లోంచి దారి ఇస్తామని ఆర్ అండ్ బి అధికారులు తెలియజేశారని, కానీ విద్యార్థులు అక్కడి నుండి రావడానికి వీలు లేకుండా ఆస్పత్రిలో రోగులకు సంబంధించిన వ్యర్థాలను ఆ ప్రాం తంలో వేస్తున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.అక్కడి నుండి వస్తే పిల్లలు అనారోగ్యం పాలు అవడానికి అవకాశాలు ఉన్నాయని వారి తల్లిదండ్రులు బెంబేలెత్తుతున్నారని వివరించారు. ఈ విద్యా సంవత్సరం పూర్తి యగు వరకు పాతదారులను, పునరుద్ధరించాలని, ఇతర చోట నుండి పాఠశాలకు వెళ్లి వచ్చుటకు ప్రత్యామ్నాయ దారి ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు.

నూతన అధ్యక్ష కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు

- నియోజకవర్గ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయరెడ్డి



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఖైరతాబాద్ నియోజకవర్గంలో వాసవి క్లబ్లో ఆర్యవైశ్య సంఘం ఖైరతాబాద్ ద్వితీయ కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ నియో జకవర్గ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయరెడ్డి హాజరయ్యారు. అనంతరం నూతన అధ్యక్ష కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులతో పాటు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడి పూజ



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఆదివారం జూబ్లీహిల్స్ డివిజన్ దుర్గ భవాని నగర్‌లో శ్రీఎల్లమ్మ మారమ్మ దేవాలయంలో జయరాం గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడి పూజ ఘనంగా నిర్వహించారు. ఆదివారం బాలిరెడ్డినగర్‌లోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో గురుస్వామి మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఇరుముళ్ల కార్యక్రమనికి స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ హాజ రయ్యారు. ఈ కార్యక్రమంలో ఇరు బస్తిలకూ స్వాములు జయరాం, చంటి,వీరయ్య, నవీన్,శెట్టి, రాజు, కుమార్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని ప్రభావితం చేసే వ్యక్తులకు సత్కారం

- దేశవ్యాప్తంగా 120 మందికి రాష్ట్రీయ గౌరవ్ అవార్డు
- వివిధ రంగాల ప్రముఖులతో అవార్డులు అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

సమాజంలోని వివిధ రంగాల్లో కృషి చేసిన వ్యక్తులను గుర్తించి, సత్కరించేం దుకు రాష్ట్రీయ గౌరవ్ అవార్డ్స్-2023 వేడుకను ఎఫ్‌టీసీసీఐ, రెడ్‌హిల్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, తెలుగు సినీ నిర్మాత రామ సత్యనారాయణ, సుధాకర్ పైపుల మేనేజింగ్ డైరెక్టర్ జయదేవ్ మీలా, డిఫెన్స్ ఎస్టేట్స్ డైరెక్టర్ డి.మధుకర్ నాయక్, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న ముఖ్య అతిథులుగా పాల్గొని అవార్డు గ్రహీ తలకు అవార్డులను అందజేశారు. దేశవ్యాప్తంగా 120 మంది వ్యక్తులకు ఈ అవార్డులను అందజేశారు. సమాజానికి చేసిన ఆదర్శప్రాయమైన సేవలను గుర్తించి వీరిని ఎంపిక చేశారు. అవార్డు గ్రహీతల్లో శోభాశెట్టి (బిగ్ బాస్ ఫేమ్), డాక్టర్ ఆశ్లేష (కౌన్సిలర్), మోనిష్ యర్రగుంట్ల (ఇన్వెస్టర్), చరణ్ లక్కరాజు (స్టూడెంట్ ట్రైబ్), ప్రఖ్యాత యాంకర్ దేవి నాగవల్లి, పలువురు ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ గౌరవ్ అవార్డ్స్ నిర్వాహకులు సాత్విక గుప్తా, అఖిల్ సివ్వా మాట్లాడుతూ 'వ్యక్తులను ఆయా విభాగాల్లో రాణించేలా ప్రోత్సహించడమే మా ఉద్దేశం. విశేషమైన వాటిని వెలుగులోకి తీసుకురావాలని మేం విశ్వసిస్తున్నాం. సమాజాన్ని సానుకూలంగా ప్రభావితం చేసిన వ్యక్తుల విజయాలు." రాష్ట్రీయ గౌరవ్ అవార్డ్స్-2024 మార్చిలో నిర్వహించబడుతుందని తెలిపారు. రాష్ట్రీయ గౌరవ్ అవార్డ్స్-2023 వివిధ రంగాలకు చెందిన వ్యక్తుల అద్భుతమైన విజయాలను వెలుగులోకి తెచ్చింది. సమాజం శ్రేష్ఠతను సాధించడానికి, సమాజ అభివద్ధికి గణనీయమైన కృషి చేయడానికి ఒక ఉదాహరణగా నిలిచింది.

మనువాద బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే

పెరియార్‌కి ఇచ్చే ఘనమైన నివాళి



- బహుజన్ స్టూడెంట్ ఫెడ రేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్

నవతెలంగాణ-ఓయూ

కేంద్రంలో అధికారంలో ఉన్న మనువాద బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించడమే పెరియార్ రామస్వామి నాయకర్‌కి ఇచ్చే ఘన నివాళి అని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ అన్నారు. పెరియార్ రామస్వామి నాయకర్ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ ఓయు ఇన్‌చార్జి కల్వకుర్తి శ్రీశైలం ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బోరెల్లి సురేష్ పెరి యర్ రామస్వామి నాయకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సంస్కృతి పేరుతో సామాన్యులను చిత్రహింసలు పెట్టే మనువాద భావ జాలాన్ని కూక టివేలతో తెగించారని, అలాంటి మనువాద భావజాలంతో భారతదేశాన్ని పరిపాలిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే పెరియర్ ఇవి రామస్వామి నాయకర్‌కి ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌ఎఫ్ నాయకులు శ్రీకాంత్, ప్రసాద్, బాలస్వామి, పిండారి, ప్రవీణ్, వెంకటేష్, పలుప్రాజెక్టులలో పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి దాతలు విరాళాలు అభినందనీయం



- సనత్‌నగర్ ఎమ్మెల్యే మాజీ మంత్రి, తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఆలయాల అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం ఎంతో అభినందనీయమని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం అమీర్ పేట లోని శ్రీకనకదుర్గమ్మ దేవాలయం వద్ద సీనియర్ సిటిజన్, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి పార్ధసారథి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రూ.14 లక్షల వ్యయంతో, నూతనంగా నిర్మించిన అమ్మ వారి రథం మండపాన్ని తలసాని శ్రీనివాస్‌యాదవ్, దాత పార్ధసారథితో కలిసి ప్రారంభించారు. ముందుగా ఆలయ పండితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మండపాన్ని ప్రారంభించిన అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని అనేక ఆలయాలను తెలం గాణ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ నిధులతో పాటు, దాతల సహకారంతో ఎంతో అభివృద్ధి చేశామని, ఆలయా లకు వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని సౌకర్యాలు కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. కనకదుర్గమ్మ ఆలయాన్ని కూడా ఎంతో అభివృద్ధి చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, దాత పార్ధసారథి, ఆలయ చైర్మెన్ మల్లి ఖార్జునప్ప, సభ్యులు సహదేవ్ గౌడ్, లింగమయ్య, ఆకుల రాజు, చంద్రశేఖర్, పద్మావతి, అరుణ, మోహన్ నాయుడు, అశోక్ యాదవ్, సంతోష్, ప్రవీణ్ రెడ్డి, హరిసింగ్ పాల్గొన్నారు.

ఆదివాసీ విద్యార్థి సంఘం (ఏఎస్‌యూ) నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-ఓయూ

ఆదివాసీ విద్యార్థి సంఘం (ఏఎస్‌యూ),నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు ఆదివాసీ విద్యార్థి సంఘ తెలియజేసింది. ఈ సందర్భంగా ఆదివాసి పరిశోధక విద్యార్థి సాగబో యిన పాపారావు అధ్యక్షతన ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థి నాయకులు కొమురంభీం ఉద్యమస్ఫూర్తితో ఉస్మానియా కేంద్రంగా ఉన్నత చదువులం కొనసాగిస్తూనే ఆదివాసి సమస్యల పై పరిశోధనాత్మక పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్య క్షులు కొప్పుల రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ సాగబోయిన పాపారావు, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఉస్మానియా కేంద్రంగా ఆదివాసి విద్యార్థి,సామాజిక సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఎస్ ఎస్‌యూ తిరుగు లేని పోరాటాలను నిర్మిస్తుందని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాగబోయిన పాపారావు అన్నారు.ఆదివాసి విద్యార్థి ఉద్యమాలను బలోపేతం చేస్తానని ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

డా.జి.భానుప్రకాష్ రెడ్డికి వేపచేదు స్మారక అవార్డ్ ప్రదానం



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వ విద్యాలయం సైన్సు కళా శాల జీవరసాయన శాస్త్ర విభాగం ఆధ్వ ర్యంలో ఐసీయంఆర్ - ఎన్ఐ ఎన్ శాస్త్రవేత్త డా.జి. భాను ప్రకాష్‌రెడ్డికి 2023 సంవత్సరం గాను " వేపచేదు గోపాల కిషన రావు స్మారక అవార్డ్‌ను ప్రదానం చేయనున్నట్లు విభాగం ఆచార్య మంజుల భానూరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవార్డ్ ప్రతి సంవత్సరం జీవ రసాయన శాస్త్ర విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రదానం చేస్తు ందన్నారు. దానిలో భాగంగానే డిసెంబర్ 28న, విభాగం ఈ అవార్డ్ ప్రదానోత్సవం జరుగు తుందని ఆచార్య మంజుల భానూరి చెప్పారు. డా.భాను ప్రకాష్‌రెడ్డి ఎన్ఐ ఎన్‌లో సైయింటిస్టుగా, బయోకెమిస్ట్రీ డివిజన్ హెడ్‌గా పనిచేస్తు న్నారు. అయిన గతంలో పలు ప్రతిష్టాత్మక అవార్డ్స్ పొందారు. తెలంగాణ సైన్స్ అకాడమీలో రాష్ట్రంలో సైన్స్ పురోగతికి విశేష కృషి చేస్తున్నారు.

జి.నారాయణమ్మ ఉమెన్స్ కాలేజీలో విజయవతంగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం





నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జి.నారాయణమ్మ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (ఫర్‌ఉమెన్) హ్యుమానిటీస్ మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్, ఐకేఎస్ (ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్) రీసెర్చ్ సెంటర్, సంస్కృత భారతి, తెలంగాణ సహకారంతో "ఎన్ఈపీ-2020 నేపథ్యంలో భారతీయ విజ్ఞాన వ్యవస్థ"పై 6 రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను డిసెంబర్ 18 నుండి23 వరకు నిర్వహించింది. రామ కృష్ణ మఠంలోని వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ డైరెక్టర్ స్వామి బోధ మయానంద మహరాజ్ ముఖ్య అతిథిగా, ముఖ్య వక్తగా ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వివిధవిశ్వవిద్యాలయాల నుంచి నిష్ణాతులైన ప్రొఫెసర్స్ డా.సీఎస్ఆర్.ప్రభు, డా.టీ.మృణాళిని, డా.లోకానంద రెడ్డి, డా.కోరాడ సుబ్రహ్మణ్యం, డా.ఎ.వి. నరసింహారావు (ప్రిన్స్‌పాల్ ఇన్వస్టగేటర్ ఐకేఎస్ రీసెర్చ్ సెంటర్),కె.రూప, డా.జెఎస్ఆర్ ప్రసాద్ తదితరులను ముఖ్య వక్తలుగా ఆహ్వానించారు. వారి సెషన్స్ ద్వారా ప్రాచీన సంస్కృత మాన్యుస్క్రిప్ట్‌లలో హై టెక్నా లజీ, విద్యలోఐకేఎస్ నుంచి జీవన నైపుణ్యాలు, భారతీయ వ్యాకరణ సంప్రదాయం, ప్రవచనాత్మక జ్యోతిషశాస్త్రం అండ్ భారతీయ వేద గ్రంథాల పరిచయం, సర్వశ్రేష్ఠ భారతీయ సంస్కృతి, ఐకేఎస్‌లో భారతీయ మనస్తత్వ శాస్త్రం గురించి అవగాహన కల్పించారు. గణిత సమస్యలను పరిష్కరించడానికి ఉపాయాలు ప్రముఖ ఎడ్యుకేషనల్ సైకాలజిస్ట్ బి.సాయి కిరణ్ వివరి ంచారు. ప్రొఫెసర్ డాక్టర్.సురేష్‌బాబు పురాతన గణి తానికి ప్రస్తుత సాంకేతికతలకు మధ్య ఉన్న సంబంధాన్ని సమగ్ర ఉదాహరణలతో వివరించారు.ఎన్ఈపీ-2020లో కీలకమైన భాగమైన అనుభవపూర్వక అభ్యాసం ప్రాముఖ్య తను ప్రతిబింబించేలా గోల్కొండ కోటకు స్థానిక పర్యట నతో ఎఫ్‌డీపీ ముగిసింది. స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ పి.అపర్ణ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యా పకులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, డాక్టర్ ఎం. మాధవీలత, హెచ్ఓడీ, హెచ్అండ్ఎం తదిత రులు చొరవచూపడం,వి.జాహ్నవి,కో-కన్వీనర్లు విజయలక్ష్మి, డాక్టర్ నరసింహారావులను అభినందించారు. ఎన్ఈపీ- 2020 ఫ్రేమ్‌వర్క్‌లో భారతీయ నాలెడ్జ్ సిస్ట మ్‌పై లోతైన అవగాహన కోసం చర్చలు, అన్వేషణ పెంపొందించడంతో ఎఫ్‌డీపీ విజయవంతమైందని ఈ సందర్భంగా తెలియజేశారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-ఓయూ

హాబ్సి గూడ డివిజన్‌కి చెందిన స్థానికులు అద్దంకి సుభద్ర కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో స్వర్గసులయ్యారు. ఆదివారం వారి కుమారుడు అద్దంకి యాకంత్‌రావుని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిసి పరామర్శించారు. తమ వంతు సహకారాన్ని అందిస్తామన్నారు.

ఐఏఏ అధ్యక్షుడుగా ప్రొ.వి.అప్పారావు



నవతెలంగాణ-ఓయూ

"ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ (ఐఏఏ) సీనియర్ ప్రెసిడెంట్‌గా ప్రొ. వి. అప్పారావు నియమి తులయ్యారు. ఓయూ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో కామర్స్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ప్రొ.వి. అప్పారావు 45వ, ఐఎఎ కాన్ఫ రెన్స్ సందర్భంగా ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ (ఐఏఏ) సీనియర్ ప్రెసిడెంట్‌గా ఎన్నిక య్యారు. త్రివేంద్రంలో జరిగిన అఖిల భారత సదస్సుకు సుమారు వెయ్యి మంది ప్రతినిధులు హాజరయ్యారు. గతంలో అయిన ఐఎఎ పలు బాధ్యతలు నిర్వహించారు. ఇక ఓ యూలో హెడ్, బిఓఎస్‌గా, డీన్, ప్రిన్సిపల్‌గా, డెరైక్టర్‌గా బాధ్యతలు నిర్వ హించారు. ప్రస్తు తం ఓయూ ఈసీ సభ్యులుగా ఉన్నారు. ప్రొ.అప్పా రావుకు సభ్యులు, ఆచార్యులు విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఐఎఎ అభ్యున్నతికి కోసం కృషి చేస్తానని ఆయన చెప్పారు.

డ్రయినేజీ సమస్యను పరిష్కరిస్తాం

చెరుకుపల్లి భరత సింహారెడ్డి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలో గాయత్రీ నగర్‌లో (టీఎస్ఆర్ గార్డెన్స్) డ్రయినేజీ సమస్య పరిష్కారానికి త్వరలో అవసరమైన చోట కొత్త పైప్ లైన్లు ఏర్పాటు చేయనున్నట్లు బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి తెలిపారు. ఆదివారం భరత సింహారెడ్డి, స్థానికులతో కలిసి గాయత్రి నగర్‌లో పర్యటించి, స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం భరత్ సింహారెడ్డి మాట్లాడుతూ డ్రయినేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వెంటనే పైప్ లైన్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రకాష్, పి.సాయిలు, జైల్సింగ్, రాజేందర్ రెడ్డి, మధుసూధన్, మధు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

కిషన్ రెడ్డికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన క్రైస్తవ మహిళలు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

నేడు క్రిస్మస్ వేడుక సందర్భంగా బోరబండ క్రైస్తవ మహిళలు ఆదివారం కేంద్ర బీజేపీ మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిటీ సెంట్రల్ ఆఫీసులో, బోర బండకు చెందిన క్రైస్తవ మహిళలు షర్మిల జాదవ్(స్టేట్ గిరి జన మోర్చా మహిళా కోకన్వీనర్) పాస్టర్ అమ్మ రత్నమ్మ, ప్రస న్న, నక్షత్ర జాదవ్, బ్రదర్ క్రాంతి స్వరూప్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సమావేశంలో పాల్గొన్న వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఎస్పీ



హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ఆదివారం నిర్వహించిన కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి పాల్గొన్నారు.
నవతెలంగాణ-వికారాబాద్ ప్రతినిధి

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA

సోమవారం | డిసెంబర్ 25, 2023 | www.navatelangana.com

క్రిస్మస్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-బంట్వారం

నేడు క్రిస్మస్ పండుగ

- ముస్తాబైన చర్చిలు, ప్రార్థన మందిరాలు

నవతెలంగాణ-రంగారెడ్డి డెస్క్

క్రిస్మస్ అంటే రెండు పదాల కలయికతో ఏర్పడింది. ఆంగ్లంలో క్రైస్తు, మాస్ అనే పదాలతో ఈ పండగను పిలుస్తారు. నేడు క్రిస్మస్ వేడుకలకు ఉమ్మడి జిల్లాలలోని చర్చిలు ప్రార్థన మందిరాలు ముస్తాబైనాయి. క్రైస్తవుల కళ్ళల్లో మెరుపు కనిపిస్తూ వారి గుండెల నిండా ఆరాధన భావం వెలివేస్తే సంబరమైన రోజు నేడు. ఈ సందర్భంగా నవతెలంగాణ కథనం.

ప్రధాన పండుగగా...

చారిత్రాక వేత్తల సమాచారం మేరకు క్రీస్తు శకం 336 లో ప్రభాతమంగా క్రిస్మస్ను డిసెంబర్ 25న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకున్నారని మతగురువులు తెలుపుతున్నారు. మానవజాతిని రక్షించేందుకు దేవుడు యేసు క్రీస్తు రూపంలో జన్మించాడని విశ్వసిస్తూ ఈ పర్వదినాన్ని నిర్వహిస్తున్నారు. 1100 సంవత్సరం నుండి యూరప్‌లో క్రిస్మస్‌ను ప్రధాన పండుగగా చేసుకోవడం విశేషం.

క్రిస్మస్ తాత

క్రిస్మస్ రోజున చిన్నారులతో క్రిస్మస్ తాత వచ్చి సరదాగా ఆడుకుంటాడని వారికి బోలెడు బొమ్మలు చాక్లెట్లు ఇస్తాడని చిన్నారులు అతని కోసం ఆశగా ఎదురు చూస్తుంటారు. నిజానికి రాత్రిళ్ళు చిన్నారులు నిద్రపోగానే వారి పక్కన గిఫ్టులు ఇచ్చి వెళుతుంటాడు. తర్వాత సంబురాల్లో వారొక చక్కని డ్రెస్సు, తెల్లటి గడ్డం పెట్టుకొని చిన్న పెద్ద అందరిని అలరిస్తాడు క్రిస్మస్ తాత.

కొవ్వొత్తులు వెలిగిస్తూ...

ప్రపంచం అంధకారంలో ఉందని ఏసుప్రభు ఆ చీకటిని దూరం చేసేందుకు జన్మించారని చాటేలా ప్రత్యేకంగా కొవ్వొత్తులను వెలిగిస్తారు. చిమ్మ చీకటిలో చర్చిలో కొవ్వొత్తులను వెలిగించి 8 బైబిల్ సూక్తులు, తొమ్మిది పాటలను ఆలపిస్తూ



క్రైస్తవ సోదరులు జాగరణలో పాల్గొంటారు. ఆదివారం అర్ధరాత్రి వరకు జాగరణ రాత్రికి పాటిస్తారు.

క్రిస్మస్ ట్రీ.. క్రిస్మస్ స్టార్..

ప్రకృతిని కూడా ఆరాధించే క్రిస్మస్ పండగ రూపుదిద్దుకుంటుంది. ప్రధానంగా క్రిస్మస్ ట్రీ గా వ్యవహరించే చెట్లను అందంగా అలంకరిస్తారు. పూర్వం చెట్లను పూజించేవారు. క్రిస్మస్ చెట్లను ప్యారడైజ్ ట్రీగా కూడా వ్యవహరిస్తారు. ప్రతీ నిత్యం పచ్చగా ఉంటూ ప్రజలను సంతోషంగా సుఖంగా ఉంచుతుందని విశ్వసిస్తారు. ఈ చెట్లకు ఎర్రని ఆపిల్ పళ్లను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు నక్షత్రాలతో అలంకరించే ఆనవాయితీ నేటికీ క్రిస్మస్ రోజుల్లో కొనసాగుతోంది. క్రిస్మస్‌కు ప్రారంభం ముందు నుంచే క్రైస్తవులు తమ ఇళ్లపై నక్షత్ర ఆకృతులను అలంకరించుకుంటారు. క్రీస్తు రాకను కాంక్షిస్తూ క్రైస్తవ ప్రార్థన మందిరాలు, ఇండ్లపై అలంకరించటం ఒక సాంప్రదాయంగా నేటికీ కొనసాగుతున్నది.

ఉమ్మడి జిల్లాల్లో ముస్తాబైన చర్చిలు..

క్రైస్తవులు అత్యంత పవిత్రంగా భావించే క్రిస్మస్ సంబురాలకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని చర్చిలు ముస్తాబు అయినవి. జిల్లాలో ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లోని చర్చిలలో క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరుపుకుంటారు. ఇప్పటికే వివిధ చర్చిల నిర్వహణ కమిటీలు, క్రైస్తవ సంఘాలు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు భారీ ఎత్తున సన్నాహాలు చేశారు. చర్చిలను ఆకర్షణీయమైన రంగులు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. మరికొన్ని చర్చిలలో ఏసుక్రీస్తు జన్మించిన పశువుల పాకల సెట్టింగ్లతో పాటు మేరీమాత, జీసస్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం చేశారు.





రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతి హొలీకేరీ బదిలీ

- మేడ్చల్ కలెక్టర్ గౌతమ్‌కు రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలు
- జీఏడీలో రిపోర్ట్ చేయనున్న భారతి హొలీకేరీ





నవతెలంగాణ రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతి హొలీకేరీని జీఏడీకి బదిలీ చేస్తూ, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి బాధ్యతలు కేటాయి స్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎలక్షన్ సమ యంలో ఐఏఎస్ అధికారుల బదిలీలో భాగంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతల నుంచి హరీష్ ఐఏఎస్‌ను బదిలీ చేస్తూ.. ప్రభుత్వం భారతి హొలీకేరీకి బాధ్యతలు అప్పగించింది. ఈ రెండు నెలల పాటు ఎన్నికల విధులు నిర్వహించడం.. తప్ప పరిపాలన విధులపై పెద్దగా దృష్టి సారించలేదు. ఇటీవల ధోరణిలో జరిగిన అవకతవకలతో ప్రభుత్వం తనపై సీరియస్ అయింది. ఇందులో భాగంగానే రంగారెడ్డి జిల్లా కలెక్టర్ బాధ్యతల నుంచి బదిలీ చేస్తూ జీఏడీకి అటాచ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కొడంగల్‌ను జిల్లాగా ప్రకటించాలి

- ప్రజాసంఘాల డిమాండ్



నవతెలంగాణ- కొడంగల్

కొడంగల్ నియోజకవర్గాన్ని జిల్లాగా ప్రకటించాలని భారత్ ముక్తి మోర్చ, బహుజన్ క్రాంతి మోర్చా నాయకులు అన్నారు. కొడంగల్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో బహుజన ముక్తి మోర్చా, బహుజన్ క్రాంతి మోర్చా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య నాయక్ మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి, వలసలు నివారించడంలో ఆమడ దూరంలో ఉందన్నారు. కొడంగల్ నియోజకవర్గ ప్రాంతంను జిల్లా కేంద్రం ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి తాలూకా తార్య నాయక్, దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం సాయిలు, సామ్యనాయక్, నర్సింగ్, రమ్యనాయక్, పరుశురాం, బాలు, గోవింద్, రవి, లోక్య నాయక్, రమేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం ప్రకటన

నవతెలంగాణ-చేవెళ్ల

చేవెళ్ల మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం పరిధిలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం పక్కన దేవస్థానంనకు చెందిన ఖాళీ స్థలము సుమారు 180 గజములు బహిరంగ వేలం వేయనునట్టు దేవాలయ ఈవో నరేందర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మూడేండ్ల కాల పరిమితితో సదరు స్థలంలో వివిధ వ్యాపారం చేసుకొనుటకు గాను నెల అద్దె (లీజు)కు ఇచ్చేందుకు, అయ్యప్ప దేవాలయం పక్కన గల షాపులు తూర్పుభాగం ఉన్నాయన్నారు. 2 పడమర భాగం కలవి 2 నెలవారీ అద్దెకు లీజుకు ఇచ్చేందుకు ఈనెల 30న ఉదయం 11.00 గంటలకు దేవస్థాన ప్రాంగణంలో వేలం ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు రూ.10,000/(ఖాళీస్థలంనకు) డిపాజిట్ చెల్లించి, ఒక షాపుకు రూ.5,000 డిపాజిట్ చెల్లించి షరతులకు లోబడి బహిరంగ వేలం ప్రక్రియలో పాల్గొనాలని ఆయన సూచించారు.

ఎంజీఐటీ విద్యార్థులకు జేఎన్టీయూ బంగారు పతకాలు









నవతెలంగాణ-గండిపేట

గండిపేటలోని మహాత్మా గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో వివిధ విభాగాలకు చెందిన నలుగురు విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. జేఎన్టీయూ పరిధిలో అకాడమిక్ ఎక్సలెన్సీకి గాను ఐదు బంగారు పతకాలను సాధించారు. కుమారి పానుగంటి సుస్మిత వాణి రెండు పతకాలను సాధించింది. ఒకటి జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలలో బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ అఫ్ బి.టెక్. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, రెండవది పిసుపాటి సుప్రియ దేశాయ్ గోల్డ్ మెడల్, కోట రోహిత్ రాజ్, జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలలో బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ అఫ్ బి.టెక్. మెకానికల్ ఇంజనీరింగ్ (మెకాట్రానిక్స్) విభాగంలో, గబ్బిట ప్రణవ్ జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలలో బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ అఫ్ బి.టెక్. మెటలర్జికల్, మెటీరియల్స్ విభాగంలో సామంతపూడి అనంత్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలలలో గణితం-ఐలో అత్యధిక మార్కులు సాధించినందుకు గాను, లేట్ ప్రొఫెసర్ జి.పురుషోత్తం మెమోరియల్ ఎండోమెంట్ గోల్డ్ మెడల్‌ను గెలుచుకున్నారు. ఈ బంగారు పతకాలను విశ్వవిద్యాలయ 12వ స్నాతకోత్సవంలో విద్యార్థులకు ప్రదానం చేస్తారు. విజేతలకు కాలేజ్ యాజమాన్యం, ప్రిన్సిపాల్, స్టాఫ్, ఇతర విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.



సమస్యలు ఉంటే వినియోగదారుల సేవ కేంద్రంలో ఫిర్యాదు చేయాలి

- అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సత్యనారాయణ రెడ్డి





నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్

వినియోగదారులకు ఎలాంటి సమస్య ఉన్నా వినియోగదారుల సేవ కేంద్రంలో ఫిర్యాదు చేయాలని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ధరూర్ మండలం అంతారం గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు ఏడీఈ సత్యనారాయణరెడ్డి, ఏఈ వేణుగోపాల్ రెడ్డి సిబ్బందితో ప్రజలను కలిసి విద్యుత్తు సమస్యలు తెలుసుకున్నారు. పంట పొలాల్లో కూడా సందర్శించారు. వేలాడుతున్న తీగలను గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు ఇవ్వడంతో ఇంటర్ పోల్స్ వేశామని తెలిపారు. ఇకముందు ఎలాంటి సమస్యలు ఉన్నా వికారాబాద్ ఏడీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్రంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. త్వరితగతిన సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని తెలిపారు. అలాగే విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఐసీబీఎం 16వ స్నాతకోత్సవం





- ముఖ్య అతిథిగా హాజరైన ఆర్టీసీ ఎండీ సజ్జనార్
- సమాజం, దేశం కోసం పనిచేయాలని సజ్జనార్ పిలుపు
- ఐసీబీఎం క్రమశిక్షణకు మారుపేరు
- కాలేజీ చైర్మన్, ప్రొఫెసర్ జరార్

నవతెలంగాణ-రాజేంద్రనగర్

నేటి యువత ఏ రంగంలోనైనా రాణించడానికి అనేక సవాళ్లను ముందుగా ఎదుర్కోవాలని, సమాజం, దేశం కోసం పనిచేయాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఉప్పరపల్లిలో ఐసీబీఎం 16వ స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సజ్జనార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 2021-2023 సంవత్సరానికి సంబంధించి 150 మంది విద్యార్థులకు ఐసీబీఎం చైర్మన్ ప్రొఫెసర్ జరార్‌తో కలిసి సజ్జనార్ విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఒక జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని దాన్ని సాధించడానికి నిరంతర కృషి చేయాలని ఆయన అన్నారు. 34 ఏండ్లుగా కాలేజీని విజయవంతంగా కొనసాగిస్తున్న చైర్మన్ ప్రొఫెసర్ జరార్, రీతు జరార్, జితేందర్‌ను ఆయన అభినందించారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని అన్నారు. ఈ కాలేజీలో చదివిన ప్రతి విద్యార్థికీ వందశాతం జాబ్ గ్యారెంటీ రావడం అదృష్టంగా భావించాలన్నారు. ఈ కాలేజీలో చదివిన ఎంతో మంది విద్యార్థులు వివిధ రంగాల్లో అత్యున్నత స్థానంలో ఉన్నారని తెలిపారు. పతి విద్యార్థి ఏ ఉద్యోగానికి వెళ్లినా మొదట అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని వాటన్నిటిని దృఢ సంకల్పంతో ఎదుర్కొని ముందుకు సాగితే అత్యున్నత స్థానంలో ఉంటామని స్పష్టం చేశారు. తను ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు చేపట్టినప్పుడు తనకు అనేక సమస్యలు స్వాగతం పలికాయని తెలిపారు. ఒక్కొక్క సమస్యను ఒక్కొక్క రీతిలో పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఆర్టీసీ మొత్తం దివాలా తీసి ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ఉంటే ఇప్పుడు వాటన్నిటినీ అధిగమించి లాభాల్లోకి తీసుకొస్తున్నామని చెప్పారు, గతంలో కార్మికులకు ఒకటవ తేదీ కూడా జీతాలు ఇచ్చే పరిస్థితిలో ఆర్టీసీ లేదని గుర్తు చేశారు. తను వచ్చిన తర్వాత ఆర్టీసీలో సమూలాల మార్పులు చేశానని తెలిపారు. ప్రజల వద్దకు ఆర్టీసీ, గమ్యం యాప్, ఆర్టీసీ కార్మికుల కోసం ప్రత్యేక బీమా ఆరోగ్యం వంటి అంశాలలో ప్రత్యేక శ్రద్ధ వహించి ముందుకు సాగడం ద్వారా వచ్చే ఫలితాలు వచ్చాయని తెలిపారు. అదేవిధంగా ఆర్టీసీ కార్మికులకు వివిధ రకాల శిక్షణా కార్యక్రమాలు ఇచ్చి ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేసినట్లు వివరించారు. ఆర్టీసీలోని 50 వేల మంది ఉద్యోగులకు యాప్ ద్వారా మీటింగ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సంస్థ ఆర్థిక పరిస్థితి వివరించి భవిష్యత్తులో చేయవలసిన కర్తవ్యాల గురించి వివరించినట్లు తెలిపారు. అదేవిధంగా ఆర్టీసీ ద్వారా వివిధ రకాల వ్యాపారాలను కూడా ప్రారంభించి లాభాలు తీసుకొచ్చామన్నారు. నిత్యం విద్యార్థులు పుస్తకాలు బాగా చదవాలని సూచించారు. మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఎప్పుడు నిర్లక్ష్యం చేయొద్దని తెలిపారు.

ఐసీబీఎం క్రమశిక్షణకు మారుపేరు : చైర్మన్, ప్రొఫెసర్ జరార్

ఐసీబీఎం కాలేజ్ క్రమశిక్షణకు మారుపేరని కాలేజ్ చైర్మన్ ప్రొఫెసర్ జరార్ అన్నారు. ఈ కాలేజీలో చదివిన విద్యార్థులు అనేక రంగాల్లో ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీలో ఉన్నత స్థానంలో ఉన్నారని ఆయన గుర్తు చేశారు. తమ కాలేజీలో మొదట క్రమశిక్షణకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని తద్వారా భవిష్యత్తులో విద్యార్థులకు ఆ రంగాల్లో రాణించడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇందులో చదివిన ప్రతి విద్యార్థికీ కచ్చితంగా ఉద్యోగం లభిస్తుందని స్పష్టం చేశారు. తమ కాలేజీలో చదవడానికి ఇ తర రాష్ట్ర విద్యార్థులు పెద్ద సంఖ్యలో వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ కిరణ్ నేటి, సుమన్ సుగుణ, సురేష్, డైరెక్టర్లు రీతు జరార్, జితేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోకి కొడంగల్ వెళ్లానుందా?

- నియోజకవర్గ వ్యాప్తంగా జోరుగా చర్చ
- మహబూబ్‌నగర్‌లోకి వెళ్తే జోగులాంబ జోన్ పరిధిలోకి..
- చార్మినార్ జోన్‌లోనే ఉంటే నిరుద్యోగులకు మేలు
- అయోమయంలో స్థానికులు
- వికారాబాద్ జిల్లాలోనే కొనసాగాలని మేధావులు, విద్యార్థుల అభిప్రాయం



నవతెలంగాణ-కొడంగల్

కొడంగల్ నియోజకవర్గం ప్రస్తుతం వికారాబాద్ జిల్లాలో కొనసాగుతోంది. గతంలో ఈ నియోజకవర్గం ఉమ్మడి మహబూబ్‌నగర్ పరిధిలో ఉండేది. అయితే గత ప్రభుత్వం నూతన జిల్లాలను ఏర్పాటు చేసిన విషయం విధితమే. ఇందులో భాగంగా కొడంగల్ నియోజకవర్గం వికారాబాద్ జిల్లా పరిధిలోకి వచ్చింది. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తరువాత కొత్త చర్చ తెరపైకి వచ్చింది. మళ్లీ కొడంగల్ నియోజకవర్గాన్ని మహబూబ్‌నగర్‌లో కలుపుతారనే చర్చ నియోజకవర్గ వ్యాప్తంగా జోరుగా సాగుతోంది. దాంతో స్థానికులు ఆయోమ యానికి గురవుతున్నారు.

రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధి కారంలోకి రావడం.. కొడంగల్ నియోజకవర్గం నుంచి ప్రతినిధ్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావ డంతో కొడంగల్ నియోజకవర్గానికి ప్రాధాన్యత పెరి గింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభించింది. అ యితే సాధారణంగా కొడంగల్ ముఖ్యమంత్రి నియోజ కవర్గం కావడంతో గతంలో కంటే వేగంగా అభివృద్ధి జరుగుతుందని, ఇక తమ కష్టాలు ఉండవని ఇక్కడి ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు. ప్రజలు అనుకున్నట్టు గానే సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో ఇటీవల సీడీఎంఎంఏ డైరెక్టర్ హరిచందన నియోజకవర్గంలో పర్యటించారు. నియోజకవర్గ అభివృద్ధిపై స్థానిక అధికారులతో చర్చిం చారు. పలు సలహాలు సూచనలు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్న ఇప్పుడు కొత్త అంశం తెరపైకి రావడంతో నియోజకవర్గ ప్రజల్లో గందరగోళం నెలకొంది.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
సోమవారం | డిసెంబర్ 25 2023 | www.navatelangana.com


సుస్వర గాయని గాయత్రి నారాయణ



నవతెలంగాణ-కల్చరల్

స్వరంలో లాలిత్యం భాష ఉచ్చారణలో స్పష్టతతో గాయత్రి నారాయణ ఏ పాట నైనా అలవోకగా ఆలపించగలరని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం ప్రశంసించారు. శ్రీ త్యాగరాయ గానసభలోని ప్రధాన వేదికపై శ్యామ గాయత్రి మ్యూజిక్ అకాడెమీ దశమ వార్షికోత్సవం వేడుకల సంగీత భరితం గా జరిగాయి. చిల్ల శివ పార్వతి శిష్య బృందం పలు పాటలను గానం చేసి శ్రోతలను రంజింప జేశారు అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వోలేటి పార్వతీశం పాల్గొని గాయని గాయత్రి నారాయణ ను వాణీ జయరాం జీవిత సాఫల్య పురస్కారం తో సుస్వర మంజరి బిరుదును ప్రదానం చేశారు. సమాజ సేవకుడు చిల్ల రాజశేఖర రెడ్డి అధ్యక్షత వహించిన సభలో కళా పోషకులు వెంకట రెడ్డి, గాయకులు త్రినాథ రావు, బృందా వనం సుబ్రహ్మణ్యం,రామ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొనీ శివ పార్వతిని గాయత్రి నీ అభినందించారు.

గోవును పూజించటంలో అంతరార్థం ఉంది



నవతెలంగాణ-కల్చరల్

గోవును పూజించటంలో అంతరార్థం వుందని చిన్న జీయర్ స్వామి అన్నారు. ముచింటల్ లోని స్వామి ఆశ్రమంలో డాక్టర్ నిట్టల్‌గోపాల కృష్ణ రచించిన గోమాత అద్భుత శక్తి గ్రంథాన్ని చిన్న జీయర్ స్వామి ఆవిష్కరించి మాట్లాడారు ఈ గ్రంథం ప్ర చారం లోకి రావాలని సూచిం చారు తిరుమల గ్రూపు చైర్మన్ నంగునూరి చంద్ర శేఖర్ ర చయిత్రి డాక్టర్ చిల్లర భవానీ దేవి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలి

- డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి జావేద్



నవతెలంగాణ - ముషీరాబాద్

హైదరాబాద్ నగరంలో ఆర్టీసీ బస్సుల సంఖ్య పెం చా లని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి జావేద్ డిమాండ్ చేశారు. ఆది వారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. గ్రేటర్ హైదరా బాద్ నగరంలో ప్రతిరోజు 40లక్షల మంది ప్రయాణికులు బస్సుల లో ప్రయాణిస్తున్నారని అన్నా రు. ప్రయాణికులకు అనుగుణ ంగా బస్సులు లేక మహి ళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ప్రతిరోజు బస్సులలో విద్యార్థులు, ప్రైవేటు ఉద్యోగులు, కాలేజీలకు ఉద్యో గులకు వెళ్లే సందర్భంలో బస్సు లు సహకాలంలో అధిక రద్దీతో వెళ్తుండడంతో ప్రయాణి కులకు విద్యార్థులకు ఉద్యోగస్తులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నారని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సుల సంఖ్యను పెంచి ప్రయాణికులకు అందు బాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

బాల్యమిత్రులకు ఆత్మీయ సత్కారం



- బాల్య మిత్రులకు అభినందన

నవతెలంగాణ-అంబర్‌పేట

బాల్యస్నేహం విడదీయరాని బంధమనీ ఎన్నాళ్ళయినా ఎన్నేళ్లయినా ఆరోజులు మరు పురానివనీ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ రామంతాపూర్ పూర్వ విద్యార్థులు మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. హైదరాబాద్ బేగంపేట్‌లోని లైఫ్‌స్టైల్ బిల్డింగ్ టెన్ డౌనింగ్ స్ట్రీట్ హాల్‌లోపూర్వవిద్యార్థుల అభినందన సభ జరిగింది. హైదరాబాద్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ సాయిప్రసాద్‌రెడ్డిని బాల్య మిత్రులు అభినందించారు. ఈ సమావేశంలో ఇండస్ట్రియలిస్ట్‌లు కళ్యాణ్ చక్రవర్తి, గద్వాలబాబిరెడ్డి, జయంత్, ఎయిర్ ఫోర్స్ గ్రూప్ కెప్టెన్ విజయ్, ప్రముఖ న్యాయవాదులు, పారిశ్రామిక వేత్తలు, విశ్రాంత సైనిక అధికారులు, ఉన్నతోద్యోగులు పాల్గొనితమ చిన్న నాటి అనుభవాలను గుర్తు చేసుకున్నారు.

రక్తదానమే ప్రాణదానం : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

రక్తదానమే ప్రాణదానమని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని ఏకదంతా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిర కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమాజ సేవలో ముందుకు నడవాలని ప్రతి ఒక్కరూ సంవత్సరానికి రెండు సార్లు అయినా రక్తదానం చేయాలని దాని వల్ల ఎంతో మందికి మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పద్మ వెంకట్ రెడ్డి, నాయకులు దిలీప్ రాజ్, రమేష్ నాయక్, మిరియాల శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఉమ్మడి వ్యవసాయం వైపు
రైతులను సన్నద్ధం చేయాలి



- పౌరహక్కుల ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.బాలకిషన్ రావు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

కార్పొరేట్ వ్యవసాయానికి స్వస్తి పలికి ఉమ్మడి వ్యవసాయం వైపు రైతులను సన్నద్ధం చేయాలని పౌర హక్కుల ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్. బాల కిషన్ రావు సూచించారు.అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంలో భాగంగా పౌర హక్కుల ప్రజా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్యాలయంలో "రైతుల ప్రాథమిక హక్కులు" అనే అంశంపై సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా బాలకిషన్ రావు మాట్లాడుతూ రైతులకు రైతు బంధు స్థానంలో గిట్టుబాటు ధర, గిడ్డంగులు, బ్లాక్ మార్కెట్లను కంట్రోల్ చేస్తే బాగుంటుందని సూచించారు. ధరణి పోర్టల్ లో దొర్లిన తప్పులను సరి చేస్తే సరిపోతుందన్నారు.వ్యవసాయ దిగుబడులను పెంచే విధంగా ప్రభుత్వాలు కృషి చేస్తే రాష్ట్రంలో రైతులకు నష్టాలు, ఆత్మహత్యలు ఉండవన్నారు.రైతు సంక్షేమ కమిటీలను గ్రామస్థాయి వరకు ఏర్పాటు చేయాలని, ఆ కమిటీల ద్వారా అన్ని రైతు సంక్షేమ కార్యకలాపాలు జరిపించాలని కోరారు.అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయ వింధ్యాల మాట్లాడుతూ రైతు సంక్షేమం అంటే ఆర్థిక సహాయం చేస్తే సరిపోతుందని ప్రభుత్వాలు భావిస్తున్నాయని, కానీ ఇది సమంజసం కాదని, రైతులు పండించే పంటకు రక్షణ కల్పించి, మార్కెట్ లో నకిలీ విత్తనాలు, నకిలీ మందులను అరికట్టాలని సూచించారు.రైతు సంక్షేమ నిధిని ఆయా గ్రామ పంచాయతీలలో ప్రవేశపెట్టాలని, ఈ నిధిని రైతులకు అకాల విపత్తులు సంభవించినప్పుడు, అనారోగ్యానికి గురయ్యే రైతులను ఆదుకునే విధంగా, వారి పిల్లల చదువు నిమిత్తం ఉపయోగించే విధంగా చర్యలు ఉండాలని సూచించారు.నాగార్జున సాగర్ ముంపుకు గురైన 378 కుటుంబాలకు పునరావాసం కింద ఇచ్చిన 2000 ఏకరాల భూమికి 70 ఏళ్లు గడుస్తున్న ఆనాటి జీవో నేటికీ అమలు చేయలేదన్నారు.ఈ విషయంలో రైతులు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న అధికారులకు రైతులపై దయ కలగడం లేదని, గత ప్రభుత్వ ముఖ్యమంత్రి స్వయంగా అసెంబ్లీలో ఈ సమస్య గురించి మాట్లాడిన సమస్య పరిష్కారం కాలేదన్నారు.కనీసం ఇప్పుడైనా నూతన ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి విఠల్ రావు, ఉపాధ్యక్షులు దామోదర్ రెడ్డి, జై స్వరాజ్య పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ రావు, జనతా వికాస్ అధ్యక్షులు హరిత్ రూథ, గుర్రంబోడు భూ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు బాలాజీ నాయక్, నాయకులు ఇక్బాల్ ఖాన్, బండి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలి

- నూతన టీపీసీసీ బాధ్యులు దీపదాస్ మున్షికి ఆళ్ల రామకృష్ణ వినతి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

గత పది సంవత్సరాలుగా బీఆర్ఆర్ పాలనలో దగాపడ్డ బీసీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత ఓబీసీ హక్కుల పరిరక్షణ వేదిక అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ నూతన టీపీసీసీ బాధ్యులు దీపదాస్ మున్షిని ఆదివారం ఢిల్లీలో ఆమె నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ బాధ్యులుగా నూతనంగా నియమించబడ్డ దీపదాస్ మున్షిని శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు.దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలు ఎదుర్కొంటున్న విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, ఉపాధి పరిస్థితులపై సమగ్ర పరిశీలన నివేదికను ఆమెకు అందజేశారు.తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 26 బీసీ కులాలను రాష్ట్ర బీసీ జాబితా నుండి వివక్షాపూరితంగా తొలిగించిందని, దీని వల్ల తొలగించిన 26 బీసీ కులాల విద్యార్థి, యువత విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో తీవ్రంగా నష్టపోయారని ఆయన వివరించారు.

తొలగించిన 26 బీసీ కులాలను తిరిగి బీసీ జాబితాలో చేరుస్తామని తెలంగాణ కాంగ్రెస్ ఎన్నికల మ్యాని ఫెస్టోలో చేర్చిందని, ఇచ్చిన వాగ్దానం ప్రకారం తొలగించిన 26 బీసీ కులాలను తిరిగి బీసీ జాబితాలో వేంటనే చేర్చాలని అలాగే సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో కులం ఎంతో ప్రధాన పాత్ర పోషిస్తున్నప్పటికీ రాష్ట్రంలో కులగణన జర పకపోగా, విశ్వసనీయ, సమగ్రమైన కులాల డేటా లేదని రాష్ట్రం లో కులగణన వెంటనే నిర్వహించి సంపద, వనరులు, విద్య పం పిణీ వంటివి తగు విధంగా అందించాలని ఆయన కోరారు. దేశంలో కులగణన చేపట్టాలని కోరుతూ తాను సుప్రీంకోర్టులో దావా వేసిన, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మొండిగా వ్యవ హరిస్తూ దేశంలో కులగణన చేపట్టలేమని సుప్రీంకోర్టుకు తెలిపి ందని గుర్తు చేశారు.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తొలగించిన 26 బీసీ కులాల పోరాట సమితి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి విస్తృతంగా ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ విజయానికి దోహదపడ్డ ఆళ్ల రామకృష్ణను ఈ సందర్భంగా దీపదాస్ మున్షి అభినందించారు.

పార్లమెంట్ ఎన్నికలలో రాష్ట్రంలో అత్యధిక స్థానాలలో విజయం సాధిస్తాం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట

రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రం లో భారతీయ జనతా పార్టీ అత్యధిక స్థానాలలో గెలుస్తుం దని రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల మంత్రి, సికింద్రాబాద్ లోకసభ సభ్యులు కిషన్ రెడ్డి అన్నారు. అనంతరం బిజెపి నగర కార్యాల యంలో హైదారాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్. గౌతమ్ రావు అధ్యక్షతన జరిగిన హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశానికి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఇప్పుడు మొత్తం నరేంద్రమోదీ గారి చరిష్మా కొనసాగుతుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. దేశ ప్రజలంతా నరేంద్రమోదీ పాలనను అంగీకరిస్తున్నారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఓబీసీ మో ర్చా జాతీయ అధ్యక్షులు డా. కే. లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఊహకందని రీతిలో బిజెపి అత్య ధిక స్థానాలను తెలంగాణలో గెలుచుకోవడం ఖాయమని ఆయన వివరించారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా.ఎన్. గౌతమ్ రావు మాట్లాడుతూ కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఎంతోమంది పేద ప్రజలు వినియోగించు కున్నారని గౌతమ్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కృష్ణ యాదవ్, ఎన్.వి. సుభాష్, పాపారావు, అట్లూరి రామ కృష్ణ, డా.పద్మ, ఓ.శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

హిందూ విశ్వాసాలను కాపాడగలిగే శక్తి మోడీ ప్రభుత్వానికే ఉంది : పెరిక సురేష్



నవతెలంగాణ-అంబర్‌పేట

హిందువుల మతవిశ్వాసాలను కాపాడగలిగే శక్తి మోడీ ప్రభుత్వానికే ఉందని జాతీయ ఓబీసీ మోర్చా మీడియా సభ్యుడు, ప్రముఖ సామాజిక, ధార్మిక నాయకుడు పెరిక సురేష్ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. హైద రాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ జనవరి 22న అయోధ్యలో జరిగే శ్రీరా ముని ప్రతిష్ఠాపన కోసం సనాతనవాదులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇది సనాతన ధర్మ ప్రేమికుల గొప్ప కల అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అవిశ్రాంత ప్రయత్నాల ఈ కల నెరవేరిందన్నారు. ఫలితంగా ఈ అదృష్టాన్ని చూసే అవకాశం హిందువులందరికీ లభిస్తోందన్నారు. భారతదేశ అత్యుత్తమ ప్రధాన మంత్రిగా గుర్తుండిపోతారని, ఆయన కృషి, వ్యక్తిత్వం చరిత్ర పుటల్లో సువర్ణాక్ష రాలతో లిఖించబడతాయని పెరిక సురేష్ పేర్కొన్నారు.

నూతన పదవి బాధ్యతలు చేపట్టిన రవీందర్ నాయక్

-కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భరత్ సత్యనారాయణ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నూతన వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రవీందర్‌నాయక్‌ను కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భరత్ సత్యనా రాయణ ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లా డుతూ.. వైద్యశాఖ ఉద్యోగుల సమస్యలను డిహెచ్‌కు వివరించామన్నారు. జీఓ నెం,142 నూ రద్దు చేయాలని కోరాం అన్నారు. ఈ సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలోప్రధాన కార్యదర్శి బానోతు నెహ్రూ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాబూలాల్ రాథోడ్ బాలరాజు. రేవన సిద్ధప్ప రామ్మోహన్ చంద్రియ వివిధ జిల్లాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవసమాజ్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శతాబ్ది ఉత్సవాలు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నవసమాజ్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల చెన్నైలో మాజీ ముఖ్యమంత్రులు కర్పూరి ఠాకూర్, కరుణానిధిల శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్బర్ కమ్యూనిటీపై పరిశోధకులు, తమిళనాడు ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు డాక్టర్ రఘుపతి, మధ్యప్రదేశ్ శ్రీ రఘు ఠాకూర్, తెలంగాణ నవసమాజ్ సెక్రటరీ జనరల్ సూర్యనారాయణ, వివిధ రాష్ట్రాల నాయకులు తదితరులు పాల్గొన్నారు



అబిడ్స్‌లోని చర్చిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వసంత పలువురికి క్రిస్మస్ గిఫ్టలను అందజేశారు.

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

దేశంలో బలమైన విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి కృషి చేయాలి



- సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా సెక్రటేరియట్ సభ్యులు కేజీ రామచంద్ర, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్ఎల్ పద్మ

నవతెలంగాణ-ముషీరాబాద్

దేశంలో బలమైన విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి కృషి చేయాలి అని సీపీఐ(ఎంఎల్) ప్రజా పందా సెక్రటేరియట్ సభ్యులు కేజీ రామచంద్ర, ఐఎఫ్‌టీయూయు జిల్లా అధ్యక్షులు ఎస్ఎల్ పద్మ అన్నారు. సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విద్య నగర్ మార్క్స్ భవన్‌లో సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా, పీసీసీ. సీపీఐ(ఎంఎల్) సీపీఐ(ఎంఎల్)ఆర్ఐ విప్లవ పార్టీల విలీన సభ సందర్భంగా పార్టీ జనరల్ బాడీ సమావేశం గ్రేటర్ హైదరాబాద్ సెక్రటరీ కామ్రేడ్ హన్మేశ్ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి ప్రజాపంథ సెక్రటేరియట్ సభ్యులు కేజీ రామచందర్ హాజరై మాట్లాడుతూ. వర్తమాన భారత విప్లవోద్యమం అనేక ఒడుదుడుకులను ఎదుర్కొంటున్నది.సరైన ప్రజాపంథా రూపుదిద్దుకోవడానికి ప్రయాస పడుతున్నది. మారిన పరిస్థితులను సరిగ్గా అంచనా వేసుకోలేకపోయింది అని తెలిపారు .అభివృద్ధి చెందుతున్న దేశ పెట్టుబడిదారీ విధాన విసిరే సవాళ్లను అధిగమించడానికి కమ్యూనిస్టు విప్లవోద్యమం సైతం మార్పులు చేసుకోవాల్సి ఉన్నది.ఆ కృషి కొనసాగింపే ఈ మూడు పార్టీల ఐక్యత. ఈ క్రమం కొనసాగిస్తూ ఈ దేశంలో బలమైన విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతో ఉన్నది. దానికి ఈ మూడు పార్టీల కలయిక. ఐక్యతా సభ ఒక ముందడుగు ఉండాలని సూచించారు. దేశంలో వివిధ రాష్ట్రాల్లో కొనసాగుతున్న మా సిద్ధాంతాన్ని అం గీకరించే పార్టీలతో మాట్లాడుతున్నామని, గత ఏడాది కాలంగా ఈ కృషి కొనసాగుతోంద న్నారు. అందులో భాగమే ఈ కలయిక అన్నారు. ఈ సభలు విజయవంతానికి అందరూ కృషి చేయాలని సభ్యులకు పిలుపు నిచ్చారు.మూడు విప్లవ పార్టీలు మార్చి 3,4, 5 తేదీల్లో ఖమ్మంలో విలీన సభను నిర్వహిస్తున్నాయి. మూడవ తేదీన 20వేల మందితో భారీ ప్రదర్శన, బహిరంగ సభ కొనసాగుతుంది. 4,5 తేదీలలో విలీన మహాసభ కొనసాగుతుంది. ఈ మహాసభల్లో మూడు పార్టీల విలీన ప్రకటన ఉంటుంది.అలాగే పార్టీ పేరును కూడా ప్రకటిస్తామన్నారు.ఈ సమా వేశంలో పీఓ డబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు స్వరూప , కె యస్ ప్రదీప్ పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్ నాగేశ్వర్ రావు పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు, అనిల్, ప్రవీణ్, రవి, నల్లన్న, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

ఎన్ కన్వెన్షన్‌లో "డెస్టినీ" న్యూ ఇయర్ వేడుక

- వినూత్న రీతిలో 4 మ్యూజిక్ స్టేజ్‌లు
- 8 మంది ఆర్టిస్టులతో మరుపురాని సంగీతోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

నూతన సంవత్సర వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు హైదరాబాద్ నగరం సిద్ధం అవుతోంది. ఈ మేరకు ఈవెంట్ మానేజ్మెంట్ సంస్థలు వినూత్న రీతిలో కొత్త సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రెడీ అవుతున్నాయి. ఇలా ఈ రంగంలో 12 ఏండ్లకు పైగా అనుభవం ఉన్న నగరానికి చెందిన యువకులు డెస్టినీ పేరిట న్యూ ఇయర్ పార్టీ వేడుకలను నిర్వహించనుంది. దీనికి సంబంధించిన పోస్టర్ విడుదల కార్యక్రమం మాదాపూర్‌లోని ఐరన్ హిల్ కేఫ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఐశ్వర్య సాయి, చుండూరి ఫణి, వినీత్ బల్లి, వరుణ్ విహార్ వివరాలను వెల్లడించారు. నిర్వాహకులు చందూరి ఫణి, వరుణ్ విహార్ డెస్టినీ న్యూ ఇయర్ మ్యూజిక్ ఫెస్టివల్ గురించి తమ ఉత్సాహాన్ని పంచుకున్నారు. ఇది మరపురాని నూతన సంవత్సర అనుభవానికి అంతిమ గమ్యస్థానంగా ఉంటుందన్నారు. ఈ ఫెస్టివల్ హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలోని ఎన్ కన్వెన్షన్‌లో జరుగుతుందన్నారు. బ్యాండ్ నిరావల్, డిజె పరోమా, కొలిషన్‌తో సహా 8 మంది కళాకారులతో ఆకట్టుకునే లైనప్‌ను కలిగి ఉంటుందన్నారు. ఇవి 4 స్టేజ్‌లలో ప్రదర్శించబడే 4 విభిన్న కళా ప్రక్రియల్లో విస్తరించి ఉన్నాయని తెలిపారు. ఈ దశలు తెలుగు లైవ్ బ్యాండ్‌లు, బాలీవుడ్, టెక్నో, హిప్ హాప్‌లను కలిగి ఉంటాయని పేర్కొన్నారు. "డెస్టినీ న్యూ ఇయర్ మ్యూజిక్ ఫెస్టివల్ కేవలం క్లబ్ పార్టీ మాత్రమే కాకుండా హాజరైన వారందరికీ అసాధారణమైన అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఇది పూర్తి స్థాయి సంగీత ఉత్సవం" అని నిర్వాహకులు తెలిపారు. బుక్‌మై షో, పేటీఎం ఇన్‌సైడర్ వంటి ప్రముఖ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా బుకింగ్ చేయడానికి పాస్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రత్యామ్నాయంగా, ఆసక్తి గల వ్యక్తులు విచారణలు, బుకింగ్‌ల కోసం "ప్రసవం-"అఅఖుఖుటం వద్ద ఇన్‌స్టాగ్రామ్ ద్వారా నిర్వాహకులను సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమానికి బి.పద్మావతి (మిసెస్ ఇండియా గ్లోబల్ అంబాసిడర్, మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ విజేత, చార్మింగ్), సుధా నాయుడు (మిసెస్ ఇండియా తెలంగాణ కిరీట విజేత, కలర్స్ అకాడమీ మ్యానింగ్ పార్టనర్, సోషలిస్ట్), నున్నా రాజీ తనూజ (మిసెస్ ఎంటర్‌ప్రైజింగ్ తెలంగాణ-2021, తనుస్ లగ్జరీ వ్యవస్థాపకురాలు, సేవా ఎన్జీవోలో సామాజిక కార్యకర్త) ప్రత్యేక అతిథులుగా హాజరు కానున్నారు.

నిగనిగలాడే కురుల కోసం...

జుట్టు అందంగా, నల్లగా నిగనిగలాడుతూ ఉండాలని అందరూ కోరుకుంటారు. అయితే కొందరికి మాత్రమే అటువంటి జుట్టు ఉంటుంది. కానీ కాస్త ఓపిక చేసుకుంటే అందరూ అలాంటి జుట్టును పొందవచ్చు. ఇందుకోసం బయటి నుండి ఎటువంటి షాంపూలు, కండిషర్‌లు కొనుక్కు రానవసరం లేదు. ఇంటి పెరటిలో ఉండే మందారాలతోనే అటువంటి జుట్టు సొంతం చేసుకోవచ్చు. అందుకోసం చేయాల్సినవి...

- మందార పువ్వులతో హెయిర్ ప్యాక్ వేసుకోవడం ద్వారా జుట్టు వత్తుగా పెరుగుతుందని.. జుట్టు రాలే సమస్యలుండవని బ్యూటీషియన్లు అంటున్నారు.
- మందార పువ్వులు, మందార ఆకులు జుట్టుకు మంచి కండిషనర్‌గా పనిచేస్తాయి.
- ఇవి జుట్టును చుండ్రు నుంచి కాపాడుతాయి.
- మందార పువ్వుల్లో విటమిన్ ఎ, సి, అమినో యాసిడ్లు పుష్కలంగా వున్నాయి.
- మందార ఆకు జుట్టుకు సౌందర్యాన్నిచ్చి జుట్టు పెరుగుదలకు ఉపకరిస్తుంది.
- దీన్ని వారానికి రెండుసార్లు ఉపయోగిస్తే జుట్టు దట్టంగా తయారవుతాయి.
- మందార పువ్వులు లేదా ఆకులకు పెరుగు లేదా మెంతులుతో కలిపి పేస్టుగా చేసుకుని జుట్టుకు పట్టించాలి.
- రోజ్ మేరీ ఆయిల్, పెరుగు నాలుగు టీ స్పూన్లు, మందార పువ్వులు తీసుకుని పేస్టులా చేసుకుని జుట్టుకు ప్యాక్‌లా వేసుకోవచ్చు. మాడుకు బాగా పట్టించి అరగంట తర్వాత కడిగేస్తే జుట్టు మెరిసిపోతుంది.







జసింతా కెర్కెట్టా... ఆదివాసీ కవయిత్రి, జర్నలిస్ట్ అయిన ఆమె ఒరాన్ గిరిజనుల సంఘంలో రెండవ తరం పట్టభద్రురాలు. అణగారిన ప్రజల గొంతుగా ఆవిర్భవించింది. తన విద్య తన సమాజానికి, ప్రపంచానికి తిరుగులేని స్వరంగా మారాలని నిర్ణయించుకుంది. ఈ ఏడాది నవంబర్ 26న ఆమె రచించిన హిందీ కవిత్వం 'ఈశ్వర్ ఔర్ బజార్' ప్రముఖ మీడియా సంస్థ నుండి సాహిత్య పురస్కారానికి ఎంపికయింది. పర్వతాలపై ఆమె రాసిన కవితా సంకలనాల్లో ఇది మూడవది. అయితే ఆ పురస్కారాన్ని ధైర్యంగా తిరస్కరించిన ఆమె పరిచయం నేటి మానవిలో...

అణగారిన ప్రజల గొంతుగా...

ఒడిషాలోని నియమగిరి దళిత, ఆదివాసి ప్రజలు అంకితభావంతో దశాబ్దం పాటుగా ఆ ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. కెర్కెట్టా తన రచనల ద్వారా వారి వైఖరిని ప్రపంచానికి వినిపిస్తుంది. 'ప్రధాన స్రవంతి మీడియాకు సమాజానికి మార్చే శక్తితో పాటు, ప్రజల దృక్కోణాలను మార్చే శక్తి కూడా ఉంది అయితే ఆదివాసీలు చాలా కాలంగా అభివృద్ధికి వ్యతిరేకులుగా, అనాగరికులుగా పరిగణించబడుతున్నారు. కానీ ప్రధాన స్రవంతి మీడియా ఆ దృక్కోణాన్ని మార్చడంలో ఎటువంటి పాత్ర పోషించలేదు' అని ఆమె అంటున్నారు.

సంఘం కోసం నిలబడింది

జార్ఖండ్‌లోని ఒరాన్ ఆదివాసీ వర్గానికి చెందిన కెర్కెట్టా చిన్నతనంలో క్రిమినల్ న్యాయ వ్యవస్థలో గిరిజన ప్రజలను హింసకు గురిచేయడాని కళ్లారా చూసింది. ఆమె మామ ఒక మహిళపై లైంగికదాడి చేసి ఆమెను హత్య చేసినట్లు తప్పుడు కేసు పెట్టారు. ఆమె అమ్మమ్మను కూడా జైలుకు పంపారు. 'శవం దొరికిన నది పక్కనే ఉన్న పొలంలో మా మామయ్య పనిచేశాడు. ఆదివాసీలు తమ పంట పండటం కోసం మనుషులను బలితీసుకుంటారని ప్రజలు నమ్ముతారు. ఈ ఆలోచన సమాజంలో ఎప్పటి నుండో ఉంది. ఇది చాలా లోతుగా పాతుకుపోయింది. మేము అమాయకులమని నిరూపించుకోడానికి ఎక్కడికి పోవాలో మాకు తెలియదు' అని ఆమె గుర్తు చేసుకున్నారు. పెరిగిన తర్వాత ఈ ఆలోచనే ఆమెను స్వతంత్ర జర్నలిస్టుగా మార్చివేసింది.

విద్యలో శక్తిని కనుగొనడం

2010 - 2013 మధ్య వార్తా దినపత్రికలో రిపోర్టర్‌గా పనిచేసిన తర్వా కెర్కెట్టా రాజకీయాల్లో మహిళా వివక్ష, భూమి కోసం గిరిజన జనాభాపై దోపిడీ, వారి భూమికి వారిని దూరం చేస్తున్న వలసరాజ్యాల పాత్రపై వివిధ పత్రికలకు స్వతంత్రంగా రాయడం ప్రారంభించారు. ఆమె తన సంఘం నుండి రెండవ తరం గ్రాడ్యుయేట్. ఆమె తల్లిదండ్రులు 80 ఏండ్ల కిందట జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలోని మారుమూల అడవులలో ఏర్పాటు చేసిన మిషన్ స్కూల్లో చదువుకున్నారు. 'మా కుటుంబంలో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన మొదటి మహిళ మా అమ్మ. తన కూతుళ్ల చదువుకోవాలని, వారికి మంచి అవకాశాలను వెతకాలని ఆమెకు చాలా కోరిక ఉండేది' అని ఆమె చెప్పింది.

యువతకు సాధికారత

అప్పుడు కెర్కెట్టా తన హృదయంలో ఒక విప్లవాన్ని రేకెత్తించింది. అణగారిన ప్రజల కోసం పని చేయడానికి ఆమె జీవితం ఓ కేంద్రంగా మారింది. అట్టడుగు వర్గాలను కలవడానికి, వారి అనుభవాలను వినడానికి, రాష్ట్ర గిరిజన ఉద్యమ చరిత్రను అర్థం చేసుకోవడానికి ఆమె గత రెండు దశాబ్దాలుగా జార్ఖండ్ అంతటా ప్రయాణించారు. చాలా సాయంత్రాలు జార్ఖండ్ గ్రామాలలోని గిరిజన యువతులతో సంభాషిస్తూ, వారి కలలు, కష్టాలను ప్రతిబింబించేలా వారిని ప్రోత్సహిస్తుంది. 'మతంపై వారి ఆలోచనలు, విద్యపై అవగాహన కల్పించేదాన్ని. వారు తమ కుటుంబాలతో మాట్లాడలేని ఎన్నో విషయాల గురించి





నాతో చర్చించే వారు. బలమైన భావజాలాలు, స్థిరమైన భవిష్యత్తులను ఆత్మపరిశీలన చేసుకోవడానికి, ప్రశ్నించడానికి, నిర్మించడానికి వారికి మార్గాలు తెరవబడ్డాయి. జార్ఖండ్‌లోని ఖుంటి జిల్లాలోని కచ్చబరి గ్రామంలో మేము బాలికలతో కలిసి పని చేశాము. వారిలో చాలామంది బాల్య వివాహాలను తిరస్కరించారు. పాఠశాలకు వెళ్లడం ప్రారంభించారు. నగరాల్లో పని కోసం గ్రామాన్ని విడిచిపెట్టకూడదని నిర్ణయించుకున్నారు. ఆ గ్రామాన్ని తర్వాత జార్ఖండ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దత్తత తీసుకున్నారు' అని ఆమె చెప్పారు. ఆమె కృషికి ఫలితంగా నేడు ఈ గ్రామంలో కనీసం 20 మంది బాలికలు పాఠశాలలో చేరారు. కొంతమంది యువతులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు. రోజువారీ సవాళ్లను చర్చించడానికి, పరిష్కారాలను కనుగొనడానికి గ్రామ ప్రజలు కూడా ఒక సమిష్టిగా ఏర్పడ్డారు.

స్వదేశీ కమ్యూనిటీల వాయిస్

2014లో ఆమెను ఆసియా ఇండిజినస్ పీపుల్స్ ప్యాక్ట్, థాయిలాండ్ ద్వారా వాయిస్ ఆఫ్ ఆసియా గుర్తింపు అవార్డుతో సత్కరించింది. 2022లో ఫోర్బ్స్ ఇండియా భారతదేశంలోని 22 మంది స్వీయ-నిర్మిత మహిళల్లో ఒకరిగా ఆమెను ఎంపిక చేసింది. హిందీ, ఇంగ్లీషులో ఆమె పద్యాలు రాశారు. 'ఆదివాసీలకు ప్రకృతితో అనుబంధం ఉంది. ఆ సంబంధం నుండే వారి జీవిత తత్వశాస్త్రం, సంస్కృతి, భాష, జీవనశైలి, ఆధ్యాత్మికత ఉద్భవించాయి. వారు ప్రకృతి నుండి విలువల బలాన్ని కూడా నేర్చుకుంటారు. కాబట్టి పర్యావరణం నుండి వారిని ఎవ్వరూ వేరు చేయలేరు. గిరిజనుల నుండి ప్రకృతిని ఎవ్వరూ దూరం చేయలేరు. పెట్టుబడిదారీ జీవన విధానానికి ప్రత్యామ్నాయం లేని సమాజానికి ఈ సంబంధాన్ని అర్థం చేసుకోవడం అసాధ్యం' అంటారు ఆమె.

- సలీమ

కుల ఆధిపత్యాన్ని అనుభవించాను

తన కమ్యూనిటీ భావజాలంలో పెరిగిన కెర్కెట్టా బీహార్‌లోని ఇతర ప్రాంతాలకు వెళ్లి వివిధ పాఠశాలల్లో చేరే వరకు వివక్షను ప్రత్యక్షంగా అనుభవించలేదు. పోలీసు సర్వీస్‌లో ఉన్న ఆమె తండ్రికి నిత్యం బదిలీ అవుతుండేది. 'నేను చదువుకోవడానికి బయటికి వెళ్ళినప్పుడు హాస్టల్లో వివిధ కులాల పిల్లలతో కలిసి జీవించాను. మొదటిసారిగా కుల ఆధిపత్యాన్ని అనుభవించాను. నా చర్మం ఇతర పిల్లల కంటే ముదురు రంగులో ఉందని నేను గ్రహించడం ఇదే మొదటిసారి. ఆధిపత్య కుల ఉపాధ్యాయులు ఆదివాసీ బాలికలను ఆవులు, ఎద్దులతో పోల్చేవారు. మేము మట్టి ముద్దలుగా ఉన్నామని అనేవారు. 15 ఏండ్ల కెర్కెట్టాను ఈ అనుభవాలన్నీ ఎంతో ఆలోచించేలా చేశాయి. 8వ తరగతిలో ఆమె మొదటి స్థానంలో నిలిచింది. దాదాపు అదే సమయంలో ఆమె గిరిజనులు, అడవులు, పర్వతాల ప్రాముఖ్యతపై వార్తాపత్రికలు, మ్యాగజైన్‌లకు కథనాలు రాయడం ప్రారంభించింది. 'కష్టపడి పనిచేస్తే సమాజంలో నా గుర్తింపు, విలువ పెరుగుతాయని, నా పరీక్షల్లో కూడా ఉత్తీర్ణత సాధించగలనని ఈ అనుభవం నాకు నిరూపించింది. నా సమాజంలోని ఇతర అమ్మాయిలు కూడా అదే పురోగతిని అనుభవించ గలరనడానికి నేను సాక్ష్యంగా నిలిచాను' ఆమె చెప్పారు.



ఉగ్రవాదుల కాల్పుల్లో రిటైర్డ్ పోలీస్ అధికారి మృతి



శ్రీనగర్ : మసీదులో ప్రార్థనలు చేసుకుంటున్న రిటైర్డ్ పోలీస్ అధికారిపై గుర్తుతెలియని ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. జమ్ముకాశ్మీర్‌లోని బారాముల్లాలో ఆదివారం ఈ ఘటన జరిగింది. తీవ్రగాయాలైన ఆయన అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

రిటైర్డ్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అధికారి మొహమ్మద్ షఫీ జిల్లాలోని గంట్ముల్లా ప్రాంతంలోని ఓ మసీదులో ప్రార్థనలు జరుపుతుండగా కొందరు ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పూంచ్ జిల్లాలో సైనికుల వాహనంపై ఉగ్రవాదులు దాడి ఘటన జరిగిన మూడు రోజుల అనంతరం ఈ హత్య ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

ఇటీవల పూంచ్ జిల్లాలో సైన్యాన్ని తరలిస్తున్న వాహనాలపై ఉగ్రవాదులు దాడి జరిపిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో నలుగురు సైనికులు మరణించగా, ఇద్దరు గాయపడ్డారు. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్‌కు చెందిన పీపుల్ యాంటీ ఫాసిస్ట్ ఫ్రంట్ ఈ దాడికి బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించింది.

అయితే దాడి జరిగిన మరుసటి రోజు ఆప్రాంతంలో ముగ్గురు పౌరుల మృతదేహాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వారు సఫీర్ హుస్సేన్, మహ్మద్ షోకేత్, షబీర్ అహ్మద్‌లుగా పేర్కొన్నారు. పూంచ్ దాడి గురించి ప్రశ్నించేందుకు పోలీసులు అదుపులోకి తీసుకున్న ఎనిమిది మంది సాధారణ పౌరుల్లో వీరు కూడా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై చట్టపరమైన చర్యలు ప్రారంభించామని జమ్ముకాశ్మీర్ ప్రభుత్వం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ప్రకటించినట్లు తెలిపింది.

మల్కాజిగిరిపై నజర్...



ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే విజయం సాధించారు. 2018లో ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ గెలుపొందగా.. మిగిలిన ఐదు నియోజవర్గాల్లోనూ బీఆర్‌ఎస్ గెలిచింది. కానీ ఇక్కడి నుంచి ఎంపీగా కాంగ్రెస్ తరుపున రేవంత్‌రెడ్డి గెలుపొందారు. ఈ పార్లమెంట్ సెగ్మెంట్‌లో ప్రస్తుతం కాంగ్రెస్ కంటే బీఆర్‌ఎస్ ఎక్కువగా బలంగా ఉన్నట్టు కనిపిస్తోంది. అయితే ఎవరికి వారుగా ఈసారి గట్టిగానే కృషి చేయాలనే పట్టుదలతో మూడు పార్టీలూ ఉన్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో ఈ స్థానంలో ఆశించింత మేర ఓట్లు సాధించలేకపోయిన బీజేపీ ఈసారి 'మల్కాజిగిరి' పార్లమెంట్ సెగ్మెంట్‌పై సీరియస్‌గానే ఆలోచిస్తుంది.

అసెంబ్లీ ఫలితాలు బేరీజు

ఈ పార్లమెంట్ స్థానంలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ ఆరింటిలోనూ ప్రస్తుతం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. ఎల్బీనగర్, కుత్బుల్లాపూర్ నియోజవర్గాల్లో బీజేపీ రెండో స్థానంలో ఉండగా, మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి నియోజవర్గాల్లో కాంగ్రెస్ రెండో స్థానంలో ఉంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అనుకూలంగా రావడంతో బీఆర్‌ఎస్ పై చేయి ప్రదర్శిస్తుండగా.. రాష్ట్రంలో అధికారం చేపట్టడంతోపాటు 'మల్కాజిగిరి' పార్లమెంట్ సిట్టింగ్ కావడంతో కాంగ్రెస్ సైతం దూకుడుగానే కనిపిస్తుంది. ఈ స్థానానికి ఇన్‌చార్జిగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక ఆలస్యం కావడంతోనే ఓడిపోవాల్సి వచ్చిందని విశ్లేషించుకున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఈ సారి ముందుగానే అభ్యర్థులను ప్రకటించాలనే ఆలోచనకు వచ్చినట్టు సమాచారం.

తెరపైకి పలువురి పేర్లు

మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసేందుకు పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన వారితోపాటు కొత్త వారు సైతం పోటీలో ఉండేందుకు ముందుకొస్తున్నారు. బీజేపీ నుంచి ఆ పార్టీ జాతీయ కార్యదర్శి మురళీధర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌తోపాటు మరికొందరు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇక కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి పేరు ప్రధానంగా వినిపిస్తుంది. శనివారం ఇన్‌చార్జి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కాంగ్రెస్ నేతలతో నిర్వహించిన సమావేశంలో ఎల్బీనగర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన మధుయాష్కీగౌడ్ కనిపించడంతో ఆయన కూడా ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు సుముఖంగా ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇక బీఆర్‌ఎస్ నుంచి గత పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన మర్రి రాజశేఖర్‌రెడ్డి మల్కాజిగిరి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆ పార్టీ నుంచి ఎవరు బరిలో ఉంటారనేది ఆసక్తిగా మారింది.

ఏసు బోధనలు ఎప్పటికీ అనుసరణీయమే...

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ క్రిస్మస్ శుభాకాంక్షలు

ఏసు క్రీస్తు జన్మదినాన్ని క్రైస్తవ సోదర సోదరీమణులు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆకాంక్షించారు. శాంతి, సౌభ్రాతృత్వం, కరుణ, క్షమాగుణం నేర్పే క్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఆచరణీయమని తెలిపారు.

ఘోర రోడ్డు ప్రమాదం..ఐదుగురు మృతి

- ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న రెండు కార్లు
- ఇద్దరి పరిస్థితి విషమం

నవతెలంగాణ -ఉట్కూరు / నారాయణపేట టౌన్

ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మండలం జక్లేర్ గ్రామ శివారులో రోడ్డు జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జక్లేర్ జాతీయ రహదారిపై ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు ఢీ కొనగా.. కార్లు రెండూ నుజ్జునుజ్జయ్యి ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు. వారిలో చిన్నారి కూడా ఉంది. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడగా.. వారిని ఆస్పత్రికి చేర్చి చికిత్స అందిస్తున్నారు. కాగా వారి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతులు.. కర్నాటక, మహారాష్ట్రకు చెందిన వారిగా గుర్తించారు. కాగా, రోడ్డు ప్రమాదానికి అతివేగమే కారణమని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. యాక్సిడెంట్ కావడంతో హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అవ్వగా.. పోలీసులు క్లియర్ చేస్తున్నారు.

మీరే వారధులు..

(మొదటిపేజీ తరువాయి)

ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. దీనికోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగడం కాకుండా, అధికారులే క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు వెళ్లాలనీ, లబ్దిదారుల ఎంపిక గ్రామ సభల్లోనే జరగాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలుగా గ్రామ సభలు నిర్వహించాలని చెప్పారు. ప్రజల నుంచి ధరణి సహా అన్ని రకాల ఫిర్యాదుల్నీ స్వీకరించాలనీ, హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగినట్టే అన్ని జిల్లాలు, మండలాల్లో ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

ప్రజాపాలన ఇలా...

రెవెన్యూ డిపార్ట్‌మెంట్ గ్రామ సభలను నిర్వహిస్తుంది. పోలీసు డిపార్ట్ మెంట్ వీటిని సమన్వయం చేసుకోవాలి. ప్రతి రోజు రెండు సభలు రెండు గ్రామాల్లో చేయాలి. మండలంలో రెండు టీంలు ఉంటే ఒక టీంకు ఎమ్మార్వో, మరో టీంకు ఎంపీడీవో బాధ్యత తీసుకుంటారు. ప్రజా పాలన కోసం శాసనసభ నియోజకవర్గానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌ను డిప్యూట్ చేస్తాం. 119 నియోజకవర్గాలకు 119 మంది స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తాం. ప్రతి మండలాన్ని వర్టికల్ కింద డివైడ్ చేస్తారు. ఒక వర్టికల్‌కు ఎమ్మార్వో, మరో వర్టికల్‌కు ఎంపీడీవో బాధ్యత వహిస్తారు. వారి క్రింద ఆఫీసర్స్ స్ట్రక్చర్ ఉంటుంది. ప్రతి అధికారి రెండు గ్రామాలకు వెళ్లాలి. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు ఒక గ్రామం, మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 గంటల వరకు మరొక గ్రామంలో దరఖాస్తులు తీసుకోవడం వంటి పనులు చేయాలి. పోలీసు డిపార్టుమెంట్‌తో పాటు స్పెషల్ ఆఫీసర్ స్థానికంగా సమన్వయం చేసుకోవాలి. ముందుగా గ్రామాలకు వెళ్లి ప్రణాళికతో సభ నిర్వహించాలి. మహిళలకు ప్రత్యేకంగా ప్రాధాన్యత కల్పించాలి. వారికోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, దరఖాస్తులు తీసుకోవాలి. మొదట వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రారంభ వాక్యాలను గ్రామసభల్లో చదివి వినిపించాలి. ప్రభుత్వం ఉద్దేశ్యం, లక్ష్యాలను వివరించాలి. వాటిని ఎలా అమలు చేయబోతున్నామనే విషయాలు చెప్పాలి. నిరక్షరాస్యులు గ్రామ సభలకు వస్తే, అంగన్ వాడీ, ఆశావర్కర్ల వంటి చదువుకున్న వారు ఎవరైనా వారి దరఖాస్తులను నింపి సహకరించాలి.

ఏర్పాట్లు చేయండి

గ్రామసభలకు వచ్చే వారు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. గ్రామసభల నిర్వహణకు కావాల్సిన నిధులను తక్షణం విడుదల చేస్తున్నట్టు చెప్పారు. కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, ఎస్పీలు ఎవరైనా సరే స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను చెప్పవచ్చని అన్నారు.

ఫీడ్‌బ్యాక్ ఇవ్వండి

కేవలం మేం చెప్పింది చేయడమే కాదు. దానిలోని లోటుపాట్లు, ఆ స్కీం ఫీడ్‌బ్యాక్ కూడా మీరే ఇవ్వాలి' అని చెప్పారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాల్లో ఎలాంటి కోతలు పెట్టబోమని స్పష్టంచేశారు. ధరణి పోర్టల్‌ను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. దానికోసం ఏం చేయాలో అభిప్రాయాలు చెప్పమని అధికారుల్ని కోరారు. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలనీ, అదే స్థాయిలో నకిలీ విత్తనాలనూ అరికట్టాలని ఆదేశించారు.

ఇదీ మీ పాత్ర

ప్రజాస్వామ్యంలో అధికారుల పాత్రను గుర్తుచేశారు. "అభివద్ది చెందడమంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు. పౌరుల నైతికాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి. అద్దాల మేడలు కట్టో, రంగుల గోడలు చూపించో, అభివృద్ధి జరిగిందని ఎవరైనా భ్రమపెడితే, దానివల్ల పేద ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదు. నిజమైన అభివృద్ధి అనేది చివరి వరుసలో వున్న పేదవారికి సంక్షేమ పథకం అందినప్పుడే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందినట్టు" అని స్పష్టం చేశారు. ఆ లక్ష్యం కోసమే చివరి వరుసలో నిలబడిన తండాలు, గూడేలు, మారుమూల పల్లెల్లో పేదవారి కోసమే 'ప్రజాపాలన' నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఐఏఎస్ అధికారి ఎస్‌ఆర్ శంకరన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలనీ, ఆయన మార్గంలో ఐఏఎస్, ఐపీఎస్‌లు నడవాలని కాంక్షించారు.

ఫ్రెండ్లీ సర్కార్...

"మాది ఫ్రెండ్లీ గవర్నమెంట్. మీరు ప్రజలచేత శభాష్ అనిపించుకున్నంతవరకే ఈ ప్రభుత్వం మీతో ఫ్రెండ్లీగా వుంటుంది. మీ పరిపాలనలో నిర్లక్ష్యం వహించినా, ఉద్దేశ్యపూర్వకంగా నిర్ణయాలు తీసుకున్నా, మీ పనితీరును కచ్చితంగా సమీక్షిస్తాం" అని హెచ్చరించారు.

తెలంగాణ పరిస్థితులు వేరు

"ఇతర రాష్ట్రాల్లో పరిస్థితులు వేరు. తెలంగాణ పరిస్థితులు వేరు. ఇక్కడి ప్రజలు ఆకలినైనా భరిస్తారు కానీ, ఆత్మాభిమానాన్ని కోల్పోతే సహించరు. అధికారులు ఈ విషయాల్ని దృష్టిలో ఉంచుకోవాలి. మానవీయ కోణంతో ప్రజలు లేవనెత్తిన అంశాలను అర్థం చేసుకొని పరిష్కారం చూపించాలి' అని చెప్పారు. అలాగే ఐపీఎస్ అధికారుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ "తెలంగాణ ప్రాంతం ఉద్యమ నేపథ్యం ఉన్న రాష్ట్రం. అనేక రకాల భావజాలాలతో, పౌర హక్కుల కోసం ప్రజా సంఘాలు, కుల సంఘాలు, ప్రభుత్వాలు నిషేధించిన సంస్థలు కూడా ఇక్కడ ప్రజల తరపున పోరాటాలు చేశారు. ప్రభుత్వం చట్టాలు అమలు చేసేటప్పుడు కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుని ఉండొచ్చు. ఫ్రెండ్లీ పోలీసింగ్ పౌరులతో ఉండాలే కానీ, క్రిమినల్స్‌తో కాదు" అని తేల్చిచెప్పారు.

'పోలీసు శాఖలో వేర్వేరు విభాగాలను దేనికోసమైతే ఏర్పాటు చేశారో, వాటి లక్ష్యాలు నెరవేరాలి' అని స్పష్టం చేశారు. 'నేరాల విధానం మారింది. సైబర్ క్రైం పెరిగింది. దానిపై దృష్టి పెట్టండి' అని దిశానిర్దేశం చేశారు. 'సన్ బర్న్ పార్టీలపై ఉక్కుపాదం మోపండి. ఎంతటివారైనా ఉపేక్షించొద్దు. ఈ విషయంలో పోలీసు అధికారులకు సంపూర్ణ అధికారాలు ఇస్తున్నాము' అని చెప్పారు.

నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

నకిలీ విత్తనాలు టెర్రరిజం కంటే ప్రమాదకరమైనవని ఆందోళన వ్యక్తం చేశారు. ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. 'పోలీసులు డ్రగ్ మాఫీయాతో సంబంధమున్న వారి ఆస్తులు జప్తు చేస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసులు ఉన్న వారి ఆస్తులు జప్తు చేస్తుంది. నకిలీ విత్తనాలు అమ్మే కంపెనీల ఆస్తులు ఎందుకు సీజ్ చేయడం లేదు. అవసరమైతే చట్టాన్ని సవరించుకోండి' అని చెప్పారు.

కుల మతాల మధ్య వైషమ్యాలు పెంచేలా సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేస్తున్నారు. వీటికి సంబంధించిన విషయాల్లో కూడా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలి. అలాంటి వారి సమాచారం సేకరించి, నియంత్రణలోకి తెచ్చుకోవాలి అని చెప్పారు.

కష్టమైతే చెప్పండి...బదిలీ చేస్తాం

సచివాలయం నుంచి మంత్రివర్గ పాలసీ డాక్యుమెంట్‌కు మాత్రమే అప్రూవల్ ఇస్తాం. అమలు పరిచే బాధ్యత మీదే. ఈ క్రమంలో అధికారులకు ఇబ్బంది అనిపిస్తే, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, పోలీసు డిపార్ట్‌మెంట్‌లో అయితే డీజీపీకి తెలియపర్చండి. ఈ విధానంలో పనిచేయడానికి మీకు ఇబ్బందిగా ఉంటే మరోచోటికి మిమ్మల్ని బదిలీచేయడానికి, బాధ్యతలనుంచి మార్చడానికి ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరం లేదు" అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంగా చెప్పారు. ప్రభుత్వం చాలా ఓపెన్ మైండ్‌తో ఉంది. మీ నుంచి సూచనలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాం. మాకెలాంటి భేషజాలు లేవు అని అన్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క కూడా అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. వారి అభిప్రాయాలు చెప్పాలని కోరారు.



టెస్టు క్రికెట్‌లో టీమ్ ఇండియాకు ఎదురులేదు. అగ్రజట్టు ఇంగ్లాండ్‌ను చిత్తు చేసిన ఉత్సాహంలో ఉన్న హర్మన్‌ప్రీత్ కౌర్‌సేన.. వాంఖడేలో వరల్డ్ నం.1 ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. ఏకైక టెస్టులో 8 వికెట్ల తేడాతో అద్భుత విజయం నమోదు చేసింది. మహిళల టెస్టు క్రికెట్ చరిత్రలో కంగారూలపై తొలి విజయం నమోదు చేసింది.

రెడ్‌బాల్ ఫార్మాట్‌లో అమ్మాయిలు వరుసగా రెండో సిరీస్ సొంతం చేసుకున్నారు. ఏకైక టెస్టులో ఆస్ట్రేలియాను చిత్తుగా ఓడించి.. 8 వికెట్ల తేడాతో ఘన విజయం అందుకున్నారు. స్నేహ్ రానా (3/56, 4/63) ఏడు వికెట్ల ప్రదర్శనతో ఆసీస్‌ను తిప్పేయగా.. బ్యాటర్లు అంచనాలను అందుకున్నారు. టెస్టు సిరీస్ భారత్ సొంతమవగా.. వన్డే సిరీస్ మంగళవారం నుంచి ఆరంభం కానుంది.

కంగారూను కొట్టేశారు

- ఆసీస్‌పై భారత్ చారిత్రక టెస్టు విజయం
- వాంఖడేలో అమ్మాయిల అద్వితీయ ప్రదర్శన
- 8 వికెట్ల తేడాతో అద్భుత విజయం
- 1-0తో టెస్టు సిరీస్‌ను భారత్ వశం

నవతెలంగాణ-ముంబయి



భారత మహిళల జట్టు అద్భుతం చేసింది. మహిళల క్రికెట్ అగ్రజట్టు, వరల్డ్ నం.1 ఆస్ట్రేలియా మెడలు వంచింది. టెస్టు క్రికెట్‌లో భారత్ చేతిలో ఓటమెరుగుని కంగారూలకు.. పరాజయం రుచి చూపించింది. ముంబయి వాంఖడే స్టేడియంలో జరిగిన ఏకైక టెస్టులో ఆస్ట్రేలియాపై భారత అమ్మాయిలు 8 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించారు. ఆస్ట్రేలియాపై తొలి టెస్టు విజయంతో సరికొత్త చరిత్ర సృష్టించారు. భారత స్పిన్నర్ల మాయతో ఆస్ట్రేలియా అమ్మాయిలు వరుసగా రెండు ఇన్నింగ్స్‌ల్లో 219, 261 పరుగులకే కుప్పకూలారు. దీప్తి శర్మ (78, 171 బంతుల్లో 9 ఫోర్లు), స్మృతీ మంధాన (74, 106 బంతుల్లో 12 ఫోర్లు), జెమీమా రొడ్రిగస్ (73, 121 బంతుల్లో 9 ఫోర్లు), రిచా ఘోష్ (52, 104 బంతుల్లో 7 ఫోర్లు) అర్థ సెంచరీలకు తోడు పూజ (47, 126 బంతుల్లో 7 ఫోర్లు), షెఫాలీ వర్మ (40, 59 బంతుల్లో 8 ఫోర్లు) రాణించటంతో టీమ్ ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 406 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో 75 పురుగుల స్వల్ప లక్ష్యాన్ని మనోళ్లు 18.4 ఓవర్లలో అలవోకగా ఛేదించారు. స్మృతీ మంధాన (38 నాటౌట్, 61 బంతుల్లో 6 ఫోర్లు), రిచా ఘోష్ (13), జెమీమా రొడ్రిగస్ (12 నాటౌట్) రాణించారు. ఏడు వికెట్లతో కంగారూలను మాయ చేసిన స్నేహ్ రానా 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది. 1-0తో టెస్టు సిరీస్ టీమ్ ఇండియా వశమైంది. ఇటీవల ఇంగ్లాండ్‌తో టెస్టు మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 400 పైచిలుకు పరుగులు చేసిన భారత అమ్మాయిలు.. తాజాగా ఆస్ట్రేలియాతో టెస్టు సమరంలోనూ అదే ప్రదర్శన పునరావృతం చేశారు. భారత్, ఆస్ట్రేలియా వన్డే సిరీస్ మంగళవారం నుంచి మొదలు కానుంది.

ఆడుతూ పాడుతూ..

ఆస్ట్రేలియా అమ్మా యిలు నిర్దేశించిన 75 పరుగుల లక్ష్యాన్ని టీమ్ ఇండియా ఆడుతూ పాడుతూ ఛేదించింది. యువ ఓపెనర్ షెఫాలీ వర్మ (4) త్వరగా నిష్క్రమించినా.. భారత్ ఎక్కడా తడబాటుకు గురి కాలేదు. స్టార్ బ్యాటర్ స్మృతీ మంధాన (38 నాటౌట్), రిచా ఘోష్ (13) జంట అర్థ సెంచరీ భాగస్వామ్యంతో లాంఛనం మిగిల్చారు. మంధాన ఆరు ఫోర్లతో మెరువగా.. రిచా ఘోష్ సైతం మూడు బౌండరీలతో దండెత్తింది. ఘోష్ అవుటైనా.. జెమీమా రొడ్రిగస్ (12 నాటౌట్) సొంత మైదానంలో చారిత్రక విజయాన్ని అందించింది. 15 బంతుల్లో 2 ఫోర్లు బాదిన జెమీమా.. అజేయంగా 12 పరుగులు చేసింది. 18.4 ఓవర్లలోనే 75 పరుగుల మార్క్ అందుకున్న టీమ్ ఇండియా.. ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియాలపై అలవోక విజయం సాధించింది. కంగారూ బౌలర్లలో కిమ్ గార్త్, ఆష్లె గార్డ్‌నర్‌లు చెరో వికెట్ తీసుకున్నారు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా మహిళల తొలి ఇన్నింగ్స్ : 219/10
భారత్ మహిళల తొలి ఇన్నింగ్స్ : 406/10
ఆస్ట్రేలియా మహిళల రెండో ఇన్నింగ్స్ : 261/10
భారత్ మహిళల రెండో ఇన్నింగ్స్ : షెఫాలీ వర్మ (సి) హీలే (బి) గార్త్ 4, స్మృతీ మంధాన నాటౌట్ 38, రిచా ఘోష్ (సి) మెక్‌గ్రాత్ (బి) గార్డ్‌నర్ 13, జెమీమా రొడ్రిగస్ నాటౌట్ 12, ఎక్స్‌ట్రాలు : 8, **మొత్తం :** (18.4 ఓవర్లలో 2 వికెట్లకు) 75.
వికెట్ల పతనం : 1-4, 2-55.
బౌలింగ్ : కిమ్ గార్త్ 5-1-19-1, ఆష్లె గార్డ్‌నర్ 9-2-18-1, తహ్లియ మెక్‌గ్రాత్ 2-0-14-0, జెస్ జొనాసెన్ 2.4-0-16-0.

తోక కత్తిరించారు



మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా అమ్మాయిలు రెండో ఇన్నింగ్స్‌లో 233 పరుగులు చేశారు. తొలి ఇన్నింగ్స్ లోటు పూడ్చటంతో పాటు లక్ష్య నిర్దేశనలోకి అడుగుపెట్టారు. చేతిలో మరో ఐదు వికెట్లు ఉన్నాయి. దీంతో కంగారూ అమ్మాయిలు చివరి రోజు ఆటలో ఏం చేస్తారా అనే ఉత్కంఠ కనిపించింది. ఆస్ట్రేలియా అమ్మాయిలు పోరాడేందుకు మనోళ్లు ఎటువంటి అవకాశం ఇవ్వలేదు. ఓవర్‌నైట్ స్కోరుకు మరో 28 పరుగులే జోడించిన ఆస్ట్రేలియా.. చివరి ఐదు వికెట్లు కోల్పోయింది. దీంతో టీమ్ ఇండియా బ్యాటర్లకు శ్రమ లేకుండా పోయింది!. ఓవర్‌నైట్ బ్యాటర్లు అనాబెల్ సుథర్‌లాండ్ (27, 102 బంతుల్లో 3 ఫోర్లు), ఆష్లె గార్డ్‌నర్ (7, 27 బంతుల్లో 1 ఫోర్) ప్రతిఘటన నాల్గో రోజు ఉదయం ఒక్క పరుగైనా జోడించకుండానే ముగిసింది. పూజ ఓవర్లో గార్డ్‌నర్ నిష్క్రమించగా.. అనాబెల్‌ను స్నేహ్ రానా మాయలో పడేసింది. ఇక ఆ తర్వాత టెయిలెండర్లు పతకం లాంఛనమే అయ్యింది. జెస్ జొనాసెన్ (9), అలాన కింగ్ (0), కిమ్ గార్త్ (4) చేతులెత్తేశారు. 105.4 ఓవర్లలో 261 పరుగులకు ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ ముగిసింది. దీంతో భారత్ ముందు 75 పరుగుల లక్ష్యం నిలిచింది. భారత బౌలర్లలో స్పిన్నర్ స్నేహ్ రానా (4/63) నాలుగు వికెట్లతో మెరుగా.. మరో స్పిన్నర్ రాజేశ్వరి గైక్వాడ్ (2/42), హర్మన్‌ప్రీత్ కౌర్ (2/23), పూజ (1/40) రాణించారు.



వేటు పడింది!

- భారత రెజ్లింగ్ సమాఖ్య పాలక వర్గంపై వేటు
- కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ నిర్ణయం
- సస్పెన్షన్‌పై మల్లయోధులు, అథ్లెట్ల హర్షం

నవతెలంగాణ-న్యూఢిల్లీ

ఎట్టకేలకు భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)పై సస్పెన్షన్ వేటు పడింది. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యుడబ్ల్యూడబ్ల్యూ), క్రీడా మంత్రిత్వ శాఖ నిబంధనలను ఉల్లంఘిస్తూ జాతీయ అండర్ -15, అండర్-17 రెజ్లింగ్ పోటీలకు వేదిక, షెడ్యూల్‌ను ప్రకటిస్తూ ఇటీవల కొత్తగా ఎన్నికైన డబ్ల్యూఎఫ్ఐ తరఫున మాజీ అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ ప్రకటించటంపై క్రీడాశాఖ కన్నెర్ర చేసింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న క్రీడాశాఖ ఉన్నతాధికారులు.. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) నూతన కార్యవర్గంపై సస్పెన్షన్ వేటు వేసింది. ఈ మేరకు క్రీడాశాఖ నిర్ణయం తీసుకుంది. క్రీడాశాఖ నిర్ణయంపై మల్లయోధులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

అలా ఎన్నిక.. ఇలా వేటు

కోర్టు కేసులతో సుదీర్ఘంగా వాయిదా పడుతూ వచ్చిన భారత రెజ్లింగ్ సమాఖ్య ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నికలు డిసెంబర్ 21న ముగిశాయి. మాజీ అధ్యక్షుడు, లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ సన్నిహితుడు సంజయ్ సింగ్ ఇటీవల ఎన్నికల్లో కొత్త ప్రెసిడెం ట్‌గా ఎన్నికయ్యాడు. సంజయ్ సింగ్ 40 ఓట్లు దక్కించుకోగా.. మాజీ రెజ్లర్ అనిత షియోరాన్‌కు ఏడు ఓట్లు పోలయ్యాయి. బ్రిజ్‌భూషణ్ సన్నిహితుడు, వ్యాపార భాగస్వామి సంజయ్ సింగ్ అధ్యక్ష కుర్చీలో కూర్చోవటంతో.. రెజ్లింగ్ క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంచితే.. కొత్త కమిటీ ఎన్నికై వారమైనా కాకముందే సస్పెన్షన్ వేటు పడింది. అండర్-15, అండర్-20 జాతీయ ట్రయల్స్ గోండా లోని నందినగర్‌లో నిర్వహిస్తున్నట్టు ఇటీవల బ్రిజ్ భూషణ్ ప్రకటించారు. నిబంధనల ప్రకారం ఈ ట్రయ ల్స్‌ను ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎంపిక చేసిన ప్రదేశాల్లోనే నిర్వహించాలి. దీంతో క్రీడాశాఖ వేటు వేసింది. 'భారత రెజ్లింగ్ సమాఖ్య రూల్స్ 3(ఈ) ప్రకారం.. ఏదేని సీనియర్, జూనియర్ లేదా సబ్ జూనియర్ జాతీయ చాంపియన్‌షిప్స్‌ను యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ రూల్స్‌ను అనుసరించి.. ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎంపిక చేసిన ప్రదేశాల్లోనే నిర్వహించాలి. ఇటువంటి నిర్ణయాలను ముందస్తుగా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఎజెండాలో ఉంచి, ఆపై నిర్ణయాలు తీసుకోవాలి. నూతనంగా ఎన్నికైన ఎగ్జిక్యూటివ్ కమిటీ పూర్తిగా గత పర్యాయం ఆఫీస్ బేరర్ల ఆధీనంలో పని చేస్తుందని అనిపిస్తుంది. ఇది జాతీయ స్పోర్ట్స్ కోడ్‌కు అవమానం. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు, డబ్ల్యూఎఫ్ఐ నూతన కార్యవర్గం రెజ్లింగ్‌కు సంబంధించి ఎటువంటి కార్యకలాపాల్లో భాగస్వామ్యం అయ్యేందుకు వీల్లేదు' అని క్రీడాశాఖ పేర్కొంది. సంజయ్ సింగ్ సారథ్యంలోని డబ్ల్యూఎఫ్ఐ.. అటు సమాఖ్య సొంత నిబంధనలు, ఇటు జాతీయ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కోడ్‌ను పాటించలేదని క్రీడాశాఖ తన ఉత్వర్వుల్లో తెలిపింది.



ఆలస్యమైనా..!

ఆలస్యమైనా.. క్రీడాశాఖ సముచిత నిర్ణయమే తీసుకుంది. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ సన్నిహితులు తిరిగి రెజ్లింగ్ సమాఖ్య పగ్గాలు అందుకుంటే.. మళ్లీ బ్రిజ్‌భూషణ్ రాజ్యమే అవుతుందని మల్లయోధులు ఆందోళన వ్యక్తం చేసినా.. కేంద్ర ప్రభుత్వం, క్రీడాశాఖ పట్టించుకోలేదు. మూడు నెలల పాటు రెజ్లింగ్ క్రీడాకారులు జంతర్‌మంతర్ వద్ద నిరసనకు దిగగా.. బ్రిజ్‌భూషణ్ కుటుంబ సభ్యులు, సన్నిహితులు డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికల్లో నిలబడకుండా చర్యలు తీసుకుంటామని క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ హామీ ఇచ్చారు. సొంత పార్టీ ఎంపి కోసం మంత్రి హామీ గాలికొదిలేశారు. అంగ, అర్థ బలంతో ఎన్నికల్లో బ్రిజ్‌భూషణ్ అనుచరులే అందలం ఎక్కారు. రెజ్లింగ్ సమాఖ్య పరిపాలన మాజీ క్రీడాకారుల చేతికి దక్కాలని మల్లయోధులు ఆశించారు. ఈ విషయంపై ఎన్నికలకు ముందే క్రీడాశాఖ మంత్రిని కలిసినా.. బజరంగ్ పూనియా, సాక్షి మాలిక్‌కు నిరాశే ఎదురైంది.

కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం దక్కని భావించిన రెజ్లింగ్ క్రీడాకారులు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. సాక్షి మాలిక్ ఏకంగా కుస్తీకి గుడ్‌బై చెప్పగా.. బజరంగ్ పూనియా పద్మ శ్రీ పురస్కారాన్ని వెనక్కి ఇచ్చేశాడు. బధిరుల ఒలింపిక్స్ పసిడి పతక విజేత వీరేందర్ సింగ్ యాదవ్ సైతం పద్మ శ్రీ పురస్కారం వెనక్కి ఇస్తున్నట్టు ప్రకటించాడు. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధింపులకు గురి చేసి.. మళ్లీ డబ్ల్యూఎఫ్ఐ పగ్గాలు పరోక్షంగా అందుకున్న బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్, కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా మరికొందరు క్రీడాకారులు తాము సాధించిన పతకాలు, అందుకున్న పురస్కారాలు వెనక్కి ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారని క్రీడాశాఖ ఉన్నతాధికారులు పసిగట్టారు. దీంతో మరింత కాలయాపన చేయకుండా భారత రెజ్లింగ్ సమాఖ్య ఎగ్జిక్యూటివ్ కమిటీపై వేటు వేసింది.రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా సంజయ్ సింగ్ ఎన్నికైనా.. పూలదండలు మాత్రం బ్రిజ్‌భూషణ్‌కే వేశారు. టాప్ ఆఫీస్ బేరర్లు మౌనంగా ఉండిపోగా.. రెజ్లింగ్ టోర్నీల షెడ్యూల్, వేదికలను బ్రిజ్‌భూషణ్ ప్రకటించాడు. రెజ్లింగ్ సమాఖ్య వ్యవస్థను బ్రిజ్‌భూషణ్ స్వయంగా నియంత్రణలో ఉంచుకున్నప్పుడు ఇక అధ్యక్షుడిగా సంజయ్ సింగ్, బ్రిజ్‌భూషణ్‌లలో ఎవరు ఉన్న వ్యత్యాసం లేదని విమర్శలు వచ్చాయి. బ్రిజ్‌భూషణ్ గుండాగిరి నుంచి రెజ్లింగ్‌ను కాపాడేందుకు క్రీడాకారులు ఆందోళన బాట పట్టగా.. ఎన్నికలు జరిగినా ఎటువంటి మార్పు రాలేదు. తాజా సస్పెన్షన్‌తో బ్రిజ్‌భూషణ్ దారికొస్తాడా? క్రీడాకారుల తరఫున ఓ ఆఫీస్ బేరర్‌కు అవకాశం ఇచ్చేందుకు అంగీకరిస్తారా? చూడాలి.

నవచిత్రం



సంక్రాంతి సందడిని రెట్టింపు చేసే సైంధవ్

'ఈ సంక్రాంతికి తమ 'సైంధవ్' చిత్రాలతోపాటు నాగార్జున 'నా సామిరంగ', మహేష్‌బాబు 'గుంటూరుకారం', 'హనుమాన్', ధనుష్ 'కెప్టెన్ మిల్లర్' తదితర చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. అయినప్పటికీ సంక్రాంతి సందడిని రెట్టింపు చేసే సినిమాగా తమ 'సైంధవ్' నిలుస్తుందనే నమ్మకం ఉంది' అని మేకర్స్ అన్నారు.
వెంకటేష్ నటిస్తున్న తన 75వ చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు. సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ స్వరపరచిన 'సరదా సరదాగా' పాట ఇటీవల విడుదలై అందర్నీ అలరిస్తోంది. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం, అనురాగ్ కులకర్ణి వాయిస్ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణను తీసుకొచ్చింది. మొదటి పాట మాస్‌కి, యూత్‌కి బాగా కనెక్ట్ అయితే, రెండో సింగిల్ ఫ్యామిలీలకు బాగా కనెక్ట్ అయ్యింది.
'ఇప్పటికే ఈ సినిమా పై అందరిలోనూ భారీ అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగా ఈ సినిమా కచ్చితంగా ఉంటుంది. వెంకటేష్ నట విశ్వరూపాన్ని చూడబోతున్నారు' అని చిత్ర యూనిట్ తెలిపింది.
హారిక ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ ఎస్.మణికందన్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్, గ్యారీ బిహెచ్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, రుహానీ శర్మ, ఆండ్రియా జెరెమియా, జయప్రకాష్ ఇతర ముఖ్య తారాగణంగా నటిస్తున్న ఈ చిత్రానికి కిషోర్ తాళ్లూరు సహ నిర్మాత. జనవరి 13న అన్ని దక్షిణ భారత భాషలు, హిందీలో ఈ సినిమా విడుదల కానుంది.

హీరోగా మరో మెట్టు ఎక్కించే సినిమా

"శాసనసభ' చిత్రంతో హీరోగా గుర్తింపు తెచ్చుకున్నారు ఇంద్రసేన. ఆయన నటించిన తాజా చిత్రం 'బద్మాష్ గాళ్లకి బంపర్ ఆఫర్'. రవి చావలి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని ఎస్.రమేష్ కుమార్ నిర్మించారు. ఈ నెల 29న చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో ఇంద్రసేనతో మీడియాతో ముచ్చటించారు.
"శాసన సభ' చిత్రం నటుడిగా ఎంతో గుర్తింపును తీసుకొచ్చింది. దీంతో బాధ్యతగా సినిమాలు చేయాలనుకున్నాను.'శాసనసభ' సినిమా కంటే ముందే ఓకే చేసిన సినిమా ఇది. ఈ చిత్రం నా కెరీర్‌ను మరో మెట్టు ఎక్కిస్తుందనే నమ్మకం ఉంది. నేడు సమాజంలో జరుగుతున్న మోసాలు, బ్లాక్‌మెయిల్ చుట్టు అల్లుకున్న కథ ఇది. పూర్తి ఎంటర్‌టైన్ మెంట్‌తో, ఆసక్తికరమైన స్క్రీన్‌ప్లేతో ఉంటుంది. ప్రతి పాత్ర ఎంతో సహజంగా ఉంటూ అలరిస్తుంది. పతాక సన్నివేశాల్లో మంచి సందేశం కూడా ఉంది. 'శాసనసభ'లో నా పాత్ర పూర్తి సీరియస్ లుక్‌లో ఉంటే, ఇందులో నా పాత్ర అందుకు పూర్తి విరుద్ధంగా వినోదంగా ఉంటుంది. నా బాడీలాంగ్వేజ్‌కు పర్‌ఫెక్ట్ సెట్ అయ్యే పాత్ర నాది. నటుడిగా మంచి స్కోప్ ఉన్న ఈ పాత్ర నాకు ఛాలెంజింగ్‌గా అనిపించింది. సినిమా ప్రారంభంలో నెగెటివ్ షేడ్స్‌తో మొదలయ్యే నా పాత్ర చివరిలో తప్పు తెలుసుకుని రియలైజ్ అవుతాడు. తప్పకుండా నా పాత్ర అందరికీ నచ్చుతుంది. రవిచావలి దర్శకత్వంలో నేను ఇంతకు ముందు 'సూపర్ స్కెచ్' సినిమాలో నటించాను. ఆయన లాంటి ప్రతిభ గల దర్శకుడి దర్శకత్వంలో నటించే అవకాశం అందరికి రాదు. ఈ చిత్రానికి దర్శకుడు రాసుకున్న కథే బలం. యూత్‌కు బాగా కనెక్ట్ అయ్యేసినిమా ఇది. విజయ్.సి.కుమార్ కెమెరా గొప్పతనం, భోలే షావలి పాటలు, మార్తండ్ కె.వెంకటేష్ ఎడిటింగ్ ఈ సినిమాకు అదనపు బలాలు' అని తెలిపారు.



దర్శకుడు సురేందర్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలో నెగటివ్ రోల్‌లో కనిపించబోతున్నాను. దీంతో పాటు నేను హీరోగా నటించే రెండు చిత్రాలు త్వరలో ప్రారంభం కాబోతున్నాయి. వీటి వివరాలు త్వరలోనే తెలియజేస్తాను. నా పాత్ర, కథ నచ్చితే విలన్‌గా కూడా నటించడానికి రెడీగా ఉన్నాను' అని అన్నారు.

- ఇంద్రసేన

27న గల్లంతే.. మెలోడీ రిలీజ్



కావ్య థాపర్, రవితేజ

రవితేజ తాజాగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ట్రైలర్‌తో సినిమాపై క్రేజ్ నెక్ట్స్ లెవల్‌కి చేరాయి. అలాగే ఫస్ట్ సింగిల్ ఊర మాస్ అంథమ్ 'ఆడు మచ్చా..' పాట చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ నేపథ్యంలో మేకర్స్ సెకండ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. సెకండ్ సింగిల్ 'గల్లంతే' పాటని ఈనెల 27న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. సాంగ్ పోస్టర్‌లో రవితేజ, కావ్య థాపర్ రొమాంటిక్ కెమిస్ట్రీ అందర్నీ ఆకట్టుకుంటోంది. ఫస్ట్ సింగిల్ మాస్ సాంగ్ అయితే సెకండ్ సింగిల్ మనసుని హత్తుకునే మెలోడీగా ఉంటుందని అనౌన్స్ మెంట్ పోస్టర్ సూచిస్తోంది.
ఇందులో రవితేజ మల్టిపుల్ షేడ్స్ ఉన్న పాత్రలో అలరించనున్నారు. అనుపమ పరమేశ్వరన్ మరో కథానాయికగా నటిస్తుండగా, నవదీప్, మధుబాల ఇతర ముఖ్య తారాగణం.
కార్తీక్ ఘట్టమనేని ఎడిటింగ్, దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి మణిబాబు కరణంతో పాటు దర్శకుడు స్వయంగా స్క్రీన్ ప్లే రాశారు. టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.సంక్రాంతి కానుకగా జనవరి 13న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది.
శ్రీనివాస్ అవసరాల, ప్రణీత పట్నాయక్, అజయ్ ఘోష్, శ్రీనివాస్ రెడ్డి, భాషా, శివ నారాయణ, మిర్చి కిరణ్, నితిన్ మెహతా, ధ్రువ, ఎడ్వర్డ్, మద్ది, జరా, అక్షర తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి మాటలు: మణిబాబు కరణం, సంగీతం: డేవ్ జాంద్, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: కార్తీక్ ఘట్టమనేని, కమిల్ ప్లాకి, కర్మ్ చావ్లా, ప్రొడక్షన్ డిజైనర్: శ్రీనాగేంద్ర తంగాల, సాహిత్యం: చైతన్య ప్రసాద్, కేకే, కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ కొల్లి, యాక్షన్: రామ్ లక్ష్మణ్, రియల్ సతీష్, టోమెక్.

మంగళూరులో నయా షెడ్యూల్ షురూ..



గోపీచంద్

గోపీచంద్ హీరోగా, కన్నడ దర్శకుడు ఎ.హర్ష దర్శకత్వంలో తెరకెక్కుతున్న యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమా'.
శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పై కెకె రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఆదివారం మంగళూరులో ప్రారంభమైంది. గోపీచంద్‌తో పాటు ఇతర తారాగణం పాల్గొనే ఈ షెడ్యూల్‌లో మంగళూరులోని దట్టమైన అడవిలో ఓ సాంగ్, యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో జరుగుతున్నాయి. మాస్, యాక్షన్‌తో కూడిన ఈ సినిమాలో ఫ్యామిలీ ఆడియన్స్‌ని మెప్పించే అంశాలు ఉంటాయి.
హై స్టాండర్డ్ టెక్నికల్, ప్రొడక్షన్ వాల్యూస్‌తో భారీ ఎత్తున తెరకెక్కుతున్న ఈ సినిమాలో గోపీచంద్ సరసన ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: స్వామి జె గౌడ, సంగీతం: రవి బస్రూర్, ప్రొడక్షన్ డిజైనర్: రమణ వంక, ఎడిటర్: తమ్మిరాజు, ఆన్‌లైన్ ఎడిటర్: కిరణ్, డైలాగ్స్: అజ్జు మహంకాళి, ఫైట్స్: రామ్-లక్ష్మణ్, వెంక, డాక్టర్ రవివర్మ.

ఘనంగా వ్యూహం.. జగ గర్జన వేడుక

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాజకీయ జీవితంలో జరిగిన కొన్ని ఘటనలను ప్రతిబింబిస్తూ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ రూపొందించిన సినిమా 'వ్యూహం'. ఈ సినిమాను రామదూత క్రియేషన్స్ బ్యానర్‌లో దాసరి కిరణ్ కుమార్ నిర్మించారు. పొలిటికల్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో వైఎస్ జగన్ పాత్రలో అజ్మల్ నటించగా, వైఎస్ భారతి పాత్రలో మానస కనిపించనుంది. ఈ సినిమా ఈ నెల 29న గ్రాండ్‌గా థియేటర్స్‌లోకి రాబోతోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ కార్యక్రమాన్ని విజయవాడలో ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్యే ఆదీప్ రాజ్, వైసీపీ సమన్వయకర్త ఫాతిమా, తెలుగు సేన అధ్యక్షుడు సత్యా రెడ్డి, మ్యూజిక్ డైరెక్టర్ కీర్తన, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్, మంత్రులు రోజా, అంబటి రాంబాబు, జోగి రమేష్, ఎమ్మెల్యే శివ కుమార్, క్రికెటర్ అంబటి రాయుడు తదితరులు అతిథులుగా విచ్చేసి చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ,'25 ఏళ్ల క్రితం ఎన్టీఆర్ జీవితంలో జరిగిన ఘటనల ఆధారంగా 'లక్ష్మీస్ ఎన్టీఆర్' సినిమా చేశాను. కానీ ఈ సినిమా నేపథ్యం ఇప్పుడు మన కళ్ల ముందు జరుగుతున్నదే. ఇందులో కథ కంటే క్యారెక్టర్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. రాజకీయాల్లో ఉన్న వ్యక్తులు బయటకు ఎలా కనిపిస్తారు?, వెనక ఎలాంటి కుట్రలు, కుతంత్రాలు, వ్యూహాలు పన్నుతారు అనేది నేను సైకలాజికల్ కోణంలో తెరకెక్కించాను. కాంటెంపరరీ అంశాలు ఉన్న వ్యూహం లాంటి మూవీ వరల్డ్ సినిమాలో రాలేదని చెప్పగలను' అని అన్నారు. 'ఉమ్మడి ఏపీ నుంచి ఇప్పటి ఆంధ్రప్రదేశ్‌లో 2009 నుంచి 2019 వరకు జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంతో ఈ సినిమా ఉంటుంది. ఇందులో యదార్థ ఘటనల స్ఫూర్తిగా ఫిక్షనల్ కథను చూస్తారు. మన పేపర్స్, టీవీ, యూట్యూబ్‌లో చూసిన విషయాలేవీ ఇందులో ఉండవు. ఆ ఘటనల వెనక దాగి ఉన్న కుట్రలు, కుతంత్రాలు, నిజాలతో వర్మ ఈ సినిమాను రూపొందించారు. తండ్రి చనిపోయినప్పుడు జగన్ ఆ బాధలో ఉండగానే...కేంద్ర పాలకులతో కుమ్మక్కై, కొందరు ఆయన జీవితంపై కుట్రలు చేశారు. జైలుకు పంపారు. జగన్ తన కుటుంబాన్ని భార్యా పిల్లల్ని వదిలి జైలు జీవితం గడిపారు. జైలు నుంచి బయటకు వచ్చి పాదయాత్రతో ప్రజల ప్రేమాభిమానాలు గెల్చుకున్నారు. ఇక్కడే ఇదే వేదిక మీద ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సినిమాను ఎంతో స్పష్టతతో, అవగాహనతో, అధ్యయనం చేసి వర్మ తెరకెక్కించారు' అని నిర్మాత దాసరి కిరణ్ కుమార్ చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

'ప్రజాతీర్పు'ను గౌరవించాలి!



ఎం. అరుణ్‌కుమార్
9010962016

ప్రజల నాడిని బట్టి పరిపాలన కొనసాగిస్తే అది కొంత వరకు సుపరిపాలన అవుతుంది. ప్రజలను ఖాతరు చేయకుం డా బానిసలుగా చూసి, ఆధిపత్యాన్ని చలాయించి, అహంకా రాన్ని ప్రదర్శించి, అధికార దుర్వినియోగానికి పాల్పడితే ఏ ప్రభుత్వానికైనా ఓటమి, అవమానం, ఛీత్కారాలు తప్పవు. పరిపాలనకు ఉన్న ఈ కనీస ధర్మాలను, రాజ్యాంగ నేపథ్యం లో సామాజిక బాధ్యతలను ఏ ప్రభుత్వాలు అయితే విస్మరి స్తాయో అవి శాశ్వతంగా ప్రజల చేతిలో ఓటమి పాలు కాక తప్పదు. అయితే సవరించుకొని, తప్పులను అంగీకరించి, ప్రజలను ప్రభువులుగా చూసే సంస్కారాన్ని ప్రదర్శించే రాజకీయ పార్టీలకు కొంత అవకాశం ఉండే పరిస్థితులు ఉంటాయి. కానీ అదే అహంకారాన్ని ఓటమి తర్వాత కూడా చట్టసభల్లో ప్రదర్శించి, ప్రజల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకోకుండా, తమ ఓటమికి కల కారణాలను విశ్లేషించుకోకుండా, ప్రభుత్వం మీద నియంతృత్వ ధోరణితో విమర్శలకు పాల్పడి, సభను విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేస్తే మాత్రం ఆ రాజకీయ పార్టీకి ప్రజలు ప్రభుత్వం చేతిలో పరాభవమే మిగులుతుంది. ఈనాడు అలాంటి పరిస్థితులు కేంద్ర ప్రభుత్వంతో సహా దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో కొనసాగుతున్నప్పటికీ ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమిపాలైన బీఆర్‌ఎస్ పోషిస్తున్న పాత్ర అక్షరాల ఈ సన్నివేశానికి వర్తిస్తుంది. ఇతర విపక్షాలు, ప్రజాస్వామ్యవాదులు, ప్రభుత్వం ముప్పేట విమర్శలకు దిగినా, చేసిన నేరాన్ని అంగీకరించని, ప్రజల ముందు తలవంచని పరిస్థితులు తెలంగాణ రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్‌లో చూడవచ్చు.

తొమ్మిదిన్నరేండ్ల సుదీర్ఘ పాలనలో వెనుకముందు చూడ కుండా చేసిన అప్పులు, యువతకు చేసిన అన్యాయం, సంక్షేమ పథకాలలోని డొల్లతనం, రాజకీయ ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న అవినీతి అంతాఇంతా కాదు. ఈ దుస్థితికి బీఆర్‌ఎస్ బాధ్యులు మాజీ ముఖ్యమంత్రి, మంత్రివర్గంపైన విచారణ జరిపించి దోషులను శిక్షించ వలసిన అవసరం ఉందని అనేక వర్గాల నుండి ఒత్తిడి వస్తున్న నేపథ్యంలో కూడా రాజీ పడకపోతే, సభా కార్యక్రమాలకు విఘ్నాతం కలిగిస్తే అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇది ప్రజాధనంతో ప్రజల కోసం పనిచేసే సుపరిపాలన కోరుకునే కోట్లాది ప్రజల ఆకాంక్ష.

కేసీఆర్ కుటుంబ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని, ప్రజల సొమ్మును కొల్లగొట్టిన వారి పైన తగు చర్యలు తీసుకొని శిక్షించాలంటే బాధ్యులైన బీఆర్‌ఎస్ నాయకుల పాస్‌పోర్టులను వెంటనే సీజ్ చేయాలి. కేసీఆర్ కుటుంబీకులు చేసిన విచ్చలవిడి అవినీతి, అక్రమాలను బయటికి తీయాలి. వారి కుటుంబీకులకు సహకరించిన అధికారుల పాస్‌పోర్టులను కూడా సీజ్ చేయాలి. భూకబ్జాలు, ఇతర అవినీతి ఆరోపణల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మంత్రులు కూరుకుపోయారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో సహా ఇతర ప్రాజెక్టులలోని అవినీతిపై విచారణ జరిపించాల్సిన అవసరం ఉన్నది. ఇది ప్రజల పక్షాన ప్రభుత్వానికి చేసిన డిమాండ్‌గా భావించవలసి ఉంటుంది. అయినా ఇవన్నీ బీఆర్‌ఎస్ ప్రధాన బాధ్యులకు తలకెక్కడం లేదంటే తమ గోతిని తామే తవ్వుకోవడానికి సిద్ధంగా ఉన్నారని అర్థం.

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపైన మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల్లో అట్టర్ ఫ్లాప్ అవుతుందని అనడం సరికాదు. ఇది ప్రజాతీర్పును అవమానించడమే. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 2014 నుండి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే పదేళ్లుగా పరిపాలించినప్పుడు ఇక కాంగ్రెస్ పార్టీని విమర్శించే అధికారం ఎక్కడిది ? పదే పదే 50 ఏండ్ల కాంగ్రెస్ పాలన గూర్చి మాట్లాడి విమర్శలకు గురైన కేటీఆర్, హరీష్ రావులపై ఒక దశలో సీపీఐ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అసహనం వ్యక్తం చేయడంతో పాటు బేరసారాలు మొదలుపెడతారా? ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తారా? కేటీఆర్ అలా మాట్లాడడం మంచిది కాదు అని హెచ్చరించిన తీరు బీఆర్‌ఎస్ శాసనసభ్యుల అసందర్భ వాదనకు చెక్ పెట్టినట్లుగా భావించాలి. పదే పదే కాంగ్రెస్‌కు 65 మంది సభ్యులు ఉంటే తమకు 39 మంది సభ్యులు ఉన్నారని, ఎలా పరిపాలన చేస్తారో చూస్తామని కేటీఆర్ బెదిరించడం ఆయన అహంకారానికి నిదర్శనం. ప్రజలు, ప్రజాస్వామికవాదులు తీవ్ర అభ్యంతరం తెలపాల్సిన విషయం ఇది.

ఈ ప్రభుత్వం ఏడాది కూడా ఉండదు అని బీఆర్‌ఎస్ శాసనసభ్యులు హెచ్చరిస్తున్నారంటే ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నారా? కొంతమంది శాసనసభ్యులు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని అది మంచిది కాదు. ఓడిపోవడం అనేది ప్రజాస్వామ్య ప్రక్రియలో ఒక భాగం. ప్రతిపక్షంగా కొత్త ప్రభుత్వానికి సహకరించాల్సిన బాధ్యత ఉంటుంది. స్వేచ్ఛ లేని జీవితాన్ని తెలంగాణ ప్రజలు అంగీకరించబోరు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మాట్లాడే స్వేచ్ఛ లేని కారణంగానే ప్రజలు తిరుగుబాటు చేసి ఓడించారు. అసెంబ్లీ సాక్షిగా కేటీఆర్ చేసిన ప్రసంగం ఇతర బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలలో సోయి తెప్పిస్తే సంతోషం. తెలంగాణ ధనిక రాష్ట్రమని, అన్నింటిలో నంబర్‌వన్ అని, బంగారు తెలంగాణ అని పదే పదే ప్రచారం చేసుకున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఏనాడైనా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు చెల్లించారా? ఇప్పటికీ విద్యార్థులకు సుమారు రూ.7000 కోట్ల స్కాలర్ షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయంటే గత పాలన ఎంత దుర్మార్గమయిందో అర్థం అవుతుంది. అసెంబ్లీలో సీపీఐ ఎమ్మెల్యే ప్రసంగిస్తుంటే పదేపదే అడ్డు తగిలిన బీఆర్‌ఎస్ సభ్యులను "సభలో ఇంత మంది కలిసి ఇబ్బంది పెడతారా. నన్ను బెదిరించ లేరు" అని ఆయన వారించవలసి వచ్చిందంటే ప్రభుత్వంతో పాటు ఇతర విపక్షాలను కూడా బీఆర్‌ఎస్ సభ్యులు ఎంత ఇబ్బందులకు గురి చేస్తున్నారో, ఎంత అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారో తెలుస్తోంది. ఇదంతా టీవీ ప్రసారాల ద్వారా ప్రజలు గమనిస్తున్నారు. ప్రజలు అవసర మైన సందర్భంలో తప్పకుండా ప్రతిస్పందిస్తారు. గత ఎన్నికల్లో ఓటమి పాలైనారంటే ప్రజల పరిశీలన మేరకే కదా!

ఇక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్న సందర్భంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన అనేకమంది శాసనసభ్యులు అడ్డు తగలడం, కొత్తగా శాసనసభ్యునిగా గెలిచిన పాడి కౌశిక్‌రెడ్డి సభలో వ్యవహరించిన తీరుపైన స్పీకర్ కలగజేసుకొని "కొత్త సభ్యుడివి. శాసనసభలో గడ్‌బడ్ చేయకు" అని చేసిన హెచ్చరిక ఆ పార్టీ మొత్తానికి గుణపాఠమైతే బాగుండు. టీవీలు, పత్రికలు ప్రసార మాధ్యమాలతో పాటు అన్నింటా వారి ప్రవర్తనను ప్రజలు గమనించడం చర్చనీయాంశం కాగా సుపరిపాలనకు ఏ రకంగాను బీఆర్‌ఎస్ పార్టీ సహకరించే పరిస్థితులు లేవని అందరూ అసహ్యించుకోవడం గమనించదగిన విషయం. "ఇదే పరిస్థితి కొనసాగితే సభలో కూడా కొనసాగలేరు. ప్రజలు తరిమికొడతారు" అని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించవలసి వచ్చిందంటే బీఆర్‌ఎస్ పార్టీ దిగజారుడుతనం అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజాతీర్పును శిరసావహించి, ప్రజల పక్షాన పనిచేయడం ద్వారా విశ్వాసాన్ని చూరగొనాలి. కానీ అడుగడుగునా సభలో అడ్డు తగిలి అహంకారాన్ని ప్రదర్శిస్తే ప్రజల నుండి ఎదురయ్యేది చేదు అనుభవాలే.



ఈ ప్రభుత్వం ఏడాది కూడా ఉండదు అని బీఆర్‌ఎస్ శాసనసభ్యులు హెచ్చరిస్తున్నారంటే ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నారా? కొంత మంది శాసనసభ్యులు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని అది మంచిది కాదు. ఓడిపోవడం అనేది ప్రజాస్వామ్య ప్రక్రియలో ఒక భాగం. ప్రతిపక్షంగా కొత్త ప్రభుత్వానికి సహకరించాల్సిన బాధ్యత ఉంటుంది. స్వేచ్ఛ లేని జీవితాన్ని తెలంగాణ ప్రజలు అంగీకరించబోరు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మాట్లాడే స్వేచ్ఛ లేని కారణంగానే ప్రజలు తిరుగుబాటు చేసి ఓడించారు. అసెంబ్లీ సాక్షిగా కేటీఆర్ చేసిన ప్రసంగం ఇతర బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలలో సోయి తెప్పిస్తే సంతోషం. తెలంగాణ ధనిక రాష్ట్రమని, అన్నింటిలో నంబర్‌వన్ అని, బంగారు తెలంగాణ అని పదే పదే ప్రచారం చేసుకున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఏనాడైనా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు చెల్లించారా?

నివేదికలు+విచారణలు @ 'కాళేశ్వరం'





వేముల క్రాంతికుమార్
9676717377

"ఈ ప్రాజెక్టు అద్భుతమైంది.. అపూర్వమైంది. కేసీఆర్... కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కాదు.. కాళేశ్వరం చంద్రశేఖర్‌రావు అని పిలవాలనిపిస్తోంది. ఇది మనిషి సృష్టించిన అద్భుతం. ఇంజినీరింగ్ అద్భుతమే కాదు అత్యంత ప్రత్యేకమైనది. మేము దేశంలో కానీ, విదేశాల్లో కానీ ఇలాంటి ప్రాజెక్టును ఎప్పుడూ చూడలేదు. తెలంగాణలోని ఇతర ప్రాజెక్టులకు ఇది ప్రయోజనం చేకూర్చే సమగ్ర ప్రాజెక్టు. గ్రామీణ అవకాశాలు పెంపొందిచే విధంగా ఉంది. రైతులకు ప్రయోజనం చేకూర్చే అద్భుతమైన ప్రాజెక్టు. తెలంగాణను కోనసీమగా మార్చిన ప్రాజెక్టు." అని అప్పటి గవర్నర్ నరసింహన్, తెలంగాణ ప్రస్తుత గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, సెంట్రల్ వాటర్ కమిషన్ ఉన్నతస్థాయి బృందం, పీఏఓ(ప్రాజెక్టు అప్రైజల్ ఆర్గనైజేషన్) చీఫ్ ఇంజనీర్ సీకేఎల్ దాస్, పీఏఓ డైరెక్టర్(సౌత్) ముఖర్జితోపాటు ఇంజనీర్లు, నాబార్డ్ చీఫ్ జీఆర్ చింతా, పలువురు ప్రముఖులు అభివర్ణించారు. ఒకానొక దశలో అది పర్యాటక ప్రాంతంగా కీర్తించే స్థాయికి వచ్చింది.

ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే మరోవైపు అవినీతి, అక్ర మాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. 21 జూన్ 2019న కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించగా ప్రస్తుతం స్కామేశ్వరంగా సాక్ష్యాత్కరిస్తోంది. ఎప్పుడైతే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బీజేపీ వ్యతిరేక పోరాట నినాదం ఎత్తాడో అప్పటి నుంచి ప్రాజెక్టు లోపాలు తెరపైకొచ్చాయి. ఈక్రమంలో ప్రాజెక్టు పరిధి అన్నారం, మేడిగడ్డ బ్యారే జీలోని పిల్లర్లు కూలడం అవినీతికి నిదర్శనంగా మారాయి. తమ బండారం ఎక్కడ బయట పడుతుందోనని భయపడిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం లోపాలను దాచిపెట్టింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ సీఎం రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడే ప్రాజెక్టుపై ఆరోపణలు చేశారు. దేశ చరిత్రలోనే అతిపెద్ద స్కాం కాళేశ్వరం ప్రాజెక్టులో జరిందని విచారణ చేపట్టాలని డిమాండ్ చేసిన విషయం విధితమే. మేడిగడ్డ సందర్శనకు వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి రాగానే కాళేశ్వరం సొమ్మును రికవరీ చేసి ప్రజల ఖాతాలో వేస్తామన్నారు. స్కాం వెనకాల 'మేఘ' కంపెనీ ఉందని, సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరారు. అలాగే తెలంగాణ శాసనమండలిలో అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మాణంపై చర్చలో కాళేశ్వరం ప్రాజెక్టు కాదు కమిషన్ ప్రాజెక్టు అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. జ్యుడిషియల్ విచారణ చేపట్టాలని కోరారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణకు ఆదేశాలు కూడా జారీచేశారు. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీబీఐ విచారణ చేపట్టాలని కాంగ్రెస్ నేత నిరంజన్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కాళేశ్వరం ఘటన సమ యంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీకి ఫిర్యాదులు రాగా రాష్ట్ర సీఎస్‌కు నేషనల్ డ్యాం సేఫ్టీ అథాటిరి లేఖ రాసింది. సీఎస్ నుంచి సమాచారం తీసుకుని రెండు వారాల్లో పూర్తి వివరాలు సమర్పించాలని హౌకోర్టు ఆదేశిస్తూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. అయితే కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇటీవల కేంద్రమంత్రులు, బీజేపీ నాయకుల మాటలు వింటే అనుమానాలకు తావిస్తోంది. కేంద్ర అనుమతులు లేకుండానే ప్రాజెక్టు కట్టారా అనే ప్రశ్న తలెత్తక మానదు.

మేడిగడ్డ బ్యారేజీ పూర్తి నిల్వ సామర్థం 16.17 టీఎంసీలు. మొదటిసారి 2020 ఫిబ్రవరి 15న 16.02 టీఎంసీల నీటిని నిల్వ చేశారు. బ్యారేజీలో 100 మీటర్ల ఎత్తు వరకు నీటిని నిల్వ చేసే అవకాశం ఉండగా అదే రోజు 99.95 మీటర్ల ఎత్తు వరకు నిల్వ చేయడంతో బ్యారేజీ ఎగువన తెలంగాణ, మహారాష్ట్రలో 1000 ఎకరాల భూములు నీట మునిగాయి. కానీ, అందరి నజర్ కాళేశ్వరం స్కామ్‌పైనే ఉంటోంది. ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల తీవ్రంగా నష్టపోతున్న రైతులకు శాశ్వత పరిష్కారం మాత్రం చూపెట్టని పరిస్థితి. ముఖ్యంగా మేడిగడ్డ బ్యారేజ్ బ్యాక్‌వాటర్‌తో జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల వ్యాప్తంగా 354 ఎకరాలు ఏటా నీటమునుగుతున్న పరిస్థితి. ఇక మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలవ్యాప్తంగా 264 ఎకరాల్లో బ్యాక్ వాటర్ ప్రభావం పడుతోంది. అలాగే మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా సిరొంచ మండల వ్యాప్తంగా 355 ఎకరాలు ప్రభావితమవుతున్నాయి. బాధిత రైతులు తమకు నష్టపరిహారం చెల్లించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నిరసనలు, ధర్నాలు చేపట్టినా పట్టించుకున్న దాఖలాలు లేవు. బ్యారేజీ బ్యాక్‌వాటర్‌తో వెయ్యి ఎకరాల పైచిలుకు భూములు ముంపునకు గురవుతున్నాయని, జనరల్ అవార్డు కింద ఎకరాలకు రూ.6.97లక్షల చొప్పున మొత్తం రూ.60 కోట్లు నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని ప్రతిపాదిం చారు. కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో తెలంగాణ, మహారాష్ట్రలో కలిపి సుమారు వెయ్యి ఎకరాలు నీట మునుగుతుండగా జనరల్ అవార్డు కింద రూ.60కోట్ల పరిహారం చెల్లించాల్సి ఉందని అధికా రులు స్పష్టం చేసిన ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. గత నాలుగేండ్లుగా ఇదే దుస్థితి నెలకొంది. 2022 మేలోనే ముంపు వివరాలు ప్రభుత్వానికి అందజేశారు. అయినా స్పందన లేకుండా పోయింది. ఇప్పటికే నోటిఫై అయిన 130 హెక్టార్ల భూమికి పరిహారం వెంటనే ఇప్పించడంతో పాటు అదనంగా ముంపునకు గురువుతున్న భూముల గురించి ప్రత్యేకంగా సర్వే చేయిస్తామని హామీ ఇచ్చినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. మరి ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనైనా సీఎం ఆదేశాలతో అవినీతికి చరమగీతం పాడి బాధిత రైతులను ఆదుకుంటారా? లేదా ? అనేది వేచి చూడాల్సిందే.

కాళేశ్వరం ఘటన సమయంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీకి ఫిర్యాదులు రాగా రాష్ట్ర సీఎస్‌కు నేషనల్ డ్యాం సేఫ్టీ అథాటిరి లేఖ రాసింది. సీఎస్ నుంచి సమాచారం తీసుకుని రెండు వారాల్లో పూర్తి వివరాలు సమర్పించాలని హౌకోర్టు ఆదేశిస్తూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. అయితే కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇటీవల కేంద్రమంత్రులు, బీజేపీ నాయకుల మాటలు వింటే అనుమానాలకు తావిస్తోంది. కేంద్ర అనుమతులు లేకుండానే ప్రాజెక్టు కట్టారా అనే ప్రశ్న తలెత్తక మానదు.

దీపిక

EWS reservations ను అమలు చేసిన మొట్టమొదటి రాష్ట్రం ఏది?

డాక్టర్ అలీ సార్,
9494228002
భారత రాజ్యాంగ నిపుణులు





1. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 12 ప్రకారం రాజ్య పరిధిలోకి వచ్చే సంస్థలను క్రింది వాటిలో సరైనవి గుర్తించండి.
1. సహకార సంస్థలు
2. సొంత నిధులతో నడిచే సంస్థలు
3. సొసైటీ చట్టం 1860 ద్వారా నమోదైన సంస్థలు
4. కేంద్ర రాష్ట్ర సభలు

2. భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను ఏ దేశ రాజ్యాంగం నుండి గ్రహించాము?
1. కెనడా 2. ఐర్లాండ్
3. యుఎస్ఆర్ 4. అమెరికా

3. ఈ క్రింది ఏ కేసులో న్యాయస్థానాల కార్యనిర్వాహక విధులు కూడా రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తాయని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది?
1. అజయ్ సహాయ్ Vs ఖాలీద్ ముజీద్
2. సెయింట్ జేవియర్ కాలేజ్ Vs గుజరాత్
3. ఆర్.ఎస్. నాయక్ Vs ఎ.ఆర్. అంతులే
4. పైవన్నీ

4. చట్టం మూలానా సమాన రక్షణ అనే భావనను ఏ దేశ రాజ్యాంగం నుండి గ్రహించాము?
1. బ్రిటిషు 2. అమెరికా
3. జపాన్ 4. కెనడా

5. ఈక్రింది వాటిలో సరైన వాక్యాన్ని గుర్తించండి.
1. ప్రాథమిక హక్కుల సలహా సంఘానికి నేతృత్వం వహించినది జె.బి. కృపలాని
2. ప్రాథమిక హక్కుల ఉపసంఘానికి నేతృత్వం వహించినది సర్దార్ వల్లభాయ్ పటేల్
3. ఆస్తి హక్కు ప్రస్తుతం రాజ్యాంగంలో కలదు
4. పై ఏదీకాదు

6. జతపరుచుము.
రాజ్యాంగ పరిధిలోకి వచ్చే సంస్థలు-కేసులు.

ఎ. విశ్వవిద్యాలయాలు	1. సోంప్రకాశ్ రేఖి Vs UOI
బి. పెట్రోలియం సంస్థలు	2. ఆర్.డి.శెట్టి Vs IAA
సి. ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు అథారిటీ	3. ఉమేష్ సింగ్ Vs U.N. సింగ్
డి. ప్రభుత్వ సహాయం పొందే ఎయిడెడ్ పాఠశాల	4. మన్మోహన్ సింగ్ జైట్లీ Vs.UT సింగ్

1. ఎ1, బి3, సి2, డి4 2. ఎ3, బి1, సి4, డి2
3.ఎ1, బి2, సి3, డి4 4.ఎ3, బి1, సి2, డి4

7. క్రింది వాటిలో గ్రహణ సిద్ధాంతం (డాక్ట్రిన్ ఆఫ్ ఎక్లిప్స్) అనగా..
1. హక్కులను వదులుకోవడం
2. స్వాతంత్ర్యపు అనంతర చట్టాలు ప్రాధాన్యత అనుసరించి వాటిని అమలు చేస్తారు.
3. స్వాతంత్ర్యపు పూర్వచట్టాలు ప్రాధాన్యత
4. పై ఏదీకాదు

8. ఈక్రింది ఏ కేసులో గ్రహణ సిద్ధాంతాన్ని కేవలం రాజ్యాంగ పూర్వపు చట్టాలకు మాత్రమే కాకుండా అనంతర చట్టాలకు కూడా వర్తింపజేస్తామని భారత సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.
1. దీప్‌చంద్ Vs స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్
2. శ్రీ అంబికా మిల్స్ Vs స్టేట్ ఆఫ్ గుజరాత్
3. బికాజీ నారాయణ్ Vs స్టేట్ ఆఫ్ మధ్యప్రదేశ్
4. బేహారం Vs స్టేట్ ఆఫ్ బాంబే

9. భారత రాజ్యాంగంలో క్రింది ఏ అధికరణ దేశ న్యాయవ్యవస్థకు న్యాయసమీక్ష అధికారం కల్పించింది.
ఆర్టికల్ 12 2. ఆర్టికల్ 13
3. ఆర్టికల్ 368 4. పైఏదీకాదు

10. చట్టం ముందు అందరూ సమానులే అనే భావనను ఏ దేశ రాజ్యాంగం నుండి గ్రహించారు?
1. అమెరికా 2. జపాన్
3. దక్షిణాఫ్రికా 4. బ్రిటన్

11. పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలని లైంగిక వేధింపుల నుండి కాపాడాలని వారికి సరైన సౌకర్యాలు కల్పించాలని సుప్రీంకోర్టు క్రింది ఏ కేసులో తీర్పునిచ్చింది?
1. కె.పి. ప్రభాకర్ రెడ్డి Vs UOI
2. రాజేష్ కుమార్ గుప్తా Vs UP
3. విశాఖ Vs రాజస్థాన్
4. రణదీప్ సింగ్ Vs UOI

12. భారత రాజ్యాంగంలో క్రింది ఏ అధికరణ సామాజికంగా, విద్యా పరంగా వెనుకబాటుకు గురైన ఎస్సీ, ఎస్టీలకు విద్యలో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించింది?
1. ఆర్టికల్ 15(3) 2. ఆర్టికల్ 15(4)
3. ఆర్టికల్ 15(2) 4. ఆర్టికల్ 15(5)

13. ఆర్థికంగా వెనుకబాటుకు గురైన అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లకు సంబంధించి క్రింది వాక్యాలలో సరికాని వాక్యాలను గుర్తించండి.
1.124వ రాజ్యాంగ సవరణ బిల్లు
2. 14 జనవరి 2019 నుండి అమల్లోకి వచ్చింది
3. 103వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం 15(6)16(6) నూతన నిబంధనలు చేర్చారు
4. పై ఏదీకాదు

14. క్రింది ఏ అధికరణ ప్రకారం 14 సంవత్సరాల వయస్సులోపు బాలబాలికలు నిర్బంధ స్థలాలైన గనులు పేలుడు పదార్థాలు తయారీ వంటి చోట్ల పనిచేయించుటకు నిషేధించడమైనది.
1. ఆర్టికల్ 25 2. ఆర్టికల్ 20
3. ఆర్టికల్ 23 4. ఆర్టికల్ 24

15. ఆర్టికల్ 23కి సంబంధించి సరైన వాక్యాలు గుర్తించండి.
1. మనుషుల అమ్మకాలు, కొనుగోలు వంటి అక్రమ రవాణా నిషేధం
2. బానిసత్వం, వెట్టిచాకిరి, బలవంతంగా బిక్షమెత్తించడం వంటి అంశాలు
3. 1 మరియు 2 4. పై ఏదీకాదు

16. కింది వాటిలో సరికాని వాక్యాన్ని గుర్తించండి.
1. బాలకార్మిక నిషేధ చట్టం 2005
2. వరకట్న నిషేధ చట్టం 1976
3. కనీస వేతనములు చట్టం 1976
4. బాలల హక్కుల చట్టం 1938

17. ఈక్రింది ఏ కేసులో సుప్రీంకోర్టు "సాధారణ చట్టాలను మాత్రమే న్యాయసమీక్షకు గురిచేస్తామని రాజ్యాంగ సవరణలను న్యాయ సమీక్షకు గురి చేయరాదని తీర్పునిచ్చింది.
1. గోలక్‌నాథ్ కేసు-1967
2. సజ్జన్ సింగ్ Vs స్టేట్ ఆఫ్ రాజస్థాన్ 1965
3. శంకరీ ప్రసాదు Vs UOI 1951
4. 2 మరియు 3

18. 103వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం ఆర్థికంగా వెనుకబాటుకు గురైన అగ్రవర్ణ పేదలకు విద్యాసంస్థలలో ఎంతశాతం రిజర్వేషన్ కల్పించారు?
1. 27% 2. 17% 3. 10% 4. 50%

19. ఆర్టికల్ 16(3) ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలను అందించడంలో నివాసం ఆధారంగా పరిమితులు విధించే అధికారం ఎవరికి కలదు?
1. రాష్ట్రపతి 2. ప్రధానమంత్రి
3. పార్లమెంటు 4. గవర్నర్లు

20. క్రింది ఏ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం యస్‌సి, యస్‌టి లకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు సీనియారిటీ ప్రకారం చేయాలనే అంశాన్ని చేర్చారు?
1. 77వ రాజ్యాంగ సవరణ చట్టం
2. 85వ రాజ్యాంగ సవరణ చట్టం
3. 90వ రాజ్యాంగ సవరణ చట్టం
4. 102వ రాజ్యాంగ సవరణ చట్టం

21. క్రింది వాక్యాలలో సరికాని అంశాలను గుర్తించండి.
1. విదేశాలు ప్రకటించే లేదా ఇచ్చే బిరుదులను భారత పౌరుడు స్వీకరించరాదు.
2. ఒక వ్యక్తి భారత పౌరుడు కాకపోయినప్పటికీ భారత ప్రభుత్వం ద్వారా ఆదాయాన్నిచ్చే ఏ ఉద్యోగాన్నైన లేదా పదవినైన నిర్వర్తిస్తున్న సమయంలో విదేశాలు ఇచ్చే బిరుదులను స్వీకరించవచ్చు.
3. 1 మరియు 2 4. పై ఏదీకాదు

22. కేంద్ర ప్రభుత్వం బీసీ క్రిమిలేయర్ పరిమితిని ఎంత మొత్తానికి పెంచుతూ 31 అక్టోబరు 2017న ఉత్తర్వులు జారీ చేసింది?
1. 6,00,000 2. 10,00,000
3.8,00,000 4. 4,50,000

23. ఓబిసి జాబితాలోని కులాల సంఖ్యలో మార్పులు చేర్పులు చేసే అధికారం రాష్ట్రాలకు ఇవ్వడానికి రూపొందించిన 127వ రాజ్యాంగ సవరణ బిల్లును రాష్ట్రపతి ఎప్పుడు ఆమోదించారు?
1.25.08.2021 2. 18.08.2021
3.10.08.2021 4. 11.08.2021

24. బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేసే క్రమంలో రిజర్వేషన్లు 50% పైన కూడా ఉండవచ్చు అని క్రింది ఏ రాజ్యాంగ సవరణ చట్టం పేర్కొంటుంది?
1. 85వ రాజ్యాంగ సవరణ చట్టం
2. 83వ రాజ్యాంగ సవరణ చట్టం
3. 81వ రాజ్యాంగ సవరణ చట్టం
4. 77వ రాజ్యాంగ సవరణ చట్టం

25. క్రింది వాక్యాలలో సరికాని వాక్యాన్ని గుర్తించండి.
1. భారత రాజ్యాంగంలో అస్పృశ్యత నిర్వచనం ఆర్టికల్ 17లో వివరించబడింది
2. అస్పృశ్యత నిషేధ చట్టం 1955ను పౌరహక్కుల పరిరక్షణ చట్టం 1976 గా మార్చారు
3. 1 మరియు 2 4. పై ఏదీకాదు

26. ఇంటర్నెట్ కూడా ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు క్రింది ఏ కేసులో తీర్పునిచ్చింది.
1. అనురాధ బాసిన్ Vs UOI
2. PUCL Vs UOI
3. శ్రీమతి ఖుష్బు Vs తమిళనాడు
4. పై ఏదీకాదు

27. జతపరుచుము. ఆర్టికల్స్ -వివరణ

ఎ. 19(బి)	1. సంఘాలు, సంస్థలు స్థాపించుకొనుట
బి. 19(1జి)	2. సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకొనే స్వేచ్ఛ
సి. 19(1సి)	3. వృత్తి స్వేచ్ఛ
డి. 19(1డి)	4. సంచార స్వేచ్ఛ

1.ఎ2, బి3, సి1, డి4 2.ఎ1, బి2, సి3, డి4
3.ఎ1, బి3, సి4, డి2 4.ఎ1, బి3, సి2, డి4

28. గతించిన చట్టాలను అనుసరించి గాని లేక భవిష్యత్‌లో రాబోయే చట్టాలను ఆధారం చేసుకొని ఏ వ్యక్తిని శిక్షింపరాదు. దీనిని న్యాయపరిభాషలో ఏమంటారు?
1. సెల్ఫ్ ఇంక్రిమినేషన్ 2. ఎక్స్‌పోస్ట్ ఫ్యాక్టో
3. డబుల్ జియోపార్డే 4. టెస్టిమోనియల్ కంపల్సన్

29. జాతీయ అత్యవసర పరిస్థితి కాలంలో జీవించే హక్కును రద్దు చేయకుండే పద్ధతిని ఏ దేశ రాజ్యాంగం నుండి గ్రహించాము?
1. అమెరికా 2. జపాన్
3. ఐర్లాండ్ 4. కెనడా

30. మతమును ప్రోత్సహించుటకు పన్ను చెల్లింపులో స్వేచ్ఛను కల్పించే ఆర్టికల్ ఏది?
1. ఆర్టికల్ 26 2. ఆర్టికల్ 27
3. ఆర్టికల్ 25 4. ఆర్టికల్ 29

31. భారత రాజ్యాంగంలో ఏ ప్రకరణ "ప్రభుత్వ నిధుల ద్వారా నిర్వహిస్తున్న విద్యాసంస్థలలో ఏ విధమైన మత బోధన జరగరాదు' అని వివరిస్తుంది.
1. ఆర్టికల్ 29 2. ఆర్టికల్ 30
3. ఆర్టికల్ 27 4. ఆర్టికల్ 28

32. ఈక్రింది ఏ ప్రకరణను డా.బి.ఆర్. అంబేద్కర్ "రాజ్యాంగానికి ఆత్మ/హృదయం" వంటిది అని పేర్కొన్నారు?
1.30 2. 32 3. 29 4. పై ఏదీకాదు

33. ఈక్రింది వానిలో మాండమస్ రిట్ వర్తించని వారిని గుర్తించుము.
1. ప్రయివేటు వ్యక్తి / వ్యక్తులు
2. భారత రాష్ట్రపతి / గవర్నర్స్
3. విదేశీయులు 4. పై అందరూ

34. భారత రాజ్యాంగంలో "హెబియస్ కార్పస్ రిట్ (బందీ హాజరు) జారీ చేసే అధికారం వీరికి మాత్రమే ఉంటుంది?
1. హైకోర్టు 2. సుప్రీంకోర్టు
3. ఆధీన కోర్టు 4. 1 మరియు 2

35. ఒక వ్యక్తి ఆర్థికంగా వెనుకబడిన తరగతుల హెూదా పొందాలంటే ఈక్రింది వాటిలో ఏ అర్హత/ అర్హతలు ఉండకూడదు.
1. అతని/ఆమె వార్షిక కుటుంబ ఆదాయం 8 లక్షలు మించరాదు
2. 5 ఎకరాల కన్నా ఎక్కువ వ్యవసాయ భూమి కల్గి ఉండరాదు
3. నోటిఫైడ్ మున్సిపాలిటీల్లో 100 గజాల కన్నా ఎక్కువ నివాస స్థలం ఉండరాదు 4. పై ఏదీకాదు

36. EWS reservations ను అమలు చేసిన మొట్టమొదటి రాష్ట్రం ఏది?
1. ఉత్తరప్రదేశ్ 2. తెలంగాణ
3. గుజరాత్ 4. మహారాష్ట్ర

37. 102వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా భారత రాజ్యాంగంలో చేర్చబడిన ఆర్టికల్ 342 (ఎ) గురించి వాటిలో సరైనవి గుర్తించండి.
ఎ. జాతీయ వెనుకబడిన కులాల కమీషన్ యొక్క విధి విధానాలు అధికార బాధ్యతల గురించి తెలియజేస్తుంది.
బి. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్
సి. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల జాబితాల్లో మార్పులు చేయడానికి రాష్ట్రపతికి గల అధికారాలు.
డి. ఏదయినా కులాన్ని సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులుగా గుర్తించే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది.
1. ఎ మరియు బి 2. సి మరియు డి
3. ఎ, బి, సి, డి 4. ఎ, బి, డి

38. సాధారణ వ్యక్తులు జాతీయ జెండాను ఎగురవేయడం కూడా భావ వ్యక్తీకరణ స్వేచ్ఛగానే భావించాలని సుప్రీంకోర్టు క్రింది ఏ కేసులో తీర్పునిచ్చింది.
1. నవీన్ జిందాల్ Vs UOI
2. బెనెట్ కొల్మన్ Vs UOI
3. బిందు ఇమ్మాన్యుల్ Vs కేరళ 4. పై ఏదీకాదు

39. రాజద్రోహం IPC124(A) గురించి కింది వాటిలో సరైనవి గుర్తించండి.
1. థామస్ మెకాలే నేతృత్వంలో 1870 సంవత్సరంలో IPC లో చేర్చారు.
2. రాజద్రోహ చట్టం ప్రకారం 1897లో మొట్టమొదటి సారిగా బాలగంగాధర తిలక్‌ను అరెస్ట్ చేశారు
3. కేదార్‌నాథ్ సింగ్ Vs state of Bihar కేసులో రాజ్యాంగ బద్ధమే అని తీర్పు 4. పైవన్నీ

40. కింది ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల నుండి తొలగించారు.
1. 44వ రాజ్యాంగ సవరణ చట్టం
2. 42వ రాజ్యాంగ సవరణ చట్టం
3. 27వ రాజ్యాంగ సవరణ చట్టం
4. 91వ రాజ్యాంగ సవరణ చట్టం

41. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో కారుణ్య మరణాన్ని అనుమతించవచ్చని సుప్రీంకోర్టు క్రింది ఏ కేసుల్లో తీర్పునిచ్చింది?
1. అరుణాషాన్‌బాగ్ కేసు
2. కామన్ కాస్ Vs UOI కేసు
3. 1 మరియు 2 4. ఏదీకాదు

42. ప్రాథమిక హక్కులను రద్దు చేసే అధికారం ఎవరికి ఉంటుంది?
1. సుప్రీంకోర్టు 2. పార్లమెంటు
3. రాష్ట్రపతి 4. ప్రధానమంత్రి

43. ఆర్టికల్ 12 ప్రకారం రాజ్య నిర్వచనంలోని అంశాలను క్రింది వాటిలో ఏవి?
ఎ. స్థానిక సంస్థలు బి. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు
సి. రాష్ట్ర శాసనసభలు డి. సహకార సంఘాలు
1. ఎ, బి 2. ఎ, సి, డి
3. బి, డి 4. ఎ, బి, సి

44. భారత సుప్రీంకోర్టు ఏ కేసులో రాజ్యాంగ మౌలిక స్వరూపాలని భంగం కలిగించేటట్లుగా ప్రాథమిక హక్కులకు రాజ్యాంగ సవరణ జరిగితే అదిచెల్లదు అని తీర్పునిచ్చింది?
1. గోలక్ నాథ్ Vs స్టేట్ ఆఫ్ పంజాబ్
2. శంకరీప్రసాద్ Vs UOI
3. కేశవానంద భారతి కేసు 4. ఏదీకాదు

45. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 26కు సంబంధించి క్రింది వాక్యాలలో సరైనవి గుర్తించండి.
1. మత వ్యవహారాల నిర్వహణలో స్వేచ్ఛను కల్పిస్తుంది.
2. మత విషయాలలో స్వీయ వ్యవహారాలను నిర్వహించుటకు హక్కులను కల్పిస్తుంది.
3. స్థిర చరాస్తుల సంపాదన మరియు ఆధీన హక్కులు
4. పైవన్నీ

46. క్రింది వాక్యాలలో సరైనవి గుర్తించండి.
1. రాజ్యంచే పోషించబడే విద్యా సంస్థలలో మత బోధన పూర్తిగా నిషేధం
2. రాజ్యాంచే గుర్తించబడ్డ విద్యాసంస్థలలో మత బోధనకు అనుమతి ఉంటుంది.
3. ఎ మరియు బి 4. ఏదీకాదు

47. భారతదేశంలో నివసిస్తున్న పౌరులలో ఏవర్గం వారైన తమ విశిష్ట భాష, లిపి, సంస్కృతిని కాపాడుకునే హక్కు ఉంది అని ఏ ఆర్టికల్ పేర్కొంటుంది?
1. ఆర్టికల్ 25 2. ఆర్టికల్ 29
3. ఆర్టికల్ 27 4. ఆర్టికల్ 30

48. ఈక్రింది వాటిలో ఏ రిట్ ను అక్రమ నిర్బంధంలో ఉన్న వ్యక్తిని విడుదల చేయడానికి తగిన న్యాయ సంస్థ/సంఘం జారీ చేస్తుంది?
1. హెబియస్ కార్పస్ 2. ప్రొహిబిషన్
3. మాండమస్ 4. కోవారంటో

సమాధానాలు

1.4	2.4	3.3	4.2	5.3
6.4	7.3	8.2	9.2	10.4
11.3	12.2	13.4	14.4	15.3
16.1	17.4	18.3	19.3	20.2
21.2	22.3	23.2	24.3	25.1
26.1	27.1	28.2	29.2	30.2
31.4	32.2	33.4	34.4	35.4
36.3	37.2	38.1	39.4	40.1
41.3	42.3	43.4	44.3	45.4
46.3	47.2	48.1		